TGTEL/25/A1294

# ప్రజాక్షేత్రం

ప్రతి క్షణం.. ప్రజల పక్షం

సంపుటి: 03 | సంచిక: 112 | హైదరాబాద్ | సోమవారం 12-10-2026 | పేజీలు: 12



## శివాజీని మతానికి పరిమితం చేయొద్దు

- పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడి
- సంగారెడ్డి బైపాస్ రోడ్డులో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ
- చరిత్రను రాజకీయాలకు వాడుకుంటున్నారని బీజేపీపై విమర్శ
- శివాజీ సైన్యంలో ముస్లిం అధికారులు కూడా ఉన్నారని వెల్లడి
- కులమతాల కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని వ్యాఖ్య
- రాజ్య భద్రతకు శివాజీ ప్రాధాన్యమిచ్చారని స్పష్టం

2



2

## గోవాను డ్రగ్స్ అడ్డాగా మార్చేశారు

- బీజేపీ పాలనలో గోవా ప్రజలకు తీవ్ర అన్యాయం
- కార్పొరేట్ల చేతుల్లోకి భూములు వెళ్లకుండా కాపాడుకోవాలి
- ఉపాధి లేక నిరాశలో గోవా యువత
- డ్రగ్స్‌కు అడ్డాగా గోవా మారింది
- ప్రధాన నగరాలకు గోవా నుంచే మాదకద్రవ్యాల సరఫరా
- గోవా అస్తిత్వాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత: రేవంత్ రెడ్డి



2

కౌకూర్‌లో ఆరేళ్ల బాలుడి హత్య..

## రూ.20 లక్షల కోసం కిడ్నాప్!

- ఆడుకుంటూ కనిపించకుండా పోయిన మోజెస్ అరులియా
- క్లబ్‌హౌస్ సంపులో చిన్నారి మృతదేహం
- కాళ్లు, చేతులు కట్టేసిన స్థితిలో బాలుడు
- కుటుంబానికి ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్
- వాచ్‌మెన్ విక్రమ్‌పై అనుమానాలు
- పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసుల గాలింపు
- కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు
- సికింద్రాబాద్‌లో కలకలం రేపిన ఘటన
- కిడ్నాప్, హత్య వెనుక కారణాలపై దర్యాప్తు

## గోవా–హైదరాబాద్ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు..



2



## 'సర్' పేరుతో మైనారిటీల ఓట్ల తొలగింపు

- 13 కోట్ల ఓట్లు తొలగించారని ఆరోపణ
- ఎన్నికల సంఘం తీరుపై బీఆర్ఎస్ నేత విమర్శలు
- మైనారిటీల హక్కులను కాలరాస్తున్నారని వ్యాఖ్య
- ఢిల్లీలో నిరసనలను అణచివేస్తున్నారని ఆరోపణ
- ఇంటర్నెట్ నిలిపివేత, రహదారుల మూసివేతపై విమర్శలు
- తెలంగాణలోనూ ఇదే కుట్ర జరిగే ప్రమాదం ఉందని వ్యాఖ్య
- మైనారిటీలంతా ఏకమై అడ్డుకోవాలని పిలుపు
- సిద్దిపేటలో మైనారిటీల సమావేశంలో కేటీఆర్ ప్రసంగం
- కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘంపై ధ్వజం

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** 'సర్' పేరుతో మైనారిటీల ఓట్లను తొలగించేందుకు ఎన్నికల సంఘం కుట్ర చేస్తోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆరోపించారు. ఇది మైనారిటీల ఓటు హక్కులను కాలరాసే ప్రయత్నమని విమర్శించారు. ఆదివారం సిద్దిపేటలో నిర్వహించిన మైనారిటీల సమావేశంలో పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వంతోపాటు ఎన్నికల సంఘం తీరుపై తీవ్రంగా మండిపడ్డారు. 'సర్' పేరుతో ఇప్పటివరకు 13 కోట్ల మంది మైనారిటీల ఓట్లను తొలగించారని కేటీఆర్ ఆరోపించారు. ఈ పరిణామాలపై దేశ రాజధాని ఢిల్లీలో యువత ధర్నాలు, రాస్తారోకోలు, నిరసనలు మిగతా 2 లో..

## ఎల్‌నినో ఎఫెక్ట్.. రెండో పంట

# వేయొద్దు!

తెలంగాణలో ఎల్‌నినో ప్రభావంతో కరువు ముప్పు

రెండో పంట వేయొద్దంటూ రైతులకు మంత్రి విజ్ఞప్తి

యూనిట్ రూ.15 పెట్టినా దొరకని విద్యుత్

నీటి ఎద్దడిపై ప్రత్యేక కేబినెట్ భేటీ

రాష్ట్రంలో తీవ్ర వర్షా భావం.. నీటి ఎద్దడి ప్రమాదం

సాగునీటితో పాటు తాగునీటికీ కష్టాలు తప్పవు

మొదటి పంటను వంద శాతం కాపాడుకుంటాం

యాసంగి సాగుకు దూరంగా ఉండండి

రైతులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి విజ్ఞప్తి



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** రాష్ట్రంలో రానున్న కాలంలో తీవ్ర వర్షాభావ పరిస్థితులు, నీటి ఎద్దడి ఏర్పడే ప్రమాదం ఉందని రాష్ట్ర రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హెచ్చరించారు. ఖమ్మం జిల్లా పాలేరు నియోజకవర్గంలో నిర్వహించిన వివిధ కార్యక్రమాల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రపంచవ్యాప్తంగా, దేశవ్యాప్తంగా ప్రభావం చూపుతున్న 'ఎల్‌నినో' (El Nino) పరిస్థితుల కారణంగా రాష్ట్రంలో సాగు నీటితో పాటు మిగతా 2 లో..

## ఒకే వేదికపై మోదీ, విజయ్

- రూ.13 వేల కోట్ల ప్రాజెక్టులకు శ్రీకారం
- చెన్నైలో అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న ప్రధాని, సీఎం
- చెన్నై మెట్రో ఫేజ్-2 మార్గం ప్రారంభం
- పూనమల్లి నుంచి పోరూర్ వరకు మెట్రోలో ప్రయాణం
- యూపీఐతో టికెట్ కొనుగోలు చేసిన మోదీ
- తమిళనాడు అభివృద్ధికి కేంద్రం సహకరిస్తుందని ప్రధాని హామీ
- మెట్రో ఫేజ్-3 పొడిగింపునకు విజయ్ విజ్ఞప్తి
- చెన్నై–కన్యాకుమారి హైస్పీడ్ రైలుకు ప్రతిపాదన
- ఎలక్ట్రానిక్స్ ఎగుమతుల్లో భారత్ పురోగతిపై మోదీ ప్రశంసలు
- తూత్తుకుడి పోర్టును గ్రీన్ ఎనర్జీ హబ్‌గా అభివృద్ధి చేసే ప్రణాళిక



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** తెలంగాణలో ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపునకు సంబంధించిన ప్రింటెడ్ ఫారం7 దరఖాస్తులు కలకలం రేపుతున్నాయి. ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియలో భాగంగా రాష్ట్రంలోని పలు నియోజకవర్గాల్లో ఇలాంటి దరఖాస్తులు వెలుగులోకి వచ్చాయి. సాధారణంగా చేతిరాతతో వచ్చే ఫారం7 దరఖాస్తులు.. ఇక్కడ ఓటర్ల వివరాలను ముందే ప్రింట్ చేసి కట్టలుగా బూత్ లెవల్ అధికారులకు అందిస్తున్నట్లు గుర్తించారు. దీంతో ఈ దరఖాస్తులు ఎక్కడి నుంచి వస్తున్నాయి? ఎవరు ప్రింట్ చేస్తున్నారు? బీఎల్‌వోలకు ఎవరు అందిస్తున్నారు? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ వ్యవహారంపై కాంగ్రెస్ పార్టీ ఎన్నికల విభాగం నేతలు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డికి ఫిర్యాదు చేశారు.

తమిళనాడు అభివృద్ధిని మరింత ముందుకు తీసుకెళ్లేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కలిసి పనిచేస్తాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. రాష్ట్రాల ఆకాంక్షలను నెరవేర్చేందుకు కేంద్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు. తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌తో కలిసి రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తామని స్పష్టం చేశారు. చెన్నైలో ఆదివారం నిర్వహించిన పలు అభివృద్ధి కార్యక్రమాల్లో ఇద్దరు నేతలు ఒకే వేదికను పంచుకున్నారు. ఈ సందర్భంగా రూ.13,000 కోట్లకు పైగా విలువైన ప్రాజెక్టులకు మోదీ శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేశారు.
చెన్నై ట్రేడ్ సెంటర్, ఐఐటీ మద్రాస్ ఆవరణలోని కేంద్రీయ విద్యాలయ గ్రౌండ్స్‌లో ఈ కార్యక్రమాలు నిర్వహించారు. రాష్ట్రంలో రవాణా, మౌలిక వసతులు, మిగతా 2 లో..

## డేటా లీక్‌లను

# అరికట్టాలి

డేటా రక్షణకు అత్యంత ప్రాధాన్యం

గోప్యత, డిజిటల్ భద్రత కీలకం

బాధ్యతాయుత ఏఐ వినియోగం అవసరం

పారదర్శకత, జవాబుదారీతనం ముఖ్యం

హైదరాబాద్‌లో బిలియన్స్ ఏఐ సెంటర్ ప్రారంభం

విద్యలో సాంకేతికతతో మెరుగైన ఫలితాలు

విద్యార్థులకు ఏఐ ఆధారిత పరిష్కారాలు

ప్రాక్టీస్, లెర్నింగ్‌కు ఎడ్యుటెక్ వినియోగం

నీట్ పేపర్ లీక్ తర్వాత డేటా భద్రతపై దృష్టి

ఎడ్యుటెక్‌ను ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది అభ్యాసం కోసమే వినియోగం



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):** డేటా రక్షణ, గోప్యతకు తెలంగాణ ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందని రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి డి. శ్రీధర్‌బాబు తెలిపారు. డిజిటల్ వ్యవస్థలను సురక్షితంగా ఉంచడంతోపాటు వ్యక్తిగత సమాచార గోప్యతను కాపాడటం కీలకమని చెప్పారు. ముఖ్యంగా డేటా సెంటర్ల ఏర్పాటులో భద్రత, గోప్యతకు పెద్దపీట వేయాల్సి ఉంటుందని పేర్కొన్నారు. ఆదివారం హైదరాబాద్‌లో బిలియన్స్ ఏఐ సెంటర్‌ను ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడారు. కృత్రిమ మేధ (ఏఐ) సాధనాలను వినియోగించేటప్పుడు అవి ఎంత బాధ్యతాయుతంగా పనిచేస్తున్నాయో పరిశీలించాలని శ్రీధర్‌బాబు సూచించారు. ఏఐ వినియోగంలో బాధ్యత, పారదర్శకత, జవాబుదారీతనం అత్యంత ముఖ్యమని స్పష్టం చేశారు. సాంకేతికత వల్ల కలిగే ప్రయోజనాలను అందిపుచ్చుకోవడంతోపాటు దాని వినియోగంతో మిగతా 2 లో..

## ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..

- ఇంటర్నెట్‌పై ఆంక్షలు వద్దు: సుప్రీంకోర్టు
- ఢిల్లీలో అనవసర బారికేడ్ల తొలగింపునకు సుప్రీంకోర్టు ఆదేశం
- ప్రజా ప్రయోజనాల దృష్ట్యా తప్ప మెట్రో, రైలు సేవలు ఆపవద్దని సూచన
- శాంతియుత నిరసనకారులను అక్రమంగా నిర్బంధించరాదని స్పష్టీకరణ
- నిరసనల వేళ ఆంక్షలపై దాఖలైన పిటిషన్లపై ప్రత్యేక విచారణ
- ఇంటర్నెట్, మెట్రో సేవలు పునరుద్ధరించామని కోర్టుకు తెలిపిన కేంద్రం



**నేషనల్ బ్యూరో అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):** దేశ రాజధాని ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో విధించిన కఠిన ఆంక్షలపై సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు జారీ చేసింది. శాంతిభద్రతలు లేదా ట్రాఫిక్ మిగతా 2 లో..

## చౌటుప్పల్‌లో కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్

- హైదరాబాద్–విజయవాడ హైవేపై వాహనాల బారులు
- ఫ్లైఓవర్ నిర్మాణంతో రాకపోకలకు అంతరాయం
- పండుగ సెలవులతో పెరిగిన వాహనాల రద్దీ
- లక్కారం నుంచి ధర్మోజీగూడెం వరకు నిలిచిన వాహనాలు
- యూటర్న్ కోసం రెండు కిలోమీటర్లు వెళ్లాల్సిన పరిస్థితి
- రోడ్డు దాటేందుకు పాదచారుల ఇబ్బందులు
- వాహనదారులకు తప్పని ట్రాఫిక్ కష్టాలు
- సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికులకు అవస్థలు



**న్యూఢిల్లీ, (ప్రజాక్షేత్రం):** యాదాద్రి భువనగిరి జిల్లా చౌటుప్పల్ పరిధిలోని హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై వాహనాల రద్దీ కొనసాగుతోంది. ఫ్లైఓవర్ నిర్మాణ పనులకు తోడు పండుగ సెలవుల నేపథ్యంలో సొంతూళ్లకు వెళ్లే ప్రయాణికుల సంఖ్య పెరగడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రంగా మారింది. లక్కారం నుంచి మిగతా 2 లో..

# ఎల్‌నినో ఎఫెక్ట్.. రెండో పంట వేయొద్దు!

**మొదటిపేజీ తరువాయి**

రాబోయే రోజుల్లో తాగునీటికి కూడా తీవ్ర ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రస్తుతం పొలాల్లో ఉన్న మొదటి పంటను ఎలాగైనా కష్టపడి వంద శాతం కాపాడుకుంటామని, అయితే రైతులు ఎవరూ కూడా దయచేసి రెండో పంట (యాసంగి/వేసంగి) వేయవద్దని ఆయన ప్రభుత్వం తరపున విజ్ఞప్తి చేశారు.

**విద్యుత్ కొనుగోలు భారంగా మారింది..**

రాష్ట్రంలో తలెత్తబోయే విద్యుత్ సంక్షోభం, కరెంటు ఇబ్బట్లపై మంత్రి పొంగులేటి స్పష్టతనిచ్చారు. పవర్ గ్రిడ్‌లో డిమాండ్‌కు తగినట్లుగా విద్యుత్ సరఫరా చేయడం కష్టంగా మారుతోందని, విద్యుత్‌ను బయటి మార్కెట్ నుంచి కొనుగోలు చేయాలంటే యూనిట్‌కు రూ. 15 వెచ్చించినా దొరకని దయనీయ పరిస్థితి నెలకొందని తెలిపారు. అందువల్ల ప్రజలందరూ కూడా విద్యుత్‌ను అత్యంత పొదుపుగా వాడుకోవాలని కోరారు. ఒకవేళ రైతులు ఎవరైనా రెండో పంట వేస్తే.. అటు ప్రభుత్వం నీటిని, విద్యుత్‌ను సరఫరా చేయలేక సతమతమవుతుందని, ఇటు రైతులు తీవ్రంగా నష్టపోయి ఆర్థికంగా బాధపడాల్సి వస్తుందని ఆయన హితవు పలికారు. రైతులు ఈ పరిస్థితులను అర్థం చేసుకుని ప్రభుత్వానికి సహకరించాలని కోరారు.

**నేడు, రేపు కేబినెట్ భేటీ..**
**కేంద్రం పాత్రపై చర్చ**

వర్షాభావ పరిస్థితులు, తాగుసాగు నీటి ఎద్దడి, విద్యుత్ కొరతను సమర్థవంతంగా ఎలా ఎదుర్కోవాలో చర్చించేందుకు రేపు, ఎల్లుండి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలో రాష్ట్ర మంత్రివర్గ ప్రత్యేక సమావేశం (Cabinet Meeting) జరగనున్నట్లు మంత్రి వెల్లడించారు. ఈ కేబినెట్ భేటీలో సంక్షోభ నివారణకు ప్రత్యామ్నాయ చర్యలపై చర్చిస్తామని తెలిపారు. కేంద్ర ప్రభుత్వం పెద్దన్న పాత్ర పోషించి కరువు నివారణకు, రాష్ట్రానికి అండగా నిలవాలని ఈ సమావేశంలో తీర్మానించి విజ్ఞప్తి చేస్తామన్నారు. త్వరలోనే అన్ని రాజకీయ పార్టీల నేతలతో అఖిలపక్ష సమావేశం (AllParty Meeting) ఏర్పాటు చేసి, ఎల్‌నినో ప్రభావంపై వారి నుంచి విలువైన సలహాలు, సూచనలు స్వీకరిస్తామని మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి స్పష్టం చేశారు.

# ఒకే వేదికపై మోదీ, విజయ్

**మొదటిపేజీ తరువాయి**

పారిశ్రామిక రంగాల అభివృద్ధికి సంబంధించిన ప్రాజెక్టులను నేతలు ప్రారంభించారు.

**చెన్నై మెట్రో ఫేజ్-2 ప్రారంభం**

చెన్నై మెట్రో రైలు ప్రాజెక్టు రెండో దశలో కారిడార్ 4కు చెందిన పూనమల్లి-వడపళని మార్గాన్ని ప్రధాని మోదీ, సీఎం విజయ్ కలిసి ప్రారంభించారు. సుమారు 15 కిలోమీటర్ల పొడవున 11 స్టేషన్లతో ఉన్న ఈ మార్గం నగరంలో ప్రజా రవాణా సౌకర్యాలను మెరుగుపరచడంలో కీలకంగా నిలవనుంది. ప్రారంభోత్సవం అనంతరం మోదీ, విజయ్ కలిసి పూనమల్లి బైపాస్ నుంచి పోరూర్ వరకు మెట్రో రైలులో ప్రయాణించారు. ఈ సందర్భంగా విద్యార్థులు, ప్రయాణికులతో ముచ్చటించారు. ప్రధాని మోదీ యూపీఐ ద్వారా మెట్రో టికెట్ కొనుగోలు చేయడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

**ఎలక్ట్రానిక్స్ రంగంలో**
**తమిళనాడు పాత్ర కీలకం**

భారత తయారీ రంగం అభివృద్ధిలో తమిళనాడు కీలక పాత్ర పోషిస్తోందని మోదీ ప్రశంసించారు. దేశంలో ఎలక్ట్రానిక్స్ ఉత్పత్తి, ఎగుమతులు గణనీయంగా పెరుగుతున్నాయని పేర్కొన్నారు. 2014తో పోలిస్తే భారత ఎలక్ట్రానిక్స్ ఎగుమతులు 11 రెట్లు పెరిగాయని, ప్రపంచంలో రెండో అతిపెద్ద మొబైల్ తయారీ దేశంగా భారత్ ఎదిగిందని తెలిపారు.

పారిశ్రామిక ఉత్పత్తి, సాంకేతిక రంగాల్లో మరింత పురోగతి సాధించేందుకు కేంద్రం చర్యలు తీసుకుంటోందని చెప్పారు. తమిళనాడులో ఉన్న తయారీ పరిశ్రమలు దేశ ఆర్థిక వ్యవస్థకు బలాన్ని అందిస్తున్నాయని వివరించారు.

**తూత్తుకుడి పోర్టు అభివృద్ధిపై దృష్టి**

తూత్తుకుడిలోని వి.ఓ. చిదంబరనార్ పోర్టును ప్రపంచస్థాయి గ్రీన్ ఎనర్జీ, భారీ కంటైనర్ హబ్‌గా అభివృద్ధి చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు ప్రధాని తెలిపారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రూ.17,000 కోట్ల విలువైన పనులను వేగవంతం చేస్తున్నామని పేర్కొన్నారు. పోర్టు సామర్థ్యం పెరగడం ద్వారా సముద్ర వాణిజ్యం, సరుకు రవాణా, పారిశ్రామిక కార్యకలాపాలకు ఊతం లభిస్తుందని వివరించారు.

**మెట్రో విస్తరణకు విజయ్ విజ్ఞప్తి**

తమిళనాడు ముఖ్యమంత్రి విజయ్ రాష్ట్రానికి సంబంధించిన పలు కీలక ప్రాజెక్టులకు కేంద్రం సహకరించాలని కోరారు. చెన్నై మెట్రో ఫేజ్ 3 విస్తరణ ప్రతిపాదనలకు తక్షణమే ఆమోదం తెలపాలని ప్రధానిని విజ్ఞప్తి చేశారు. ఎయిర్‌పోర్ట్-కిల్‌పాక్కం, పూనమల్లి-సుంగువార్‌సత్రం మార్గాల్లో మెట్రో సేవలను విస్తరించాల్సిన అవసరం ఉందని వివరించారు. అలాగే చెన్నై-కన్యాకుమారి, చెన్నై-కోయంబత్తూర్ మార్గాల్లో హైస్పీడ్ రైలు కారిడార్లను ఏర్పాటు చేయాలని కోరారు. ఈ ప్రాజెక్టులు అమలైతే రాష్ట్రంలోని ప్రధాన నగరాల మధ్య ప్రయాణ సమయం తగ్గడంతోపాటు ఆర్థిక కార్యకలాపాలకు మరింత ఊతం లభిస్తుందని పేర్కొన్నారు. రాష్ట్రాభివృద్ధికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సమన్వయం అవసరమని విజయ్ అన్నారు. మౌలిక వసతుల విస్తరణ, రవాణా సదుపాయాల మెరుగుదల, పారిశ్రామిక అభివృద్ధి వంటి అంశాల్లో పరస్పర సహకారంతో ముందుకు సాగాలని ఆకాంక్షించారు.

# గోవా–హైదరాబాద్ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు..

- **గోవాలో ప్రధాన నిందితుడు క్రిస్టీ అరెస్ట్**
- **రూ.48.4 లక్షల అనుమానాస్పద లావాదేవీలు**
- **ఏటీఎంల ద్వారా నగదు బదిలీ చేసినట్లు గుర్తింపు**
- **నైజీరియన్ నిగి పాత్రపై పోలీసుల దర్యాప్తు**



**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

గోవా నుంచి హైదరాబాద్‌కు గుట్టుచప్పుడు కాకుండా సాగుతున్న డ్రగ్స్ సరఫరా నెట్‌వర్క్‌ను పోలీసులు భగ్నం చేశారు. తెలంగాణ యాంటీ నార్కోటిక్స్ బ్యూరో 'ఈగల్ ఫోర్స్' (EAGLE Force), హైదరాబాద్ సిటీ పోలీసులు బోయింగ్ పంజాగుట్ట పోలీసులు సంయుక్తంగా నిర్వహించిన ప్రతిష్టాత్మక ఆపరేషన్‌లో గోవాకు చెందిన ప్రధాన డ్రగ్ పెడ్లర్ క్రిస్టీ (కస్టోడియో ఫెర్నాండెజ్) పోలీసులకు చిక్కాడు. గోవాలో అజ్ఞాతంలో ఉన్న నిందితుడిని స్థానిక పోలీసుల సహకారంతో అదుపులోకి తీసుకుని హైదరాబాద్‌కు తరలిస్తున్నారు. పంజాగుట్టలో ఇటీవల అరెస్టయిన నిందితుడు కేశవ్ రాజ్ సింగ్ ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు ఈ గోవా లింకులను బట్టబయలు చేశారు.

**రూ. 48.4 లక్షల లావాదేవీలు గుర్తింపు..**
**ఏటీఎంల ద్వారా హవాలా**

నిందితుడు క్రిస్టీకి సంబంధించిన బ్యాంకు ఖాతాలను పరిశీలించిన దర్యాప్తు బృందాలు సుమారు రూ. 48.4 లక్షల వరకు అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించాయి. ఈ ముఠా కార్యకలాపాల తీరు వినూత్నంగా సాగినట్లు విచారణలో తేలింది. హైదరాబాద్‌కు నేరుగా వచ్చి స్థానిక యువతకు డ్రగ్స్ అందించిన అనంతరం, ఇక్కడి నుంచి ఏటీఎం కేంద్రాల ద్వారా నగదును గోవాకు బదిలీ చేసేవారని పోలీసులు వెల్లడించారు. క్రిస్టీ మొబైల్ ఫోన్ డేటాను విశ్లేషించగా సంచలన విషయాలు వెలుగుచూశాయి. తెలంగాణ వ్యాప్తంగా ఆన్‌లైన్ ద్వారా డ్రగ్స్ కొనుగోలు చేసిన దాదాపు 25 మంది కీలక వ్యక్తులను పోలీసులు గుర్తించారు.

**నైజీరియన్ 'నిగి' పాత్రపై ముమ్మర దర్యాప్తు**

క్రిస్టీ మొబైల్ కాంటాక్టు, కాల్ డేటా ఆధారంగా ఆ 25 మంది వినియోగదారులపై పోలీసులు సమగ్ర విచారణను ప్రారంభించారు. కాగా, ఈ డ్రగ్స్ సామ్రాజ్యం వెనుక గోవా కేంద్రంగా నెట్‌వర్క్ నడుపుతున్న నైజీరియన్ జాతీయుడు 'నిగి' (Nigi) పాత్రపై దర్యాప్తు బృందాలు ప్రధానంగా దృష్టి సారించాయి. రాష్ట్రంలో డ్రగ్స్ వినియోగాన్ని పూర్తిగా అణచివేసేందుకు ప్రభుత్వం కఠిన చర్యలు చేపడుతున్న తరుణంలో, ఈ భారీ డ్రగ్స్ రాకెట్ గుట్టురట్టు కావడం సంచలనం సృష్టించింది. పరారీలో ఉన్న మిగతా నిందితుల కోసం గాలింపు చర్యలు ముమ్మరం చేసినట్లు పోలీసు వర్గాలు వెల్లడించాయి.

# చౌటుప్పల్‌లో కిలోమీటరు మేర ట్రాఫిక్ జామ్

**మొదటిపేజీ తరువాయి**

ధర్మోజీగూడెం వరకు సుమారు కిలోమీటరు మేర వాహనాలు బారులు తీరాయి.

ఫ్లైఓవర్ నిర్మాణ పనుల కారణంగా హైవేపై రాకపోకలకు ఆటంకాలు ఎదురవుతున్నాయి. పండుగ సెలవులతో సొంతూళ్లకు వెళ్లే కార్లు, ఇతర వాహనాలు పెద్ద సంఖ్యలో రహదారిపైకి రావడంతో ట్రాఫిక్ నెమ్మదించింది. వాహనాలు ముందుకు కదలడానికి ఎక్కువ సమయం పడుతుండటంతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.

**యూటర్న్ కోసం రెండు కిలోమీటర్లు**

హైవేపై రోడ్డు దాటేందుకు, యూటర్న్ తీసుకునేందుకు సుమారు రెండు కిలోమీటర్ల దూరం ప్రయాణించాల్సి వస్తోందని వాహనదారులు చెబుతున్నారు. దీంతో స్థానికులు, పాదచారులు కూడా తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ముఖ్యంగా రహదారిని దాటాల్సిన అవసరం ఉన్నవారు సరైన మార్గం కోసం ఎక్కువ దూరం వెళ్లాల్సి వస్తోంది.

ఫ్లైఓవర్ నిర్మాణం పూర్తయ్యే వరకు ట్రాఫిక్ సమస్యలు కొనసాగుతాయన్న ఆందోళన వ్యక్తమవుతోంది. పండుగ రద్దీ నేపథ్యంలో వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించడంతోపాటు పాదచారులు రోడ్డు దాటేందుకు సురక్షితమైన ఏర్పాట్లు చేయాలని స్థానికులు కోరుతున్నారు.



# ఢిల్లీలో బారికేడ్లు తొలగించండి, మెట్రో నడపండి..

**మొదటిపేజీ తరువాయి**



సమస్యలు ఉంటే తప్ప, మిగతా అన్ని చోట్లా ఏర్పాటు చేసిన బారికేడ్లను సమీక్షించి తొలగించాలని అధికారులను ఆదేశించింది. మెట్రో, రైల్వే సేవలను యథాతథంగా కొనసాగించాలని, ప్రజా ప్రయోజనాల దృష్ట్యా అత్యవసరమైతే తప్ప వాటిని నిలిపివేయరాదని నేడు జరిగిన ప్రత్యేక విచారణలో స్పష్టం చేసింది. ప్రధాన ఎన్నికల కమిషనర్‌కు సంబంధించిన డిమాండ్లతో నిన్న ఢిల్లీలో జరిగిన నిరసనల సందర్భంగా అధికారులు భారీ ఆంక్షలు విధించారు. పలు మెట్రో స్టేషన్లను మూసివేయడం, నిరసనకారులను అక్రమంగా అదుపులోకి తీసుకున్నారన్న ఆరోపణలపై సుప్రీంకోర్టులో పిటిషన్లు దాఖలయ్యాయి. ఈ పిటిషన్లపై జస్టిస్ జాయ్‌మాల్య బాగ్చి, జస్టిస్ వి.మోహనలతో కూడిన ధర్మాసనం ఆదివారం ప్రత్యేకంగా విచారణ చేపట్టింది. ఈ సందర్భంగా ధర్మాసనం పలు కీలకమైన మధ్యంతర ఉత్తర్వులు ఇచ్చింది. చట్టబద్ధమైన నిబంధనలకు లోబడి ప్రజలు, వాహనాల స్వేచ్ఛాయుత రాకపోకలకు అనుమతించాలని స్పష్టం చేసింది. చట్ట ప్రకారం కాకుండా ఇంటర్నెట్ సేవలకు ఎలాంటి అంతరాయం కలిగించరాదని తేల్చి చెప్పింది. నిర్దిష్ట ప్రాంతాల్లో ఆంక్షలు విధించిన చోట మినహా, శాంతియుతంగా సమావేశమయ్యే వారిని అక్రమంగా నిర్బంధించకూడదని ధర్మాసనం స్పష్టమైన ఆదేశాలు ఇచ్చింది. విచారణ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం తన వాదనలు వినిపించింది. ఢిల్లీలో ఇంటర్నెట్ సేవలను ఇప్పటికే పునరుద్ధరించామని, మెట్రో కార్యకలాపాలు కూడా పూర్తిగా సాధారణ స్థితికి వచ్చాయని కోర్టుకు తెలియజేసింది. ఇరుపక్షాల వాదనలు విన్న ధర్మాసనం, మెట్రో స్టేషన్ల మూసివేతపై వ్యక్తమైన ఆందోళనలను పరిగణనలోకి తీసుకుని దీనిపై మరిన్ని వివరాలు సమర్పించాలని కోరుతూ తదుపరి విచారణను మంగళవారానికి వాయిదా వేసింది.

# డేటా లీక్‌లను అరికట్టాలి

**మొదటిపేజీ తరువాయి**

ఎదురయ్యే సవాళ్లపైనా దృష్టి పెట్టాలని అన్నారు. డిజిటల్ భద్రతను నిర్లక్ష్యం చేయకుండా ఆధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని సమర్థవంతంగా ఉపయోగించుకోవాలని సూచించారు. విద్యా రంగంలో సాంకేతికత కీలక మార్పులు తీసుకొస్తోందని మంత్రి తెలిపారు. సంప్రదాయ బోధనా పద్ధతులకు సాంకేతిక పరిజ్ఞానాన్ని జోడిస్తే విద్యార్థులకు మరింత మెరుగైన ఫలితాలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు. విద్యార్థుల అభ్యాస ప్రక్రియను సులభతరం చేయడంలో ఏఐ ఆధారిత పరిష్కారాలు ఉపయోగపడతాయని చెప్పారు. విద్యార్థులు సాధన, అభ్యాసం కోసం ఎడ్యుకేషన్ టెక్నాలజీని వినియోగించుకోవడం సంతోషకరమని పేర్కొన్నారు.

విద్యార్థులకు ఉపయోగపడే సాంకేతిక పరిష్కారాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని శ్రీధర్‌బాబు అన్నారు. విద్యా సంస్థల్లో ఎదురయ్యే సమస్యలకు ఆధునిక సాంకేతికత ద్వారా పరిష్కారాలు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. డిజిటల్ వ్యవస్థల భద్రతతోపాటు డేటా విశ్లేషణలోనూ ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం కీలక పాత్ర పోషిస్తుందని వివరించారు. నీట్ ప్రశ్నపత్రం లీక్ ఘటన తర్వాత డేటా లీక్‌లను అరికట్టాల్సిన అవసరం మరింత పెరిగిందని మంత్రి పేర్కొన్నారు. వ్యక్తిగత సమాచారం దుర్వినియోగం కాకుండా తగిన భద్రతా చర్యలు తీసుకోవాలని అన్నారు. డేటా సెంటర్ల నిర్వహణ నుంచి ఏఐ సాధనాల వినియోగం వరకు ప్రతి దశలోనూ గోప్యత, భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాల్సి ఉంటుందని వివరించారు.

ఇంపాక్ట్2025 సర్వే ప్రకారం, ఎడ్యుకేషన్ టెక్నాలజీని ఉపయోగిస్తున్న పిల్లల్లో 77 శాతం మంది ప్రాక్టీస్, లెర్నింగ్ కోసం వాటిని వినియోగిస్తున్నారని శ్రీధర్‌బాబు తెలిపారు. ఈ గణాంకాలు విద్యా రంగంలో సాంకేతిక పరిజ్ఞానం వినియోగం ప్రాధాన్యాన్ని తెలియజేస్తున్నాయని పేర్కొన్నారు. విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా సురక్షితమైన, సమర్థవంతమైన సాంకేతిక పరిష్కారాలను అభివృద్ధి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. సాంకేతికతను కేవలం వినియోగించుకోవడమే కాకుండా, దాని వల్ల ఎదురయ్యే ప్రమాదాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. డేటా భద్రత, గోప్యత, బాధ్యతాయుత ఏఐ వినియోగం సమాంతరంగా కొనసాగినప్పుడే సాంకేతికత ద్వారా సమాజానికి మెరుగైన ప్రయోజనాలు అందుతాయని శ్రీధర్‌బాబు పేర్కొన్నారు.

# శివాజీని మతానికి పరిమితం చేయొద్దు

- **పీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి వెల్లడి**
- **సంగారెడ్డి బైపాస్ రోడ్డులో విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ**
- **చరిత్రను రాజకీయాలకు వాడుకుంటున్నారని బీజేపీపై విమర్శ**
- **శివాజీ సైన్యంలో ముస్లిం అధికారులు కూడా ఉన్నారని వెల్లడి**
- **కులమతాల కంటే ప్రజల సంక్షేమమే ముఖ్యమని వ్యాఖ్య**
- **రాజ్య భద్రతకు శివాజీ ప్రాధాన్యమిచ్చారని స్పష్టం**
- **శివాజీ చరిత్రను యువత తెలుసుకోవాలని పిలుపు**
- **సంగారెడ్డిలో విగ్రహ ఏర్పాటుకు శ్రీకారం**
- **చరిత్రను వక్రీకరించవద్దని హితవు**
- **రాజకీయ లబ్ధి కోసం శివాజీ పేరును వాడుకుంటున్నారని ఆరోపణ**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

ఛత్రపతి శివాజీ మహారాజ్‌ను ఒక మతానికి మాత్రమే పరిమితం చేయడం సరికాదని టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ టి. జగ్గారెడ్డి అన్నారు. చరిత్రను వక్రీకరించి రాజకీయ లబ్ధి కోసం బీజేపీ శివాజీ పేరును ఉపయోగించుకుంటోందని విమర్శించారు. ఆదివారం సంగారెడ్డి బైపాస్ రోడ్డులో ఛత్రపతి శివాజీ విగ్రహ ఏర్పాటుకు ఆయన భూమిపూజ చేశారు. అనంతరం మాట్లాడారు. ఛత్రపతి శివాజీ పాలనలో ముస్లిం అధికారులు కూడా పనిచేశారని జగ్గారెడ్డి గుర్తుచేశారు. శివాజీని కేవలం ఒక కులానికి లేదా మతానికి చెందిన వ్యక్తిగా చూడకూడదని అన్నారు. రాజ్యంలోని ప్రజల సంక్షేమం, రాజ్య భద్రతకు ఆయన ప్రాధాన్యమిచ్చారని పేర్కొన్నారు. పాలనలో ప్రజల బాగోగులను దృష్టిలో ఉంచుకున్నారని తెలిపారు.

ఛత్రపతి శివాజీ గొప్ప వీరుడని, ఆయన జీవితం, చరిత్ర గురించి యువత తెలుసుకోవాల్సిన అవసరం ఉందని జగ్గారెడ్డి సూచించారు. చరిత్రను రాజకీయ ప్రయోజనాలకు ఉపయోగించుకోవడం సరికాదని అన్నారు. చారిత్రక వ్యక్తుల సేవలు, పాలనా విధానాలను సమగ్రంగా అర్థం చేసుకోవాలని పేర్కొన్నారు. సంగారెడ్డి బైపాస్ రోడ్డులో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించిన సందర్భంగా ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. శివాజీ చరిత్రను మతపరమైన కోణంలో మాత్రమే కాకుండా, ఆయన పాలన, సైనిక వ్యూహాలు, ప్రజల పట్ల బాధ్యత వంటి అంశాల ఆధారంగా కూడా అధ్యయనం చేయాలని యువతకు సూచించారు.

# 'సర్' పేరుతో మైనారిటీల ఓట్ల తొలగింపు

**మొదటిపేజీ తరువాయి**

చేపడుతున్నా కేంద్ర ప్రభుత్వం స్పందించడం లేదని విమర్శించారు. ప్రజలు తమ హక్కుల కోసం గొంతెత్తితే వారి నిరసనలను అణచివేసేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు.

ఢిల్లీలో నిరసనల నేపథ్యంలో ఇంటర్నెట్ సేవలను నిలిపివేశారని, పెట్రోల్ బంకులు, రహదారులను మూసివేశారని కేటీఆర్ పేర్కొన్నారు. ప్రజలు తమ అభిప్రాయాలను వ్యక్తం చేసే అవకాశాలను పరిమితం చేయడం సరికాదని అన్నారు. నిరసనకారుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం, వారి గొంతును నొక్కేందుకు ప్రయత్నిస్తోందని విమర్శించారు. తెలంగాణలోనూ ఇదే తరహా చర్యలకు పాల్పడే ప్రమాదం ఉందని కేటీఆర్ ఆందోళన వ్యక్తం చేశారు. ఓటరు జాబితాల సవరణ పేరుతో మైనారిటీల ఓటు హక్కుకు నష్టం కలిగించే ప్రయత్నాలను అప్రమత్తంగా గమనించాలని సూచించారు. మైనారిటీలంతా ఐక్యంగా ఉండి తమ హక్కులను కాపాడుకోవాలని పిలుపునిచ్చారు.

ఓటు హక్కు ప్రజాస్వామ్యంలో కీలకమైనదని పేర్కొన్న కేటీఆర్.. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ పారదర్శకంగా జరగాలని, ఎవరి ఓటు హక్కూ అన్యాయంగా తొలగించకూడదని అన్నారు.

కేంద్ర ప్రభుత్వం, ఎన్నికల సంఘం ఈ అంశంపై స్పష్టత ఇవ్వాలని కేటీఆర్ కోరారు. మైనారిటీల్లో ఆందోళన కలిగిస్తున్న అంశాలపై సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.



# గోవాను డ్రగ్స్ అడ్డాగా మార్చేశారు

- **బీజేపీ పాలనలో గోవా ప్రజలకు తీవ్ర అన్యాయం**
- **కార్పొరేట్ల చేతుల్లోకి భూములు వెళ్లకుండా కాపాడుకోవాలి**
- **ఉపాధి లేక నిరాశలో గోవా యువత**
- **డ్రగ్స్‌కు అడ్డాగా గోవా మారింది**
- **ప్రధాన నగరాలకు గోవా నుంచే మాదకద్రవ్యాల సరఫరా**
- **గోవా అస్తిత్వాన్ని కాపాడుకోవడం అందరి బాధ్యత: రేవంత్ రెడ్డి**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

గోవా రాష్ట్ర ప్రజల పట్ల భారతీయ జనతా పార్టీ (బీజేపీ) తీవ్ర వివక్ష చూపుతోందని తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. గోవా అస్తిత్వాన్ని, అక్కడి భూములను కార్పొరేట్ల చేతుల్లోకి వెళ్లకుండా కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఆయన స్పష్టం చేశారు. బీజేపీ పాలనలో గోవా యువత తీవ్ర నిరాశ, నిస్పృహల్లో (ఫ్రస్టేషన్) కొట్టుమిట్టాడుతోందని, సరైన ఉపాధి లేక ప్రమాదకరమైన మత్తు పదార్థాల బారిన పడి జీవితాలను నాశనం చేసుకుంటోందని ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం గోవా పూర్తిగా మాదకద్రవ్యాలకు ప్రధాన కేంద్రంగా (డ్రగ్స్ అడ్డాగా) మారిపోయిందని ఆరోపించిన రేవంత్ రెడ్డి.. దేశంలోని ప్రధాన నగరాలకు అక్కడి నుంచే డ్రగ్స్ సరఫరా అవుతున్నాయని పేర్కొన్నారు.

ముఖ్యంగా హైదరాబాద్ నగరంలో పట్టుబడుతున్న డ్రగ్స్ మూలాలు గోవాలోనే ఉన్నాయని, అక్కడి నుంచే ఇక్కడికి అక్రమంగా రవాణా అవుతున్నాయని సీఎం రేవంత్ సంచలన వ్యాఖ్యలు చేశారు. గత ప్రభుత్వ హయాంలో తాను అధికారంలోకి రాకముందు హైదరాబాద్‌లో డ్రగ్స్ విచ్చలవిడిగా లభించేవని, అయితే కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మత్తు పదార్థాల మహమ్మారిపై పూర్తిస్థాయిలో ఉక్కుపాదం మోపామని వివరించారు. ప్రత్యేక టాస్క్‌ఫోర్స్, పోలీసు నిఘా ద్వారా నెట్‌వర్క్‌లను ఛేదిస్తూ కఠిన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. గోవా భవిష్యత్తును కాపాడటానికి యువతను చైతన్యవంతం చేయాలని, బీజేపీ అస్తవ్యస్త పాలనకు చరమగీతం పాడాలని రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

# కౌకూర్‌లో ఆరేళ్ల బాలుడి హత్య.. రూ.20 లక్షల కోసం కిడ్నాప్!

- **ఆడుకుంటూ కనిపించకుండా పోయిన మోజెస్ అరులియా**
- **క్లబ్‌హౌస్ సంపులో చిన్నారి మృతదేహం**
- **కాళ్లు, చేతులు కట్టేసిన స్థితిలో బాలుడు**
- **కుటుంబానికి ఫోన్ చేసి రూ.20 లక్షలు డిమాండ్**
- **వాచ్‌మెన్ విక్రమ్‌పై అనుమానాలు**
- **పరారీలో ఉన్న నిందితుడి కోసం పోలీసుల గాలింపు**
- **కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న పోలీసులు**
- **సికింద్రాబాద్‌లో కలకలం రేపిన ఘటన**
- **కిడ్నాప్, హత్య వెనుక కారణాలపై దర్యాప్తు**

**హైదరాబాద్, (ప్రజాక్షేత్రం):**

సికింద్రాబాద్‌లోని కౌకూర్‌లో ఆరేళ్ల బాలుడు మోజెస్ అరులియా హత్యకు గురైన ఘటన కలకలం రేపింది. ఆడుకుంటూ కనిపించకుండా పోయిన చిన్నారి.. సమీపంలోని క్లబ్‌హౌస్‌లో ఉన్న సంపులో విగతజీవిగా కనిపించాడు. కిడ్నాప్ చేసి రూ.20 లక్షలు డిమాండ్ చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపిన నేపథ్యంలో ఈ ఘటనపై పోలీసులు దర్యాప్తు ముమ్మరం చేశారు.

**ఆడుకుంటూ వెళ్లి అదృశ్యం**

మోజెస్ అరులియా ఆడుకుంటూ ఉండగా కనిపించకుండా పోయాడు. కుటుంబ సభ్యులు పరిసర ప్రాంతాల్లో వెతికినా ఆచూకీ లభించలేదు. ఈలోగా చిన్నారిని అపహరించిన వ్యక్తి కుటుంబ సభ్యులకు ఫోన్ చేసి రూ.20 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు సమాచారం. దీంతో కుటుంబ సభ్యులు తీవ్ర ఆందోళనకు గురయ్యారు.

**సంపులో మృతదేహం**

కుటుంబ సభ్యులు చిన్నారి కోసం వెతుకుతున్న సమయంలో సమీపంలోని క్లబ్‌హౌస్ సంపులో బాలుడి మృతదేహం కనిపించింది. కాళ్లు, చేతులు కట్టేసిన స్థితిలో మృతదేహం లభించడం ఘటన తీవ్రతను తెలియజేస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

**వాచ్‌మెన్ కోసం గాలింపు**

ఈ ఘటనలో వాచ్‌మెన్ విక్రమ్‌పై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. చిన్నారిని హత్య చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న అతడు పరారీలో ఉన్నట్లు పోలీసులు భావిస్తున్నారు. అతడి ఆచూకీ కోసం గాలింపు చేపట్టారు. అయితే, నిందితుడి పాత్ర, హత్యకు గల కారణాలు దర్యాప్తులో తేలాల్సి ఉంది.

కిడ్నాప్ చేసి డబ్బులు డిమాండ్ చేయడం, అనంతరం చిన్నారి మృతదేహం లభించడం వెనుక ఉన్న పూర్తి వివరాలను పోలీసులు పరిశీలిస్తున్నారు. కేసు నమోదు చేసి సాక్ష్యాధారాలను సేకరిస్తున్నారు. చిన్నారి అదృశ్యం నుంచి మృతదేహం లభించే వరకు జరిగిన పరిణామాలపై దర్యాప్తు కొనసాగుతోంది.

# మనసుకు వైకల్యం ఉండకూడదు!

- **దివ్యాంగుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటా**
- **వనపర్తి జిల్లా చెవిటి,మూగవారి సంఘం నూతన కార్యవర్గానికి**
- **ఎమ్మెల్యే మేఘారెడ్డి అభినందనలు**

**వనపర్తి,అక్టోబర్ 11 (ప్రజాక్షేత్రం):**

శారీరక వైకల్యం ఉన్నంత మాత్రాన ఎవరూ తక్కువ కాదని, ఇతరుల కష్టాలను అర్థం చేసుకోలేని, ఆపదలో ఉన్నవారికి అండగా నిలవలేని వారిదే నిజమైన మనో వైకల్యమని ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. దివ్యాంగుల పట్ల ప్రతి ఒక్కరూ గౌరవం, ఆప్యాయత, మానవత్వంతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు.
వారి సమస్యల పరిష్కారానికి, సంక్షేమానికి ఎల్లవేళలా అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. ఆదివారం వనపర్తిలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నూతనంగా ఏర్పాటైన వనపర్తి జిల్లా చెవిటి, మూగవారి సంఘం కార్యవర్గ సభ్యులను ఆయన శాలువాలతో సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధులకు శుభాకాంక్షలు తెలిపారు.

**ప్రోత్సాహంతో మరిన్ని విజయాలు**

దివ్యాంగులు ఎన్నో రంగాల్లో తమ ప్రతిభను చాటుతూ విజయాలు సాధిస్తున్నారని మేఘారెడ్డి పేర్కొన్నారు. సరైన ప్రోత్సాహం, తగిన అవకాశాలు కల్పిస్తే వారు మరిన్ని విజయాలు సాధించగలరన్నారు. వైకల్యం విజయానికి అడ్డంకి కాదని, ఆత్మవిశ్వాసం, పట్టుదలతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చని చెప్పారు. సమాజంలో ప్రతి ఒక్కరికీ సమాన గౌరవం, సమాన అవకాశాలు లభించినప్పుడే నిజమైన అభివృద్ధి సాధ్యమవుతుందని అన్నారు.

**నూతన కార్యవర్గానికి సత్కారం**

సంఘం నూతన అధ్యక్షుడు ఎం. కర్ణాకర్,ఉపాధ్యక్షుడు జె. శ్యామ్,ప్రధాన కార్యదర్శి పి. రేమంత్,సంయుక్త కార్యదర్శి వి. నాగరాజ్,కోశాధికారి ఎస్. ప్రవీణ్‌కుమార్‌తో పాటు కార్యవర్గ సభ్యులను ఎమ్మెల్యే అభినందించారు.
కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ మధుసూదన్‌గౌడ్, కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతయ్య,పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# జిల్లా దశాబ్ది వేడుకలకు 2కె రన్..

- **అంబేద్కర్‌కు నివాళులు జిల్లాల ఏర్పాటుతో పాలన ప్రజలకు చేరువైంది**
- **మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి**
- **కేసీఆర్ పాలనా సంస్కరణలతో తెలంగాణలో కొత్త ఒరవడి.**
- **వనపర్తి అభివృద్ధిపై ప్రత్యేక ప్రస్తావన**

**వనపర్తి,అక్టోబరు 11 (ప్రజాక్షేత్రం):**

కొత్త జిల్లాల ఏర్పాటుతో పాలన ప్రజలకు చేరువైందని, పరిపాలన వికేంద్రీకరణలో తెలంగాణ దేశానికి ఆదర్శంగా నిలిచిందని మాజీ మంత్రి, మాజీ ఎమ్మెల్యే సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. వనపర్తి జిల్లా ఏర్పడి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం పట్టణంలో నిర్వహించిన 2కె రన్‌లో ఆయన పాల్గొన్నారు. పట్టణంలోని పాలిటెక్నిక్ కళాశాల నుంచి అంబేద్కర్ చౌరస్తా వరకు విద్యార్థులు, యువకులు, వివిధ వాకింగ్ బృందాల సభ్యులు, ప్రముఖులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. అనంతరం అంబేద్కర్ విగ్రహానికి చిన్నారులతో పూలమాలలు వేయించి నివాళులర్పించారు. పాల్గొన్న వారికి స్వీట్లు పంపిణీ చేసి దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు.
ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ.. డాక్టర్ బీఆర్ అంబేద్కర్ రాజ్యాంగంలోని మూడో అధికరణ ఆధారంగానే తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైందని పేర్కొన్నారు.
తెలంగాణ ఉద్యమం ద్వారా రాష్ట్రాన్ని సాధించిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కేసీఆర్ పరిపాలన సౌలభ్యం కోసం 33 జిల్లాలు, కొత్త రెవెన్యూ డివిజన్లు, మండలాలను ఏర్పాటు చేశారని గుర్తుచేశారు. ఈ మార్పులతో ప్రజలకు ప్రభుత్వ సేవలు మరింత చేరువయ్యాయని అన్నారు.
కేసీఆర్ హయాంలో పాలనా సంస్కరణలకు కొత్త ఒరవడి ఏర్పడిందని, ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లే ప్రయత్నాలు జరిగాయని పేర్కొన్నారు. జిల్లాల ఏర్పాటుతో ప్రభుత్వ కార్యాలయాలు, పరిపాలనా సదుపాయాలు అందుబాటులోకి వచ్చాయని, ప్రజల జీవన ప్రమాణాల్లో మార్పులకు మార్గం ఏర్పడిందని అన్నారు. వనపర్తి జిల్లా మరో వెయ్యేళ్లపాటు అభివృద్ధి పథంలో కొనసాగాలని, భవిష్యత్తు




తరాలకు ఆదర్శంగా నిలవాలని ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు.

**వాకింగ్ బృందాలు, విద్యార్థుల సందడి**

2కె రన్‌లో గణేశ్ వాకింగ్ గ్రూప్, బాలాజీ వాకింగ్ గ్రూప్, విశ్రాంత ఆర్టీసీ ఉద్యోగుల బృందం, హనుమాన్ వాకింగ్ గ్రూప్, జై కిసాన్-జై జవాన్ సభ్యులు, కరాటే విద్యార్థులు, యువకులు, విద్యార్థులు పాల్గొన్నారు. అంబేద్కర్ చౌరస్తా వద్ద చిన్నారులతో పూలమాలలు వేయించి నివాళులర్పించడం కార్యక్రమంలో ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.
ప్రజలతో మమేకం.. కార్యకర్తలతో అల్పాహారం 2కె రన్ సాగిన మార్గంలో నిరంజన్‌రెడ్డి స్థానికులను ఆప్యాయంగా పలకరిస్తూ జిల్లా దశాబ్ది ఉత్సవాల శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పట్టణంలోని సామాన్యుల బసవేశ్వర టిఫిన్ సెంటర్‌ను సందర్శించి నిర్వాహకులతో మాట్లాడారు.జిల్లా ఏర్పాటుతో వ్యాపారం ఎలా సాగుతోందని ఆరా తీశారు.జిల్లా ఏర్పాటుతో చిరు వ్యాపారులకు జీవనోపాధి అవకాశాలు పెరిగాయని నిర్వాహకులు ఆయనతో పేర్కొన్నారు.అనంతరం కార్యకర్తలు,వాకింగ్ బృందాల సభ్యులతో కలిసి అల్పాహారం తీసుకున్నారు.

# చేవెళ్లలో హుదా బాక్స్ క్రికెట్ ప్రారంభం

**చేవెళ్ల,అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించడంతో పాటు క్రికెట్ క్రీడాకారులకు మెరుగైన వేదికను కల్పించాలనే లక్ష్యంతో చేవెళ్లలో నూతనంగా ఏర్పాటు చేసిన హుదా బాక్స్ క్రికెట్‌ను ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని వికారాబాద్ రోడ్డులో మొహమ్మద్ పాషా ఏర్పాటు చేసిన ఈ బాక్స్ క్రికెట్‌ను ఆదివారం ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బాక్స్ క్రికెట్ యువతకు క్రీడలపై ఆసక్తిని పెంచడంతో పాటు స్థానిక క్రీడాకారుల్లో ప్రతిభను వెలికితీసేందుకు ఉపయోగపడాలని ఆకాంక్షించారు. Lయువత క్రీడల్లో రాణించి ఉన్నత స్థాయికి ఎదగాలని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో చేవెళ్ల మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి ,వైస్ చైర్మన్ రాము గౌడ్,కౌన్సిలర్లు,కోఆప్షన్ సభ్యులు,మండల నాయకులు, వివిధ పార్టీల నాయకులు, స్థానిక ప్రజలు,క్రికెట్ క్రీడాకారులు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పులగల్ల కుమార్

**మొయినాబాద్,అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్ మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పులగల్ల కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీం భరత్ సహకారంతో, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది.ఈ సందర్భంగా పులగల్ల కుమార్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పామెన భీం భరత్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, మొయినాబాద్ మండల, మున్సిపల్ అధ్యక్షుడు బొలిగిద్ద సత్యనారాయణ, విక్రమ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మానయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మున్సిపల్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకం

- **9వ వార్డు కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్.**

**మొయినాబాద్, అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మున్సిపల్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని 9వ వార్డు కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని యెన్కేపల్లి మున్సిపల్ సిబ్బందికి 9వ వార్డు కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం కష్టపడుతూ అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. పండుగ వేళ సిబ్బందిని గౌరవించుకోవడం, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.







# క్రీడా మైదానంలో యువత జోష్.

- **జెడ్‌పీఎల్ మ్యాచ్‌లకు వకీల్ చౌహాన్,నిసార్ పటేల్,జేబీ ప్రవీణ్ సందడి.**

**జహీరాబాద్,అక్టోబర్ 11( ప్రజాక్షేత్రం):**

జెడ్‌పీఎల్ క్రికెట్ టోర్నమెంట్‌లో భాగంగా నిర్వహించిన క్రికెట్ మ్యాచ్‌లు క్రీడాభిమానులను ఆకట్టుకున్నాయి.ఈ మ్యాచ్‌లకు 7వ వార్డు కౌన్సిలర్ వకీల్ చౌహాన్,షకీల్ పటేల్,నిసార్ పటేల్,జేబీ ప్రవీణ్ ముఖ్య అతిథులుగా హాజరై క్రీడాకారులను ప్రోత్సహించారు.

**తొలి మ్యాచ్‌లో జీఆర్‌పీఎస్ గడి జట్టు విజయం**

చైల్డ్‌హుడ్ ఫ్రెండ్స్, జీఆర్‌పీఎస్ గడి జట్ల మధ్య జరిగిన తొలి మ్యాచ్‌లో జీఆర్‌పీఎస్ గడి జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో ప్రతిభ కనబరిచిన ఇస్మాయిల్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచాడు.

**రెండో మ్యాచ్‌లో అయూబ్ సీసీ జట్టు గెలుపు**

అయూబ్ సీసీ, జై సేవాలాల్ జట్ల మధ్య జరిగిన రెండో మ్యాచ్‌లో అయూబ్ సీసీ జట్టు విజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శన చేసిన షారుఖ్ ఖాన్ మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డును అందుకున్నాడు.

**హ్యాట్రిక్ ఆటగాళ్లకు రూ.3,000 నగదు బహుమతి**

టోర్నమెంట్‌లో హ్యాట్రిక్ సాధించిన ఆటగాళ్లను ప్రోత్సహించే ఉద్దేశంతో జేబీ ప్రవీణ్ రూ.3,000 నగదు బహుమతిని అందజేశాడు. క్రీడాకారుల్లో ప్రతిభను గుర్తించి ప్రోత్సహించడం ద్వారా యువతలో క్రీడల పట్ల మరింత ఆసక్తి పెరుగుతుందని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

**ఆరోగ్యకరమైన సమాజానికి క్రీడలు ఎంతో అవసరం**

ఈ సందర్భంగా ముఖ్య అతిథి జహీరాబాద్ మున్సిపాలిటీ వార్డ్ 7 వ కౌన్సిలర్ వకీల్ చౌహాన్ మాట్లాడుతూ, యువత క్రీడల వైపు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. క్రీడలు శారీరక ఆరోగ్యాన్ని పెంపొందించడంతో పాటు క్రమశిక్షణ, ఐకమత్యం, పట్టుదల, నాయకత్వ లక్షణాలను అభివృద్ధి చేస్తాయని తెలిపారు. ఆరోగ్యవంతమైన యువతే దేశానికి బలమని, యువత దేశానికి వెన్నెముక వంటివారని పేర్కొన్నారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ క్రీడల్లో పాల్గొని తమ ప్రతిభను చాటుకోవాలని సూచించారు.
క్రీడా కార్యక్రమాల నిర్వహణ ద్వారా యువతలో స్నేహభావం, ఐకమత్యం పెంపొందుతాయని, స్థానిక స్థాయిలో ప్రతిభావంతులైన క్రీడాకారులకు మంచి అవకాశాలు లభిస్తాయని అతిథులు అభిప్రాయపడ్డారు.

**ముఖ్య అతిథులకు శాలువాలతో సన్మానం**

కార్యక్రమంలో భాగంగా మ్యాచ్ కోఆర్డినేటర్ ముఖ్య అతిథులైన వకీల్ చౌహాన్,షకీల్ పటేల్, నిసార్ పటేల్,జేబీ ప్రవీణ్‌లను శాలువాలతో ఘనంగా సన్మానించారు.

# ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రికి పాతికేళ్లు

- **25వ వార్షికోత్సవం సందర్భంగా ఘనంగా సిల్వర్ జూబ్లీ వేడుకలు**

**ఈసీఐఎల్, అక్టోబరు 11(ప్రజా క్షేత్రం):**

లయన్స్ క్లబ్ ఆఫ్ హైదరాబాద్-మీరిపేట్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఎంఎస్ రెడ్డి లయన్స్ కంటి ఆసుపత్రి సిల్వర్ జూబ్లీ వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. కాప్రా సర్కిల్ పరిధిలోని రాధిక థియేటర్ సమీపంలో ఉన్న స్వాగత్ గ్రాండ్ హోటల్‌లో నిర్వహించిన కార్యక్రమానికి లయన్స్ క్లబ్ ప్రతినిధులు, ట్రస్ట్ సభ్యులు, వైద్యులు, ఆసుపత్రి సిబ్బంది హాజరయ్యారు.
లయన్స్ క్లబ్ మాజీ అంతర్జాతీయ డైరెక్టర్ డాక్టర్ గట్టమనేని బాబు రావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మల్టిపుల్ కౌన్సిల్ చైర్‌పర్సన్ లయన్ ఏ. అమర్‌నాథ్ రావు, జిల్లా గవర్నర్ లయన్ కల్లెం కృష్ణారెడ్డి గౌరవ అతిథులుగా హాజరయ్యారు. లయన్ కే. హరీశ్ రెడ్డి, లయన్ కే. ఇన్నా రెడ్డి, లయన్ మంద సురేశ్ కుమార్, లయన్ గుంటుక శేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.
ఎల్వీ ప్రసాద్ ఐ ఇన్‌స్టిట్యూట్ (ఎల్వీపీఈఐ) అనుబంధ సంస్థగా కొనసాగుతున్న ఈ ఆసుపత్రి 25 ఏళ్లుగా ప్రజలకు కంటి వైద్య సేవలందిస్తోంది. కంటి ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యమిస్తూ వైద్య సేవలను ప్రజలకు అందుబాటులోకి తీసుకొస్తోంది. ఆసుపత్రి సేవలను మరింత విస్తరించి, భవిష్యత్తులోనూ మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిల్వర్ జూబ్లీ వేడుకలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.
కార్యక్రమంలో ట్రస్ట్ చైర్మన్ లయన్ చింతల రాంచందర్, కార్యదర్శి లయన్ పోలాస రమేశ్, కోశాధికారి లయన్ ఎస్. ఆంజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.




# ఎలిమినేటి జంగారెడ్డి ఆధ్వర్యంలో ఆర్థిక సహాయం

**వలిగొండ,అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండల పరిధిలోని పైల్వాన్ పురం గ్రామానికి చెందిన శ్యామల ఎల్లయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఆదివారం రోజు మరణించారు. విషయం తెలుసుకున్న ఏజేఆర్ ఫౌండేషన్ అధినేత బిఆర్ఎస్ జిల్లా నాయకులు ఎలిమినేటి జంగారెడ్డి వారి కుటుంబాన్ని ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు వెళ్లి కుటుంబాన్ని పరామర్శించి వారి కుటుంబ సభ్యులకు 5,000/ రూపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏజేఆర్ ఫౌండేషన్ సభ్యులు గ్రామ పెద్దలు యువకులు తదితరులు పాల్గొన్నారు.



# పరిగి, కొడంగల్ పోలీస్ స్టేషన్ల సందర్శన.. అరెస్టయిన వారి విడుదలకు కృషి

**వికారాబాద్,అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

ఆశా వర్కర్లు, ఉద్యోగ సంఘాల నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తల అరెస్టుల నేపథ్యంలో బీఆర్ఎస్ నాయకుడు చైతన్య కిరణ్ పరిగి, కొడంగల్ పోలీస్ స్టేషన్లను సందర్శించి వారి సమస్యలను తెలుసుకోవడంతో పాటు విడుదలకు కృషి చేశారు. బీఆర్టీయూ రాష్ట్ర అధ్యక్షుడు రాంబాబు, ఆశా వర్కర్ల రాష్ట్ర అధ్యక్షురాలు సంతోషతో పాటు పలువురు ఆశా వర్కర్లను పోలీసులు అరెస్టు చేసిన నేపథ్యంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు చైతన్య కిరణ్ పరిగి పోలీస్ స్టేషన్‌కు వెళ్లారు.

**పరిగిలో అరెస్టయిన ఆశా వర్కర్ల విడుదలకు చర్చలు**

పరిగి డీఎస్పీతో చర్చించిన చైతన్య కిరణ్.. అరెస్టయిన ఆశా వర్కర్లు, ఉద్యోగ సంఘాల నాయకులను వెంటనే విడుదల చేయాలని కోరారు. వారి అరెస్టుకు దారితీసిన పరిస్థితులు, ఆశా వర్కర్లు చేపట్టిన ఆందోళనకు సంబంధించిన అంశాలపై పోలీసు అధికారులతో మాట్లాడారు. అనంతరం జరిగిన చర్చలతో అరెస్టయిన వారిని విడుదల చేసినట్లు తెలిపారు.

**కొడంగల్‌లో ఆశా వర్కర్ల సమస్యలపై ఆరా**

అనంతరం కొడంగల్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన చైతన్య కిరణ్ అక్కడ ఉన్న ఆశా వర్కర్లతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం చేస్తున్న పోరాటానికి అండగా ఉంటామని, సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తామని వారికి భరోసా ఇచ్చారు.

**బీఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ విడుదలకు కృషి**

ఇదే సమయంలో బీఆర్ఎస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్‌పై కేసు నమోదు చేసి అరెస్టు చేసిన విషయం తెలుసుకున్న చైతన్య కిరణ్ కొడంగల్ పోలీస్ స్టేషన్‌లో పోలీసు అధికారులతో మాట్లాడారు. కేసు వివరాలను తెలుసుకుని, స్టేషన్‌లో ఉన్న పార్టీ కార్యకర్తను విడుదల చేయాలని కోరారు. చర్చల అనంతరం సదరు సోషల్ మీడియా కోఆర్డినేటర్‌ను పోలీస్ స్టేషన్ నుంచి విడుదల చేసినట్లు తెలిపారు.

**ప్రజాస్వామ్యంలో నిరసన తెలిపే హక్కు ఉంది**

ఈ సందర్భంగా చైతన్య కిరణ్ మాట్లాడుతూ తమ న్యాయమైన డిమాండ్ల కోసం పోరాడుతున్న ఆశా వర్కర్లు, ఉద్యోగ సంఘాల నాయకులకు అండగా నిలవడం ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. ప్రజాస్వామ్యంలో తమ సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లేందుకు శాంతియుతంగా నిరసన తెలిపే హక్కు ప్రతి ఒక్కరికీ ఉందని పేర్కొన్నారు. ఉద్యోగుల సమస్యలను ప్రభుత్వం చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు.

**రాజకీయ కార్యకర్తల హక్కులను కాపాడాలి**

రాజకీయ పార్టీల కార్యకర్తలకు తమ అభిప్రాయాలను వ్యక్తపరిచే హక్కు ఉందని చైతన్య కిరణ్ అన్నారు. రాజకీయ విభేదాల నేపథ్యంలో కేసులు నమోదు చేసి కార్యకర్తలను ఇబ్బందులకు గురిచేయడం సరికాదని పేర్కొన్నారు.చట్టాన్ని గౌరవిస్తూ పోలీసులు నిష్పక్షపాతంగా వ్యవహరించాలని కోరారు. ఆశా వర్కర్ల సమస్యలను ప్రభుత్వం సానుకూలంగా పరిశీలించి వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని,బీఆర్ఎస్ కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటామని చైతన్య కిరణ్ స్పష్టం చేశారు.





# చర్లపల్లి గౌడ సంఘం నూతన కమిటీ ఎన్నిక

**చర్లపల్లి, అక్టోబర్ 11(ప్రజా క్షేత్రం):**

చర్లపల్లి గీత పారిశ్రామిక సహకార సంఘం నూతన కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రుద్రగోని రాంచందర్ గౌడ్, ప్రధాన కార్యదర్శిగా రాగీరు నరసింహ గౌడ్, కోశాధికారిగా కాసుల శశికాంత్ గౌడ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా బొడిగె రాములు గౌడ్, బిజ్జ ఆనంద్ రాజు గౌడ్; సంయుక్త కార్యదర్శులుగా బొడిగె శ్రీరాములు గౌడ్, జీడి శ్రీరాములు గౌడ్; ఆర్గనైజింగ్ కార్యదర్శులుగా రాగీరు నాథం గౌడ్, బొడిగె క్రాంతి గౌడ్ ఎంపికయ్యారు. గౌడ సంఘం సమస్యల పరిష్కారానికి, సభ్యుల సంక్షేమానికి కృషి చేస్తామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ఈ కార్యక్రమం లో బి. శ్రావణ్ కుమార్ గౌడ్, నిమ్మల అశోక్ గౌడ్, కె. ఆనంద్ గౌడ్, బొడిగె రాజు గౌడ్, ఆర్. వెంకటేష్ గౌడ్, ఆర్. బాబు గౌడ్, ప్రభాకర్ గౌడ్, ఆర్. వినయ్ సాగర్ గౌడ్, బి. ప్రేమ్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# మహిళలు స్వయం ఉపాధిరంగంలో రాణించాలి

- **భర్తకు తోడుగా తల్లిదండ్రులకు అండగా మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి**
- **కోటగిరి మహిళలకు ఉచిత శిక్షణ ఇచ్చిన ఎస్బిఐ ఆర్సెటి సంస్థకు ధన్యవాదాలు**

**కోటగిరి అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

కోటగిరి మండల కేంద్రంలోని గ్రామపంచాయతీ కార్యాలయంలో స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ ఆధ్వర్యం లో మహిళలకు కాస్ట్యూమ్ జ్యువలరీ శిక్షణ గత 14 రోజులుగా కొనసాగగా ఆదివారం తో 14 రోజుల పూర్తి కావడంతో ఎస్బిఐ ఆర్సెటి సంస్థ కో ఆర్డి నేటర్ రామ కృష్ణ ఆధ్వర్యంలో ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కోటిగిరి మండల సర్పంచుల పోరం అధ్యక్షులు స్థానిక సర్పంచ్ బర్ల మధుకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా 14 రోజులలో నేర్చుకొని తయారుచేసిన కాస్ట్యూమ్ జ్యువలరీ లను చూసి అవి తయారు చేసిన మహిళలను అభినందించారు. అనంతరం సర్పంచ్ బర్ల మధుకర్ మాట్లాడుతూ... రిటైర్డ్ ఉపాధ్యాయులు రమేష్ సహకారంతో డిచ్పల్లి ఎస్బిఐ ఆర్సెటి సంస్థ ద్వారా కోటగిరి మండల కేంద్రంలో నిరుద్యోగ యువతులు మహిళలు స్వయం ఉపాధి పొందేందుకు కాస్ట్యూమ్ జ్యువలరీ శిక్షణ కార్యక్రమం ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. శిక్షణ పొందిన నిరుద్యోగ యువతులు, మహిళలకు వ్యాపారం చేసుకోవడం కోసం ఎస్బిఐ ద్వారా 10 లక్షల వరకు లోన్ సదుపాయం కల్పించడం చాలా గొప్ప విషయమని ఆయన పేర్కొన్నారు. శిక్షణ తీసుకున్న ప్రతి ఒక్కరూ కాస్ట్యూమ్ జ్యువలరీ దుకాణాలు వేసి అభివృద్ధి చెందాలని ఆయన ఆకాంక్షించారు. మహిళలు స్వయం ఉపాధి రంగంలో రాణించి తమ కాళ్లపై తాము నిలబడాలని అన్నారు. భర్తకు తోడుగా తల్లి దండ్రులకు అండగా మహిళలు ముందుకు సాగుతూ ఆర్థికంగా ఎదిగి అన్ని రంగాల్లో రాణించాలని కోరారు. అలాగే స్టేట్ బ్యాంక్ గ్రామీణ స్వయం ఉపాధి సంస్థ కో ఆర్డి నేటర్ రామకృష్ణ మాట్లాడుతూ... డిచ్ పల్లి ఎస్బిఐ ఆర్సెటి సంస్థ ద్వారా కోటగిరి లో 25 మంది నిరుద్యోగ యువతులు మహిళలకు కాస్ట్యూమ్ జ్యువలరీ శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. ఈ 14 రోజుల శిక్షణకు 25 మంది క్రమం తప్పకుండా శిక్షణ తీసుకున్నారని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకురాలు, నిరుద్యోగ యువతులు మహిళలు తదితరులు పాల్గొన్నారు.



# వీధి కుక్కల దాడిలో 25 గొర్రెలు మృతి

- **రూ.3 లక్షల నష్టం.. పరిహారం ఇవ్వాలని గ్రామస్తుల డిమాండ్.**

**చేవెళ్ల అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

చేవెళ్ల మండలంలోని ముడిమ్యాల్ గ్రామంలో వీధి కుక్కల దాడిలో రైతు మంద్ర మల్లేష్‌కు చెందిన దాదాపు 25 గొర్రెలు మృతి చెందాయి. శనివారం అర్ధ రాత్రి దాటిన తర్వాత గొర్రెల మందపై వీధి కుక్కలు ఒక్కసారిగా దాడి చేశాయి. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. ఉదయం మల్లేష్ లేచి చూసేసరికి గొర్రెలు మృతి చెంది కనిపించడంతో కన్నీరు మున్నీర య్యాడు. కుక్కల దాడిలో సుమారు రూ.3 లక్షల వరకు ఆస్తి నష్టం వాటిల్లిందని, జీవనాధారమైన గొర్రెలు చనిపోవడంతో తన కుటుంబం రోడ్డున పడిందని బాధితుడు వాపోయాడు. సమాచారం అందుకున్న స్థానిక గ్రామస్తులు సంఘటనా స్థలానికి చేరుకుని రైతుకు ధైర్యం చెప్పారు. గ్రామంలో రోజురోజుకూ వీధి కుక్కల బెడద ఎక్కువవుతోందని, అధికారులు వెంటనే స్పందించి వీధి కుక్కల రక్షణ చర్యలు చేపట్టాలని వారు డిమాండ్ చేశారు. తీవ్రంగా నష్టపోయిన బాధిత రైతు మల్లేష్‌కు ప్రభుత్వం వెంటనే పరిహారం అందించి న్యాయం చేయాలని కోరారు.



## సెంటిని శ్రీమన్నారాయణ గారు హాస్పిటల్ ప్రారంభోత్సవానికి హాజరైన ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు

**ప్రజాక్షేత్రం, ఎర్రుపాలెం.**




ఆహ్వానించిన డాక్టర్ శ్రీమన్నారాయణ గారు ఏకే రామారావు గారు & తుళ్ళూరి కోటేశ్వరరావు గారు హస్పటల్ ప్రారంభోత్సవానికి హాజరైన జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు వేమిరెడ్డి సుధాకర్ రెడ్డి, ఎర్రుపాలెం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొగ్గుల శ్రీనివాస్ రెడ్డి, మండల సీనియర్ నాయకులు అనుమోలు వెంకట క్రిష్ణా రావు, మార్కెట్ కమిటీ డైరెక్టర్ గూడేటి బాబురావు, యూత్ కాంగ్రెస్ నాయకులు దేవరకొండ రాజీవ్ గాంధీ, క్లస్టర్ ఇంచార్జ్ శీలం వెంకటరామిరెడ్డి, మండల డ్రగిస్ట్ & కెమిస్ట్రీ అధ్యక్షులు కర్నాటి సుధాకర్ రెడ్డి తదితరులు నాయకులు పాల్గొన్నారు..

# భక్తి పారవశ్యానికి వేళాయె..పెద్దేముల్‌లో శ్రీ వీరాంజనేయ స్వామి బ్రహ్మోత్సవం!

- **14, 15 తేదీల్లో ఆలయ సంప్రోక్షణ,ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన,శిఖర స్థాపన**
- **వేద మంత్రోచ్చారణల నడుమ వైదిక క్రతువులు..సీతారాముల కల్యాణం, మహా అన్నదానం**
- **ముఖ్య అతిథులుగా పట్నం మహేందర్‌రెడ్డి,కొండా విశ్వేశ్వర్‌రెడ్డి,బుయ్యని మనోహర్‌రెడ్డి**

**పెద్దేముల్,అక్టోబర్ 11 (ప్రజాక్షేత్రం):**

వేద మంత్రోచ్చారణలు,మంగళ వాయిద్యాల నడుమ ఆధ్యాత్మిక శోభ.. భక్తజన సందోహంతో పెద్దేముల్ మండల కేంద్రం పులకించనుంది. శ్రీ వీరాంజనేయ స్వామి ఆలయ సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర స్థాపన మహోత్సవాలకు ఆలయ ప్రాంగణం ముస్తాబవుతోంది.ఈ నెల 14, 15 తేదీల్లో రెండు రోజుల పాటు అత్యంత వైభవంగా నిర్వహించనున్న ఈ ఆధ్యాత్మిక వేడుకలకు ఆలయ నిర్వాహకులు, గ్రామ సర్పంచ్,గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు విస్తృత ఏర్పాట్లు చేస్తున్నారు.ప్రత్యేక పూజలు, హోమాలు, సీతారాముల కల్యాణోత్సవం, మహా అన్నదానం వంటి కార్యక్రమాలతో పండుగ వాతావరణం నెలకొననుంది.

**తొలి రోజు.. వైదిక క్రతువులకు శ్రీకారం**

ఈ నెల 14వ తేదీ బుధవారం ఉదయం 7.30 గంటలకు స్వస్తివాచనంతో మహోత్సవ కార్యక్రమాలు ప్రారంభం కానున్నాయి.గణపతి పూజ, గోపూజ, పుణ్యాహవాచనం, ఋత్విగ్వరణం, రక్షాబంధనం, అఖండ దీపారాధన, మాతృకా పూజ, నాందీ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు.అనంతరం అంకురారోపణం, సర్వతోభద్ర మండల దేవతా స్థాపన, వాస్తు పీఠస్థాపన, నవగ్రహ మండల దేవతా స్థాపన, యోగిని పీఠస్థాపన, మండప సంస్కారం వంటి విశిష్ట వైదిక క్రతువులు జరగనున్నాయి. ప్రతిమా శోధనం, ప్రాసాద సంస్కారం, జలాధివాసం, ధాన్యాధివాసం, మూలమంత్ర హోమం, శయ్యాధివాసం తదితర కార్యక్రమాలతో తొలి రోజు పూజలు కొనసాగనున్నాయి.

**రెండో రోజు..ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠాపన**

ఈ నెల 15వ తేదీ గురువారం ఉదయం 7 గంటలకు ఆవాహిత స్థాపిత దేవతా పూజ, మూలమంత్ర హోమం, గర్త సంస్కారం, యంత్ర స్థాపన కార్యక్రమాలు నిర్వహించనున్నారు. అనంతరం భక్తిశ్రద్ధల మధ్య మూలమూర్తి సంప్రోక్షణ, ధ్వజస్తంభ ప్రతిష్ఠాపన, శిఖర ప్రతిష్ఠాపన,పూర్ణాహుతి కార్యక్రమాలు జరగనున్నాయి.తదుపరి శ్రీ వీరాంజనేయ స్వామివారికి పంచామృత అభిషేకం,సింధూర సమర్పణ, విశేష అలంకరణ చేపట్టనున్నారు. స్వామివారి దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ నిర్వాహకులు ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు.



**సీతారాముల కల్యాణం.. మహా అన్నదానం**

మహోత్సవాల్లో భాగంగా సీతారాముల కల్యాణోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించనున్నారు.వేద మంత్రోచ్చారణలు,మంగళ వాయిద్యాల నడుమ జరిగే కల్యాణోత్సవం భక్తులను ఆధ్యాత్మిక పారవశ్యంలో ముంచెత్తనుంది.స్వామివారి దర్శనం, ప్రత్యేక పూజల్లో పాల్గొనేందుకు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది. కల్యాణోత్సవం అనంతరం భక్తుల కోసం మహా అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేయనున్నారు.

**ప్రముఖుల రాక.. భక్తులకు ఆహ్వానం**

ఈ ఆధ్యాత్మిక మహోత్సవానికి తెలంగాణ శాసన మండలి చీఫ్ విప్ పట్నం మహేందర్‌రెడ్డి, చేవెళ్ల ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే పైలట్ రోహిత్‌రెడ్డి ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారుగౌరవ అతిథులుగా డీసీసీ అధ్యక్షుడు జాదవ్ ధారాసింగ్, ఎస్. నరేందర్‌రెడ్డి దొర,ధ్వజస్తంభ దాత కోహిర్ రాజు, చిట్టెపు రాఘవేందర్‌రెడ్డి తదితరులు పాల్గొననున్నారు.ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు,పెద్దేముల్ గ్రామ సర్పంచ్ డివై. నర్సింహులు,గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు మాట్లాడుతూ శ్రీ వీరాంజనేయ స్వామివారి ఆశీస్సులు పొందేందుకు భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి రెండు రోజుల పాటు జరిగే పవిత్ర మహోత్సవాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.ఈ వేడుకలతో పెద్దేముల్ మండల కేంద్రం భక్తి భావంతో మార్మోగనుంది.

# ఎంపీ చొరవతో మేడిపల్లి విద్యుత్ సమస్యకు పరిష్కారం - సర్పంచ్ మల్కాపురం శ్రీనివాస్

**మొయినాబాద్,అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

మేడిపల్లి గ్రామంలోని ఒకటో వార్డులో నెలకొన్న విద్యుత్ సమస్యను ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లగా, ఆయన స్పందించి సమస్య పరిష్కారానికి చొరవ చూపారని గ్రామ సర్పంచ్ మల్కాపురం శ్రీనివాస్ తెలిపారు. వీర హనుమాన్ ఆలయం సమీపంలో మూడు ట్రాన్స్‌ఫార్మర్లు, 20 విద్యుత్ స్తంభాలు, కేబుల్ వైర్ల ఏర్పాటుకు చర్యలు చేపట్టడం గ్రామ ప్రజలకు ఉపశమనం కలిగించే విషయమని అన్నారు.గ్రామంలో విద్యుత్ సమస్యతో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ఎంపీకి వివరించామని, వెంటనే ఆయన సంబంధిత అధికారులతో ఫోన్‌లో మాట్లాడి అవసరమైన చర్యలు తీసుకోవాలని సూచించారని పేర్కొన్నారు. గ్రామ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు స్పందించిన ఎంపీ కొండా విశ్వేశ్వర్ రెడ్డికి గ్రామ ప్రజలు, గ్రామపంచాయతీ తరపున ప్రత్యేక కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని సర్పంచ్ మల్కాపురం శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు పి. మమతా రమేష్,కావలి నవీన్ కుమార్, కొత్తపల్లి బాలరాజ్,బట్టు శ్రీశైలం, చీమల మధుకర్‌తో పాటు గ్రామస్తులు పాల్గొన్నారు.






# దేగాం గ్రామంలో గోశాల నిర్మాణానికి భూమిపూజ..

- **గోశాల నిర్మాణానికి భూమిపూజ చేసిన సర్పంచ్ సుష్మా రెడ్డి దశలవారీగా మౌలిక సదుపాయాల కల్పనకు కృషి**

**నిర్మల్ జిల్లా,అక్టోబర్ 11 (ప్రజాక్షేత్రం):**

భైంసా మండలం దేగాం గ్రామంలో పశువుల సంరక్షణకు గోశాల నిర్మాణం చేపట్టనున్నారు. వీబీజీ రాంజీ పథకం కింద రూ.10 లక్షల నిధులతో నిర్మించనున్న గోశాలకు ఆదివారం గ్రామ సర్పంచ్ సిరం సుష్మారెడ్డి భూమిపూజ చేసి పనులను ప్రారంభించారు. గ్రామంలో పశువుల సంరక్షణకు అవసరమైన సదుపాయాలను కల్పించడంతో పాటు, దశలవారీగా అభివృద్ధి పనులు చేపట్టేందుకు కృషి చేస్తున్నట్లు ఆమె తెలిపారు.

ఈ సందర్భంగా సర్పంచ్ సిరం సుష్మారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో గోశాల నిర్మాణానికి నిధులు మంజూరు చేయించడంలో సహకరించిన ముధోల్ ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్‌కు కృతజ్ఞతలు తెలిపారు. గోశాల నిర్మాణం పూర్తయితే పశువుల సంరక్షణకు ఉపయోగకరంగా ఉంటుందని పేర్కొన్నారు. గ్రామంలో అవసరమైన అభివృద్ధి పనులను గుర్తించి ప్రాధాన్య క్రమంలో చేపట్టేందుకు కృషి చేస్తామని చెప్పారు.

గ్రామాభివృద్ధే తన ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నిరంతరం కృషి చేస్తానని సుష్మారెడ్డి తెలిపారు. గ్రామస్తులందరి సహకారంతో అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు. గ్రామంలో ప్రజలకు ఉపయోగపడే పనులకు ప్రాధాన్యం ఇస్తూ, అందరి భాగస్వామ్యంతో దేగాంను అభివృద్ధి పథంలో నడిపించేందుకు కృషి చేస్తానన్నారు.

ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ బాలేకర్ శివాజీ,వార్డు సభ్యులు, మోహన్ రెడ్డి,చోటు, ఆనంద్ గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# చేవెళ్ల మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుని గా ఈదులపల్లి రాములు

**చేవెళ్ల అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

ఎస్సీ డిపార్ట్మెంట్ జిల్లా చైర్మన్ క్యారగరి శ్రీధర్ మరియు చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి భీమ్ భరత్ నియామక పత్రాన్ని చేవెళ్ల మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షుని గా ఈదులపల్లి రాములుకు అందజేశారు. ఈ సందర్భంగా ఈదులపల్లి రాములు మాట్లాడుతూ మండల కాంగ్రెస్ పార్టీ బలోపేతం కోసం పనిచేస్తానని చెప్పారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ సీనియర్ నాయకులు సర్పంచ్ లు మార్కెట్ కమిటీ చైర్మన్ లు డైరెక్టర్ లు వివిధ మండలాల అధ్యక్షులు, యూత్ కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



# మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పులగల్ల కుమార్

**మొయినాబాద్, అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

మొయినాబాద్ మున్సిపల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పులగల్ల కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పామెన భీం భరత్ సహకారంతో, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్ ఆధ్వర్యంలో ఈ ఎన్నిక జరిగింది. ఈ సందర్భంగా పులగల్ల కుమార్ మాట్లాడుతూ... తనపై నమ్మకంతో అధ్యక్ష బాధ్యతలు అప్పగించిన పామెన భీం భరత్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, మొయినాబాద్ మండల, మున్సిపల్ అధ్యక్షుడు బొలిగిద్ద సత్యనారాయణ, విక్రమ్ రెడ్డి, మాజీ అధ్యక్షుడు మానయ్యలకు కృతజ్ఞతలు తెలిపారు. తనకు అప్పగించిన బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తూ కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.



# ముక్కగాళ్ల మచ్చేందర్ కుటుంబానికి ఆర్థిక సాయం

- **ఆర్థిక సహాయం అందించిన పట్లోళ్ల బ్రదర్స్ మహేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి.**

**నవాబుపేట్ అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

మర్పల్లి మండలం కోత్లాపూర్ గ్రామానికి చెందిన ముక్క గాళ్ల మచ్చేందర్ గత మూడు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలపాలై ఉదయం మృతి చెందడం జరిగిందని తెలియడంతో గ్రామానికి చెందిన పట్లోళ్ల అన్నదమ్ములు మహేశ్వర్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి తమ తల్లిదండ్రుల పట్లోళ్ల సుశీలమ్మ బలవంత రెడ్డి జ్ఞాపకార్థంగా ముక్కగాళ్ల మచ్చేందర్ అంత్యక్రియలకు 5000 ఆర్థిక సహాయం అందించడం జరిగిందని గ్రామ పెద్దలు తెలిపారు. గ్రామంలో మృతి చెందిన కుటుంబాలకు తమకు తోచినంత సహాయం అందించడమే లక్ష్యంగా ముందుకు వెళ్తామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ ప్రభాకర్, విష్ణువర్ధన్ రెడ్డి, డీలర్ రాములు, మాజీ ఎంపీటీసీ. ప్రకాష్, సుదర్శన్, ముక్కగాళ్ల యాదయ్య, లింగప్ప, అల్లూరి రవి, వార్డ్ సభ్యులు పరిగి కృష్ణ, శిలపల్లి నవీన్, ముక్కగాళ్ల మధు, అంకినపల్లి శివకుమార్, కోమారి మన్మోహన్ ముక్కగాళ్ల ఇమ్మానియేల్, దిగువ మోహన్, దిగ్వల్ కృష్ణ, నల్లోల్ల గోపాల్, తదితరులు పాల్గొన్నారు.



# శ్రీశైలంలో ఘనంగా ప్రారంభమైన దసరా మహోత్సవాలు

**నంద్యాల శ్రీశైలం అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం)**

నంద్యాల జిల్లా శ్రీశైల మహాక్షేత్రంలో దసరా మహోత్సవాలు ఘనంగా ప్రారంభమైనాయి 10 రోజులపాటు నిర్వహించే దసరా ఉత్సవాలకు ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పోతుగుంట రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు దంపతులు, ట్రస్ట్ సభ్యులు అర్చకులు, వేదపండితులు శాస్త్రోక్తంగా ప్రత్యేక పూజలు చేసి దసరా మహోత్సవాలకు శ్రీకారం చుట్టారు ముందుగా గణపతిపూజ, శివసంకల్పం, చండీశ్వరపూజ, కంకణాధారణ అఖండ దీపారాధన ,వాస్తు పూజ, వాస్తు హోమం ,వివిధ విశేష పూజలు నిర్వహించి దసరా మహోత్సవాలను నేటి నుంచి మొదలైన దసరా మహోత్సవాలలో ప్రతిరోజు సాయంత్రం వివిధ అలంకరణ రూపంలో అమ్మవారు భక్తులకు దర్శనం ఇవ్వగా వివిధ వాహనసేవలతో గ్రామోత్సవంగా శ్రీ స్వామి అమ్మవారు భక్తులకు దర్శనమిస్తారని అలానే మొదటిరోజైన నేటి సాయంత్రం అమ్మవారు శైలిపుత్రిగా దర్శనమిస్తారని అలానే శ్రీ స్వామి అమ్మవారు భృంగి వాహనంపై ఆశీనులై క్షేత్ర పురవీధుల్లో విహరిస్తూ భక్తులకు దర్శనమిస్తారని ఆలయ చైర్మన్ రమేష్ నాయుడు, ఈఓ శ్రీనివాసరావు తెలిపారు.



# ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మున్సిపల్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకం

- **9వ వార్డు కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్.**

**మొయినాబాద్, అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో మున్సిపల్ సిబ్బంది పాత్ర ఎంతో కీలకమని 9వ వార్డు కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్ అన్నారు. దసరా పండుగను పురస్కరించుకుని యెన్కేపల్లి మున్సిపల్ సిబ్బందికి 9వ వార్డు కౌన్సిలర్ ముదిగొండ ప్రభాకర్ యాదవ్ నూతన వస్త్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ప్రజల ఆరోగ్యం, పరిసరాల పరిశుభ్రత కోసం పారిశుద్ధ్య సిబ్బంది నిరంతరం కష్టపడుతూ అందిస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. పండుగ వేళ సిబ్బందిని గౌరవించుకోవడం, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొన్నారు. దసరా పండుగ ప్రతి ఒక్కరి జీవితాల్లో సుఖసంతోషాలు, ఆయురారోగ్యాలు, శ్రేయస్సు నింపాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, వార్డు ప్రజలు తదితరులు పాల్గొన్నారు.





# ప్రకృతి అందాలతో కనువిందు చేస్తున్న ఇందూరు రహదారి!

- **- పచ్చదనంతో పరవశం.. ప్రయాణంలో ఆహ్లాదం!**
- **రహదారికి ఇరువైపులా తెలంగాణ హరితహారం మొక్కలు**
- **వాహనదారులకు చల్లని నీడ.. ప్రయాణికులకు కనువిందు**
- **పచ్చని చెట్లతో ప్రకృతి అందాలు.. ఆహ్లాదకరంగా రహదారి ప్రయాణం**

**పెద్దేముల్, అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

రహదారికి ఇరువైపులా పచ్చని చెట్లు.. ఆహ్లాదాన్ని పంచే ప్రకృతి అందాలు.. ఎండలో ప్రయాణించే వారికి చల్లని నీడ.. వెరసి ప్రయాణికులకు ఆహ్లాదకరమైన అనుభూతిని పంచుతున్నాయి తెలంగాణ హరితహారం మొక్కలు. పెద్దేముల్ మండల పరిధిలోని తాండూరు-జహీరాబాద్ ప్రధాన రహదారిపై ఇందూరు గ్రామ శివారులో రోడ్డుకు ఇరువైపులా పెరిగిన పచ్చని మొక్కలు చూపరులను ఆకట్టుకుంటున్నాయి. పచ్చదనంతో కళకళలాడుతున్న ఈ ప్రాంతం మీదుగా ప్రయాణించే వాహనదారులు, ప్రయాణికులకు ప్రకృతి ఒడిలో ప్రయాణిస్తున్న అనుభూతిని కలిగిస్తోంది.

**పచ్చదనంతో కనువిందు**

తెలంగాణ హరితహారం కార్యక్రమంలో భాగంగా రహదారుల వెంట నాటిన మొక్కలు క్రమంగా పెరిగి పచ్చదనాన్ని విరజిమ్ముతున్నాయి. ఇందూరు గ్రామ శివారులో రోడ్డుకు ఇరువైపులా విస్తరించిన పచ్చని చెట్లు ఆ మార్గానికి ప్రత్యేక అందాన్ని తీసుకొచ్చాయి. రహదారిపై ప్రయాణించే వారికి పచ్చని ప్రకృతి దృశ్యాలు కనువిందు చేస్తున్నాయి. ముఖ్యంగా ఎండల సమయంలో చెట్ల నీడ ప్రయాణికులకు కొంత ఉపశమనాన్ని కలిగిస్తోంది. పర్యావరణ పరిరక్షణకు హరితహారం బాట పర్యావరణ సమతుల్యతను కాపాడటంలో మొక్కలు, చెట్లు కీలక పాత్ర పోషిస్తాయి. రహదారుల వెంట పచ్చదనం పెంపొందించడం వల్ల ప్రకృతి సౌందర్యం మెరుగుపడటంతో పాటు స్థానిక పర్యావరణానికి కూడా మేలు కలుగుతుంది. చెట్లు పెరిగే కొద్దీ పరిసరాల్లో పచ్చదనం విస్తరించి, ప్రజలకు ఆహ్లాదకరమైన వాతావరణం అందుతుంది. హరితహారం లక్ష్యాలు సాకారం కావాలంటే నాటిన మొక్కలను సంరక్షించడం, వాటి ఎదుగుదలకు అవసరమైన చర్యలు తీసుకోవడం ఎంతో ముఖ్యం.

**మొక్కల సంరక్షణ అందరి బాధ్యత**

నాటిన మొక్కలు చెట్లుగా ఎదిగి ప్రజలకు ఉపయోగపడుతున్న తీరు పర్యావరణ పరిరక్షణ ప్రాధాన్యతను గుర్తుచేస్తోంది. రహదారుల వెంట ఉన్న మొక్కలు ఎండిపోకుండా అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాలని పర్యావరణ ప్రేమికులు సూచిస్తున్నారు. పచ్చదనాన్ని కాపాడుకోవడం ప్రభుత్వంతో పాటు ప్రతి పౌరుడి బాధ్యత. నేడు నాటిన మొక్కలే రేపటి తరాలకు నీడనిచ్చే వృక్షాలుగా మారుతాయని, వాటిని సంరక్షిస్తేనే హరితహారం ఆశయం నెరవేరుతుందని పలువురు అభిప్రాయపడుతున్నారు. ప్రకృతిని కాపాడితేనే మనిషికి ప్రశాంతమైన జీవనం సాధ్యమవుతుంది. ఇందూరు గ్రామ శివారులో రహదారికి ఇరువైపులా విరాజిల్లుతున్న పచ్చదనం హరితహారం ప్రాధాన్యతను చాటిచెబుతోంది. మొక్కలను నాటి వదిలేయకుండా వాటిని సంరక్షిస్తూ, మరిన్ని మొక్కలు నాటేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలి. అప్పుడే పచ్చని తెలంగాణ కల సాకారమవుతుంది.

# తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ

- **మాజీ మంత్రి ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి**

**శంషాబాద్ అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు ప్రతీక బతుకమ్మ పండుగ అని మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అన్నారు. ఆదివారం శంషాబాద్ పట్టణంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో డివిజన్ అధ్యక్షుడు కోలన్ ప్రదీప్ రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన బతుకమ్మ సంబరాలకు ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ... తెలంగాణ సాంస్కృతి సాంప్రదాయాలకు బతుకమ్మ పండుగ అని మహిళలు భక్తిశ్రద్ధలతో రంగురంగుల పూలతో బతుకమ్మలను పేర్చి, సాంప్రదాయక పాటలతో ఆడుతున్న ఉత్సవాలలో కాసేపు గడిపారు. అనంతరం ప్రజలందరికీ బతుకమ్మ మరియు దసరా పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీపీ చెక్కల ఎల్లయ్య, మురళీధర్ రెడ్డి, శ్రీనివాస్, సునీత మహేందర్ రెడ్డి, బుచ్చిరెడ్డి, శేఖర్, దీప మల్లేష్, రాష్ట్ర నాయకులు మంచర్ల శ్రీనివాస్, జయసింహ, రాహుల్, రమేష్, రాజేందర్, చరణ్, వెంకట్ రెడ్డి, శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.



# జిల్లా ఏర్పాటు హర్షణీయం.. అభివృద్ధి ఆక్షేపణీయం!

- **ఉద్యమాలతో సాధించుకున్న వికారాబాద్ జిల్లా.**
- **పదేళ్ల తర్వాత కూడా వెనుకబాటేనా?**
- **వి.డి.డి.ఎఫ్. చైర్మన్ కె. శ్రీనివాస్**

**వికారాబాద్,అక్టోబర్ 11 (ప్రజాక్షేత్రం):**

వికారాబాద్ జిల్లా ఏర్పాటు కోసం సాగిన ఉద్యమం ఒకరోజులో పుట్టింది కాదు.. దశాబ్దాల ఆకాంక్ష, ప్రజల నిరీక్షణ, ప్రజా సంఘాల పోరాటం, ఉద్యమకారుల కృషి ఫలితంగానే జిల్లా ఆవిర్భవించిందని వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం (విడిడిఎఫ్) చైర్మన్ కె. శ్రీనివాస్ పేర్కొన్నారు. అయితే జిల్లా ఏర్పాటు జరిగినప్పటికీ ఆశించిన స్థాయిలో అభివృద్ధి జరగకపోవడం ఆందోళన కలిగించే అంశమని ఆయన అభిప్రాయపడ్డారు.

**దశాబ్దాల కల.. 2016లో సాకారం**

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో రంగారెడ్డి జిల్లా ఏర్పాటైన 1978 నుంచి వికారాబాద్ ప్రాంత ప్రజల్లో ప్రత్యేక జిల్లా కేంద్రం కావాలనే ఆకాంక్ష ఉన్నప్పటికీ అది సుదీర్ఘకాలం నెరవేరలేదని శ్రీనివాస్ గుర్తుచేశారు. ప్రాంతీయ ప్రజాప్రతినిధుల మధ్య సమన్వయం, రాజకీయ చిత్తశుద్ధి వంటి అంశాలు కూడా ఈ డిమాండ్ ముందుకు సాగడంలో ప్రభావం చూపాయని ఆయన పేర్కొన్నారు.

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం బలపడిన సమయంలో ప్రత్యేక తెలంగాణ సాధన ప్రధాన లక్ష్యంగా మారడంతో వికారాబాద్ జిల్లా ఉద్యమం కొంతకాలం వెనుకబడిందని ఆయన వివరించారు.

**2010లో మళ్లీ జిల్లా ఉద్యమానికి ఊపిరి**

2010 అక్టోబర్‌లో కొత్త జిల్లాల ఏర్పాటు గురించి అప్పటి మంత్రి మాణిక్య వరప్రసాద్ చేసిన ప్రకటన నేపథ్యంలో వికారాబాద్ ప్రాంత ఉద్యమకారులు సమావేశమై జిల్లా ఉద్యమాన్ని మళ్లీ ముందుకు తీసుకెళ్లాలని నిర్ణయించుకున్నారని శ్రీనివాస్ తెలిపారు.

తెలంగాణ ఉద్యమానికి తెలంగాణ జేఏసీ ఉన్నట్లే.. వికారాబాద్ జిల్లా సాధన కోసం ప్రత్యేక వేదిక అవసరమనే ఆలోచనతో వికారాబాద్ జిల్లా ఫోరం (వీడీఎఫ్) ఏర్పడిందని చెప్పారు. ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు, పశ్చిమ రంగారెడ్డి ప్రాంత ప్రజాప్రతినిధులతో వరుస సమావేశాలు నిర్వహించి తీర్మానాలు చేయించామని, ప్రాంతీయ ఎమ్మెల్యేలతో కలిసి అప్పటి మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కలిసి జిల్లా డిమాండ్‌ను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లాలని కోరామని తెలిపారు.

**కిరణ్‌కుమార్‌రెడ్డి వద్దకు జిల్లా డిమాండ్**

ఫోరం ప్రతినిధులు, ప్రాంతీయ శాసనసభ్యులకు అప్పటి ముఖ్యమంత్రి కిరణ్‌కుమార్‌రెడ్డి అపాయింట్‌మెంట్ లభించడంతో జిల్లా ఏర్పాటు ఆవశ్యకతను ఆయనకు వివరించామని శ్రీనివాస్ చెప్పారు.కొత్త జిల్లాల ఏర్పాటు జరిగితే వికారాబాద్‌ను తప్పకుండా పరిగణనలోకి తీసుకుంటామని అప్పటి ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారని ఆయన పేర్కొన్నారు. అయితే ఉమ్మడి రాష్ట్రంలో కొత్త జిల్లాల ఏర్పాటు కార్యరూపం దాల్చకపోవడంతో ఆ ప్రయత్నం ముందుకు సాగలేదన్నారు.

**తెలంగాణ ఉద్యమంలోకి జిల్లా ఉద్యమకారులు**

2010-2014 మధ్య తెలంగాణ ఉద్యమం తీవ్రస్థాయికి చేరడంతో జిల్లా ఉద్యమాన్ని తాత్కాలికంగా పక్కనపెట్టి తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఉద్యమంలో పాల్గొన్నామని శ్రీనివాస్ తెలిపారు.

2014లో తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత జిల్లా డిమాండ్ మళ్లీ ప్రధానంగా ముందుకు వచ్చిందన్నారు. అప్పటి తెలంగాణ రాష్ట్ర సమితి అధినేత కేసీఆర్ వికారాబాద్‌లో జరిగిన సభల్లో జిల్లా ఏర్పాటు హామీ ఇచ్చారని, అనంతరం ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటుకు చర్యలు ప్రారంభించిందని వివరించారు.

**చివరి దశలో మళ్లీ ఉత్కంఠ**

2016లో కొత్త జిల్లాల ఏర్పాటుపై ప్రక్రియ వేగం పుంజుకున్న సమయంలో వికారాబాద్ జిల్లా కోసం ఫోరం ఉద్యమాన్ని మరింత తీవ్రతరం చేసిందని శ్రీనివాస్ తెలిపారు.

అదే సమయంలో శంకర్‌పల్లి, చేవెళ్ల, మొయినాబాద్ ప్రాంతాలను కలుపుకొని శంషాబాద్ జిల్లా ఏర్పాటు చేయాలనే డిమాండ్లు కూడా ముందుకు రావడంతో వికారాబాద్ జిల్లా ఏర్పాటుపై అనిశ్చితి నెలకొందన్నారు.

వికారాబాద్ జిల్లా రావడం ఖాయం కాదనే పరిస్థితులు ఏర్పడినా ఉద్యమాన్ని విరమించలేదని, మంత్రులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి తదితర ఉన్నతాధికారులకు వినతిపత్రాలు సమర్పిస్తూ ప్రభుత్వంపై ఒత్తిడి కొనసాగించామని చెప్పారు.

**అక్టోబర్ 11.. వికారాబాద్ జిల్లా ఆవిర్భావం**

2016 అక్టోబర్ 11న తెలంగాణలో కొత్తగా 31 జిల్లాల ఏర్పాటు అమల్లోకి వచ్చింది. అనంతరం జిల్లాల సంఖ్య 33కు చేరింది. ఆ ప్రక్రియలో వికారాబాద్ జిల్లా ఏర్పడింది.అయితే ఉద్యమకారులు కోరుకున్న భౌగోళిక నిర్మాణానికి భిన్నంగా జిల్లా ఏర్పడిందనే అసంతృప్తి అప్పట్లో వ్యక్తమైందని శ్రీనివాస్ అన్నారు.వికారాబాద్‌కు సమీపంలోని కొన్ని ప్రాంతాలు రంగారెడ్డి జిల్లాలోనే కొనసాగగా, దూర ప్రాంతాల్లోని కొడంగల్, దౌలతాబాద్ తదితర ప్రాంతాలు కొత్త వికారాబాద్ జిల్లాలో చేరాయని ఆయన గుర్తుచేశారు. జిల్లా వచ్చింది.. ఇక అభివృద్ధి జరుగుతుందని ప్రజలు ఆశించారు. కానీ ఆ ఆశలు పూర్తిగా నెరవేరలేదన్నది విరుద్ధ వాదన.

**జిల్లా సాధించాం.. అభివృద్ధి సాధించామా?**

జిల్లా ఏర్పాటుతో వెనుకబడిన ప్రాంతంగా ప్రత్యేక నిధులు, ప్రత్యేక అభివృద్ధి కార్యక్రమాలు వస్తాయని ప్రజలు ఆశించారని శ్రీనివాస్ తెలిపారు.జిల్లా సాధన అనంతరం వికారాబాద్ జిల్లా ఫోరంను *వికారాబాద్ డిస్ట్రిక్ట్ డెవలప్‌మెంట్ ఫోరం (వీడీడీఎఫ్)*గా మార్చి, జిల్లా అభివృద్ధిపై కూడా పోరాటం కొనసాగించాలని నిర్ణయించుకున్నామని చెప్పారు.

జిల్లా ఏర్పాటు సంబరాలను వికారాబాద్ బ్లాక్ గ్రౌండ్‌లో సుమారు 10 వేల మంది ప్రజలు, విద్యార్థులతో నిర్వహించామని తెలిపారు.

**అభివృద్ధి విషయంలో ఎందుకు వెనుకబాటు?**

జిల్లా ఏర్పడి దాదాపు దశాబ్దం పూర్తవుతున్న సమయంలో వికారాబాద్ అభివృద్ధిపై సమీక్ష అవసరమని శ్రీనివాస్ పేర్కొన్నారు.

కలెక్టరేట్, ప్రభుత్వ మెడికల్ కళాశాల వంటి కొన్ని ముఖ్యమైన సంస్థలు జిల్లాకు వచ్చినప్పటికీ, జిల్లా కేంద్ర స్థాయికి తగిన పెద్ద మౌలిక వసతులు, పారిశ్రామిక అభివృద్ధి, రహదారులు, రవాణా, ఉపాధి అవకాశాలు, ప్రభుత్వ రంగ సంస్థల విషయంలో ఇంకా చాలా చేయాల్సి ఉందని ఆయన అభిప్రాయపడ్డారు.

ప్రశ్న ఇప్పుడు జిల్లా ఏర్పాటు జరిగిందా? అన్నది కాదు.. జిల్లా ఏర్పాటు వల్ల ప్రజల జీవితాల్లో ఎంత మార్పు వచ్చింది? అన్నదే.

**కొడంగల్ వైపు అభివృద్ధి.. జిల్లా కేంద్రం వైపు నిరీక్షణ?**

2023 ఎన్నికల అనంతరం తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రాతినిధ్యం వహిస్తున్న కొడంగల్ నియోజకవర్గంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్న నేపథ్యంలో వికారాబాద్ జిల్లా కేంద్రం అభివృద్ధిపై చర్చ మళ్లీ మొదలైంది.కొడంగల్ ప్రాంతానికి అభివృద్ధి రావడాన్ని వ్యతిరేకించాల్సిన అవసరం లేదని, అదే సమయంలో జిల్లా కేంద్రంగా ఉన్న వికారాబాద్‌కు కూడా సమాన ప్రాధాన్యం దక్కాలని శ్రీనివాస్ వాదిస్తున్నారు.

వికారాబాద్, పరిగి, తాండూరు ప్రాంతాల ప్రజల్లో అభివృద్ధి సమతుల్యతపై అసంతృప్తి పెరుగుతోందని ఆయన పేర్కొన్నారు.

అయితే ఈ విషయంలో సంబంధిత ప్రజాప్రతినిధుల వైఖరి, ప్రభుత్వ నిర్ణయాలు, నిధుల కేటాయింపులపై అధికారిక గణాంకాలతో సమగ్ర సమీక్ష అవసరం. ఒక ప్రాంతంలో అభివృద్ధి జరుగుతుండటం మరో ప్రాంతానికి నిధులు రావడం లేదనే విషయాన్ని స్వయంచాలకంగా నిర్ధారించదు. కాబట్టి జిల్లా అభివృద్ధిపై రాజకీయ ఆరోపణల కంటే నిధులు, ప్రాజెక్టులు, పూర్తయిన పనులు, పెండింగ్ పనుల ఆధారంగా ప్రజా చర్చ జరగాల్సిన అవసరం ఉంది.

**ప్రజాప్రతినిధులపై ప్రశ్నలు.. ప్రజల వద్ద సమాధానాల కోసం ఎదురుచూపులు**

జిల్లా కేంద్రం అభివృద్ధికి ఎమ్మెల్యేలు, ఎంపీలు, మంత్రులు, అధికారులు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందని శ్రీనివాస్ అభిప్రాయపడ్డారు.

ప్రజాప్రతినిధులు ప్రభుత్వంపై ప్రశ్నించాల్సిన అంశాలపై ప్రశ్నించకపోతే ప్రజల్లో అసంతృప్తి పెరగడం సహజమని ఆయన అన్నారు.

**మరో ఉద్యమం అవసరమా?**

తెలంగాణ రాష్ట్ర ఉద్యమం అన్యాయం జరుగుతోందనే భావన నుంచి పుట్టిందని, అదే తరహాలో జిల్లా అభివృద్ధిలో అసమానతలపై ప్రజా ఉద్యమం అవసరమనే అభిప్రాయాలు ఇప్పుడు వినిపిస్తున్నాయని శ్రీనివాస్ తెలిపారు.



యితే ఉద్యమం అంటే కేవలం ఆందోళనలు, ధర్నాలు మాత్రమే కాకుండా జిల్లాకు అవసరమైన అభివృద్ధి ప్రణాళికను రూపొందించడం, ప్రాధాన్యతా ప్రాజెక్టులను గుర్తించడం, ప్రభుత్వ నిధులపై ప్రజా పర్యవేక్షణ, ప్రజాప్రతినిధుల బాధ్యతను ప్రశ్నించడం కూడా కావాలని విశ్లేషకులు సూచిస్తున్నారు.

**అభివృద్ధికి ఐదు ప్రధాన ప్రశ్నలు**

వికారాబాద్ జిల్లా అభివృద్ధిని అంచనా వేయాలంటే ఐదు ప్రశ్నలకు స్పష్టమైన సమాధానాలు అవసరం.

జిల్లా ఏర్పడిన తర్వాత ఇప్పటివరకు ఎన్ని కోట్ల రూపాయల నిధులు వచ్చాయి?

ఏ ప్రధాన ప్రాజెక్టులు మంజూరయ్యాయి? వాటిలో ఎన్ని పూర్తయ్యాయి?

జిల్లా కేంద్రానికి అవసరమైన రహదారులు, డ్రైనేజీ, తాగునీరు, రవాణా, వైద్య, విద్యా మౌలిక వసతులు ఎంత మేరకు మెరుగుపడ్డాయి?

పరిశ్రమలు, ఉపాధి అవకాశాల కోసం ప్రభుత్వం ఏ చర్యలు తీసుకుంది?

వికారాబాద్, పరిగి, తాండూరు, కొడంగల్ ప్రాంతాల మధ్య అభివృద్ధి నిధుల పంపిణీ ఎలా ఉంది?

ఈ ప్రశ్నలకు అధికారిక లెక్కలతో సమాధానాలు వెలువడితేనే జిల్లా అభివృద్ధిపై పూర్తి వాస్తవ చిత్రం ప్రజలకు తెలుస్తుంది.

**జిల్లా వచ్చింది.. ఇక జిల్లా స్థాయి అభివృద్ధి రావాలి**

వికారాబాద్ జిల్లా ఏర్పాటు ఒక చారిత్రక విజయం. అయితే జిల్లా ఏర్పాటు అంతిమ లక్ష్యం కాదని, ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు, ఉపాధి, వైద్యం, విద్య, రవాణా, పరిశ్రమలు, పర్యాటకం, మౌలిక వసతులు అందించడమే అసలు లక్ష్యమని వి.డి.డి.ఎఫ్. చైర్మన్ శ్రీనివాస్ పేర్కొన్నారు.

దశాబ్దాల ఉద్యమంతో సాధించిన జిల్లాను అభివృద్ధిలోనూ ముందుకు తీసుకెళ్లేందుకు రాజకీయ భేదాలకు అతీతంగా అన్ని వర్గాలు ఒకే వేదికపైకి రావాల్సిన అవసరం ఉందన్నారు. జిల్లా సాధన ఒక అధ్యాయం అయితే జిల్లా అభివృద్ధి మరో పెద్ద అధ్యాయం. మొదటి పోరాటం జిల్లాను సాధించడానికి జరిగితే ఇప్పుడు పోరాటం అభివృద్ధి కోసం జరగాల్సిన సమయం వచ్చిందనే వాదన బలపడుతోంది.

# వాన కోసం రైతన్న ఎదురుచూపులు...వాడిపోతున్న పత్తి పంటలు!

- **వర్షా భావంతో వాడిపోతున్న పత్తి పంట...పెట్టుబడులు బూడిదేనా?**
- **ఎండల తీవ్రతకు ముడుచుకుపోతున్న పత్తి ఆకులు**
- **ఆశించిన స్థాయిలో కాయలు రాక దిగుబడిపై నీలినీడలు**
- **వేల రూపాయల పెట్టుబడితో దిక్కుతోచని స్థితిలో అన్నదాతలు**

**పెద్దేముల్, అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

ఆకాశం వైపు ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతకు వరుణుడు ముఖం చాటేయడంతో పత్తి పంట పరిస్థితి దయనీయంగా మారుతోంది. పంట ఏపుగా పెరిగి చేతికొస్తుందని ఆశించిన రైతన్నలకు వర్షాభావ పరిస్థితులు కన్నీళ్లను మిగులుస్తున్నాయి.పంట సాగు కోసం వేల రూపాయలు పెట్టుబడిగా పెట్టి, కుటుంబ సభ్యులతో కలిసి అహర్నిశలు శ్రమించిన రైతులకు ప్రకృతి వైపరీత్యాలు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి.సకాలంలో వర్షాలు కురవకపోవడం, మరోవైపు ఎండల తీవ్రత పెరగడంతో పత్తి మొక్కలు ఎదుగుదల కోల్పోతున్నాయి.

ఆకులు ముడుచుకుపోవడం, మొక్కలు వాడిపోవడం, ఆశించిన స్థాయిలో కాయలు ఏర్పడకపోవడం వంటి సమస్యలు రైతులను ఆందోళనకు గురిచేస్తున్నాయి.

**ఆశలతో సాగు.. ఆవేదనతో ఎదురుచూపులు!**

పత్తి సాగు ప్రారంభం నుంచి రైతులు విత్తనాలు, ఎరువులు,

పురుగుమందులు,కూలీల ఖర్చుల రూపంలో భారీగా పెట్టుబడులు పెడుతున్నారు. పంట ఎదుగుదల దశలో సరైన సమయంలో వర్షాలు కురిస్తే మొక్కలు ఏపుగా పెరిగి,పూత,కాయలు సమృద్ధిగా ఏర్పడతాయని ఆశిస్తారు.

అయితే ప్రస్తుత వర్షాభావ పరిస్థితులు ఆ ఆశలను నీరుగారుస్తున్నాయి. తేమ తగ్గిపోవడంతో పత్తి మొక్కలు సాధారణ ఎదుగుదలను కోల్పోతున్నాయి. పంటను కాపాడుకోవడానికి రైతులు పడుతున్న కష్టం ఒకవైపు ఉంటే,పెట్టిన పెట్టుబడి తిరిగి వస్తుందో లేదోనన్న ఆందోళన మరోవైపు వెంటాడుతోంది.

**ఎండల తీవ్రతకు ముడుచుకుపోతున్న ఆకులు**

పగటిపూట ఎండల తీవ్రత పెరగడం, నేలలో తేమ తగ్గిపోవడం పత్తి పంటపై ప్రభావం చూపుతున్నాయి. మొక్కల ఆకులు ముడుచుకుపోవడం,

ఎదుగుదల మందగించడం, పూత,కాయలు ఆశించిన స్థాయిలో ఏర్పడకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే రైతులు అప్రమత్తంగా ఉండాలి. ముఖ్యంగా పూత, కాయలు ఏర్పడే దశలో నీటి ఎద్దడి ఎదురైతే దిగుబడిపై ప్రతికూల ప్రభావం పడే అవకాశం ఉంది.దీంతో ఈ ఏడాది పత్తి దిగుబడి ఎలా ఉంటుందోనని రైతులు ఆందోళన చెందుతున్నారు.

**పెట్టుబడుల భారం.. దిగుబడిపై దిగులు!**

ఇప్పటికే సాగు ఖర్చులు పెరగడంతో పత్తి రైతులకు పెట్టుబడుల భారం అధికమైంది. విత్తనాలు కొనుగోలు చేయడం నుంచి దుక్కులు దున్నడం,విత్తనాలు వేయడం,కలుపు నివారణ, ఎరువులు,పురుగుమందుల వినియోగం వరకు ప్రతి దశలో ఖర్చులు తప్పడం లేదు. ఇన్ని వ్యయప్రయాసల కోర్చి సాగు చేసిన పంటకు ప్రకృతి



సహకరించకపోవడంతో రైతుల పరిస్థితి ఆందోళనకరంగా మారుతోంది. దిగుబడి తగ్గితే అప్పులు ఎలా తీర్చాలి? కుటుంబ అవసరాలను ఎలా నెరవేర్చాలి? వచ్చే పంటకు పెట్టుబడి ఎక్కడి నుంచి తీసుకురావాలి? అనే ప్రశ్నలు అన్నదాతలను వేధిస్తున్నాయి.

**పంటను కాపాడుకునేందుకు అప్రమత్తత అవసరం**

వర్షాభావ పరిస్థితుల్లో పత్తి పంటను కాపాడుకోవడానికి రైతులు వ్యవసాయ శాఖ అధికారుల సూచనలు పాటించడం అవసరం. పొలంలో తేమను సంరక్షించే చర్యలు చేపట్టడంతో పాటు, నీటి వసతి ఉన్న రైతులు పంట దశను బట్టి తగినంత నీటిని అందించాలి. మొక్కల ఆకులు ముడుచుకుపోవడం లేదా ఎదుగుదల తగ్గడం కనిపించినంత మాత్రాన వెంటనే పురుగుమందులు వినియోగించకుండా,సమస్యకు గల అసలు కారణాన్ని వ్యవసాయ అధికారులతో నిర్ధారించుకోవాలి. వర్షాభావ ఒత్తిడితో పాటు చీడపీడలు, పోషకాల లోపాలు కూడా పంట ఎదుగుదలను ప్రభావితం చేసే అవకాశం ఉన్నందున క్షేత్రస్థాయి పరిశీలన కీలకం.

**ప్రభుత్వ సహాయం కోసం రైతుల ఎదురుచూపులు**

వర్షాలు సకాలంలో కురవక పంటలు దెబ్బతింటున్న పరిస్థితుల్లో వ్యవసాయ శాఖ అధికారులు గ్రామాలవారీగా పత్తి పంటలను పరిశీలించి,పంట పరిస్థితిపై సమగ్ర అంచనా వేయాలని రైతులు కోరుతున్నారు. అవసరమైన సాగు సూచనలు అందించడంతో పాటు,పంట నష్టాలు నమోదైతే నిబంధనల ప్రకారం తగిన సహాయం అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని ఆశిస్తున్నారు. వాతావరణ పరిస్థితులపై ముందస్తు సమాచారం, పంట సంరక్షణపై అవగాహన, రైతులకు అందుబాటులో సాంకేతిక సలహాలు కల్పించడం ద్వారా నష్టాలను కొంతవరకు తగ్గించే అవకాశం ఉంటుంది. ఏటా ప్రకృతితో పోరాడుతూ పంటను పండించే రైతన్నకు ఈసారి వర్షాభావం మరో పరీక్షగా మారింది. ఆకాశం నుంచి జాలువారే వాన చినుకుల కోసం ఆశగా ఎదురుచూస్తున్న అన్నదాతకు పత్తి పంట చేతికొచ్చే పరిస్థితులు కల్పించేందుకు అధికారులు, ప్రభుత్వం సకాలంలో స్పందించాల్సిన అవసరం ఉంది.రైతు కష్టం వృథా కాకుండా పంటను కాపాడేందుకు సమష్టి చర్యలే ప్రస్తుత పరిస్థితుల్లో కీలకం.

# దుర్గామాత ఉత్సవాల సందర్భంగా పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం

**నవాబుపేట్ అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

దుర్గామాత ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో, భక్తిశ్రద్ధలతో మరియు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిర్వహించేందుకు నవాబుపేట్ పోలీస్ స్టేషన్‌లో శాంతి కమిటీ సమావేశం నిర్వహించడం జరిగింది. ఈ సమావేశంలో ఉత్సవ నిర్వాహకులకు ఎస్సై గిరి పోలీసులు పలు సూచనలు చేశారు. ఉత్సవాల సమయంలో శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. మండపాల ఏర్పాటుకు సంబంధిత అధికారుల అనుమతులు తప్పనిసరిగా పొందాలని, విద్యుత్ భద్రతా చర్యలు పాటించాలని, ప్రజలకు వాహనాల రాకపోకలకు ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని తెలిపారు. అలాగే ఉత్సవాల సందర్భంగా ఇతర మతాల పట్ల గౌరవభావంతో వ్యవహరించాలని, ఎలాంటి రెచ్చగొట్టే వ్యాఖ్యలు, వివాదాలకు తావిచ్చే చర్యలకు పాల్పడరాదని సూచించారు. సోషల్



మీడియాలో తప్పుడు ప్రచారాలు, విద్వేష పూరిత పోస్టులు చేయకుండా అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ప్రజలందరూ పోలీసులకు సహకరించి దుర్గామాత ఉత్సవాలను సోదర భావంతో, ప్రశాంతంగా నిర్వహించుకోవాలని పోలీసులు కోరారు.



# దళితుల అభ్యున్నతికి అహర్నిశలు కృషి చేస్తా!

- శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ ఎస్సీ సెల్ అధ్యక్షుడిగా పలుగుట్ట నర్సింహులు నియామకం
- పామేన భీమ్ భరత్, క్యారగారి శ్రీధర్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేత
- దళితుల హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా ముందుకు
- నూతన బాధ్యతలతో శంకర్‌పల్లిలో కాంగ్రెస్ ఎస్సీ విభాగానికి మరింత బలం



**శంకర్‌పల్లి,అక్టోబర్ 11 (ప్రజాక్షేత్రం)**

దళితుల అభ్యున్నతి, హక్కుల పరిరక్షణ, సంక్షేమమే లక్ష్యంగా అహర్నిశలు కృషి చేస్తానని శంకర్‌పల్లి మండల కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ నూతన అధ్యక్షుడు పలుగుట్ట నర్సింహులు పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం శంకర్‌పల్లి మండల అధ్యక్షుడిగా మహాలింగాపురానికి చెందిన పలుగుట్ట నర్సింహులును నియమిస్తూ పార్టీ నాయకత్వం నిర్ణయం తీసుకుంది.ఈ సందర్భంగా అజీజ్‌నగర్‌లో నిర్వహించిన కార్యక్రమంలో చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ క్యారగారి శ్రీధర్ ఆయనకు నియామక పత్రాన్ని అందజేశారు.

**దళితుల అభ్యున్నతికి ప్రాధాన్యం**

కాంగ్రెస్ పార్టీ తనపై నమ్మకంతో కీలక బాధ్యతలు అప్పగించడం పట్ల పలుగుట్ట నర్సింహులు హర్షం వ్యక్తం చేశారు.తనకు ఈ అవకాశం కల్పించిన చేవెళ్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి పామేన భీమ్ భరత్, రంగారెడ్డి జిల్లా ఎస్సీ విభాగం చైర్మన్ క్యారగారి శ్రీధర్‌తో పాటు కాంగ్రెస్ పార్టీ ఎస్సీ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మానకొండూర్ ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ దళితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి కృషి**

శంకర్‌పల్లి మండల పరిధిలోని దళిత కుటుంబాలకు అండగా నిలుస్తూ, వారి సమస్యలను పార్టీ నాయకత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయడమే తన ప్రధాన లక్ష్యమని పలుగుట్ట నర్సింహులు తెలిపారు.కాంగ్రెస్ పార్టీ ఆశయాలను ప్రజల్లోకి తీసుకెళ్లడంతో పాటు ఎస్సీ విభాగాన్ని గ్రామస్థాయిలో మరింత బలోపేతం చేసేందుకు నాయకులు, కార్యకర్తలను సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతానన్నారు.

**5 మండలాల కమిటీలకు నియామక పత్రాలు**

చేవెళ్ల నియోజకవర్గ పరిధిలోని 5 మండలాలకు చెందిన కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు, మండల,మున్సిపల్ అధ్యక్షులకు ఈ కార్యక్రమంలో నియామక పత్రాలు అందజేశారు. చేవెళ్ల, షాబాద్, శంకర్‌పల్లి, నవాబ్‌పేట, మొయినాబాద్ ప్రాంతాల్లో ఎస్సీ విభాగాన్ని బలోపేతం చేయడంతో పాటు దళితుల అభివృద్ధికి సమష్టిగా పనిచేయాలని నాయకులు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి కార్యదర్శులు రాంరెడ్డి,షాబాద్ మండల అధ్యక్షులు పెంటా రెడ్డి, మొయినాబాద్ మండల అధ్యక్షులు సత్య నారాయణ, మొయినాబాద్ మండలం మాజీ అధ్యక్షులు మానయ్య చేవెళ్ళ నియోజకవర్గం ఎస్సీ విభాగం నాయకులు, అన్ని మండలాల ఎస్సీ విభాగం నాయకులు, ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి అండగా ఉంటాం

- పార్టీలకు అతీతంగా కృషి చేస్తాం
- దేశం కోసం సైనికుల త్యాగం వెలకట్టలేనిది
- దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

**రాయపూర్ అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

దేశ రక్షణ కోసం తమ ప్రాణాలను సైతం లెక్కచేయకుండా సేవలందించిన మాజీ సైనికుల త్యాగాలు వెలకట్టలేనివని, వారి సంక్షేమానికి అండగా నిలవడం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మాజీ సైనికుల సమస్యల పరిష్కారానికి పార్టీలకు అతీతంగా కృషి చేస్తామని భరోసా ఇచ్చారు. గజ్వేల్‌లోని ప్రజ్ఞ గార్డెన్స్‌లో మాజీ సైనికుల సంక్షేమ సంఘం రెండో వార్షికోత్సవ కార్యక్రమంలో, ఎమ్మెల్సీ డాక్టర్ వంటేరు యాదవ రెడ్డి, మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డితో కలిసి ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి పాల్గొని మాట్లాడారు. సైనికులు దేశ సరిహద్దుల్లో నిరంతరం కాపలా కాస్తూ దేశ ప్రజల భద్రత కోసం ఎంతో త్యాగం చేస్తున్నారని పేర్కొన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటూ, కఠిన పరిస్థితులను ఎదుర్కొంటూ దేశ సేవలో జీవితాలను అంకితం చేసిన సైనికుల సేవలను ప్రతి ఒక్కరూ గుర్తించాలని అన్నారు. సైన్యంలో సేవలందించి పదవీ విరమణ చేసిన మాజీ సైనికులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి ప్రత్యేక శ్రద్ధ చూపాల్సిన అవసరం ఉందన్నారు. మాజీ సైనికులకు సంబంధించిన సంక్షేమం, ఆరోగ్య సేవలు, పెన్షన్లు, ఉపాధి అవకాశాలు తదితర అంశాల్లో ఎదురయ్యే సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. వారి సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి, పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

దేశం కోసం పోరాడిన సైనికులకు గౌరవం ఇవ్వడం మాత్రమే కాదువారి పదవీ విరమణ తర్వాత కూడా వారికి అండగా నిలవడం మన బాధ్యత అని ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి స్పష్టం చేశారు. మాజీ సైనికుల సంక్షేమ సంఘం మరింత బలోపేతమై, సైనికుల కుటుంబాలకు తోడ్పాటునందించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి లను వారు ఘనంగా సన్మానించారు. ఆజాద్ ఫౌండేషన్ విద్యార్థులలో ఉత్తమ ప్రతిభ కనపరిచిన విద్యార్థులకు బహుమతులు అందించారు..కార్యక్రమం లో మున్సిపల్ చైర్మన్ గంగిశెట్టి చందన, నాయకులు బొంపల్లి మనోహర రావు, గజ్వేల్ మాజీ జెడ్పిటిసి పంగ మల్లేశం, రాయపోల్ మండల మాజీ జెడ్పిటిసి లింగాయపల్లి యాదగిరి, జీడిపల్లి రాంరెడ్డి, మంతూర్ గ్రామ సర్పంచ్ పర్వేజ్ అహ్మద్ , ఉప సర్పంచ్ సంతోష్, బందేల సురేందర్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి నీల చంద్రం, సంయుక్త కార్యదర్శి ఐలేని స్కైలాబ్ రెడ్డి, ఎం వి రమణ రెడ్డి తో పాటు మాజీ సైనికుల సంక్షేమ సంఘం నాయకులు, సభ్యులు, పలువురు ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.



# చంద్రశేఖర్ రాజకీయ వారసత్వానికి కొత్త అడుగు

- సేవా బాటలో చంద్రప్రియ.. రాజకీయ రంగ ప్రవేశానికి సంకేతాలు!
- మన చంద్ర ఫౌండేషన్‌తో ప్రజల్లోకి.. ఆపదలో ఉన్న వారికి అండగా నిలుస్తూ ప్రత్యేక గుర్తింపు





**వికారాబాద్,అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

మాజీ ఎమ్మెల్యే, మాజీ మంత్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ రాజకీయ వారసత్వం నుంచి మరో తరం ప్రజాజీవితంలోకి అడుగులు వేస్తున్న సంకేతాలు కనిపిస్తున్నాయి. ఆయన కుమార్తె డాక్టర్ ఏ. చంద్రప్రియ మన చంద్ర ఫౌండేషన్ను వేదికగా చేసుకుని వరుసగా సేవా కార్యక్రమాలు చేపడుతూ ప్రజల మధ్య తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకునే ప్రయత్నం చేస్తున్నారు. ఫౌండేషన్ ప్రారంభించిన కొద్ది నెలల్లోనే వివాహ సహాయం, వైద్య సహాయం, గ్రామాల్లో మౌలిక వసతుల కల్పన, ఆలయ అభివృద్ధి, చిరు వ్యాపారులకు సహకారం, పండుగల సందర్భంగా ప్రజలతో మమేకం వంటి కార్యక్రమాలు చేపట్టడం ఇప్పుడు రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది.

**రాజకీయ కుటుంబం నుంచి ప్రజా జీవితంలోకి.. ఇదేనా కొత్త రాజకీయ అధ్యాయం?**

డాక్టర్ ఏ. చంద్రప్రియ చిన్నతనం నుంచే రాజకీయ వాతావరణంలో పెరిగారు. ఆమె తండ్రి డాక్టర్ ఏ. చంద్రశేఖర్ సుదీర్ఘకాలం ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన అనుభవజ్ఞుడైన రాజకీయ నాయకుడు. తండ్రి రాజకీయ ప్రయాణాన్ని దగ్గరగా గమనిస్తూ పెరిగిన చంద్రప్రియకు చిన్ననాటి నుంచే రాజకీయాలు, ప్రజా సమస్యలు, ప్రజలతో సంబంధాలు, రాజకీయ వ్యవహారాలపై అవగాహన ఏర్పడింది.

ఇప్పుడు ఆమె మన చంద్ర ఫౌండేషన్ ద్వారా ప్రజల్లోకి వెళ్లడం కేవలం సేవా కార్యక్రమాలకే పరిమితమా? లేక రాజకీయ రంగ ప్రవేశానికి ముందస్తు అడుగులా? అనే చర్చ మొదలైంది. ప్రత్యక్షంగా రాజకీయ ప్రకటన చేయకపోయినా వరుసగా ప్రజా కార్యక్రమాల్లో పాల్గొంటూ ప్రజలతో సంబంధాలను పెంచుకుంటున్న తీరు భవిష్యత్ రాజకీయ ప్రస్థానానికి సంకేతాలుగా కనిపిస్తోందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

**ఫౌండేషన్ ప్రారంభం నుంచే సేవా కార్యక్రమాల పరంపర**

2026 జూన్ 8న మన చంద్ర ఫౌండేషన్ ప్రారంభమైంది. ప్రారంభోత్సవం అనంతరం చంద్రప్రియ ఆధ్వర్యంలో వివిధ ప్రాంతాల్లో పలు సేవా కార్యక్రమాలు చేపట్టారు. ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్న కుటుంబాలకు సహాయం చేయడం నుంచి అనారోగ్యంతో బాధపడుతున్న వారికి అండగా నిలవడం వరకు కార్యక్రమాలను విస్తరించారు.

**ముస్లిం యువతి వివాహానికి రూ.30 వేల సాయం**

తురుమామిడి గ్రామానికి చెందిన ఓ ముస్లిం యువతి వివాహానికి రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు. మత, సామాజిక భేదాలకు అతీతంగా అవసరంలో ఉన్న కుటుంబానికి అండగా నిలవడం ద్వారా ఫౌండేషన్ సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టింది.

**అనారోగ్యంతో ఉన్న యువతికి పరామర్శ.. రూ.30 వేల ఆర్థిక సాయం**

మున్నూరు సోమవారం గ్రామానికి చెందిన గెరిగేటిపల్లి రాజు కుమార్తె అనారోగ్యంతో హైదరాబాద్‌లోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న చంద్రప్రియ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. కుటుంబ సభ్యులతో మాట్లాడి పరిస్థితిని తెలుసుకుని రూ.30 వేల ఆర్థిక సహాయం అందించారు.

**ప్రజలు చెప్పిన సమస్య.. వెంటనే పరిష్కారం**

తురుమామిడి చౌరస్తాలో మహిళలు, ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్న విషయాన్ని గ్రామస్థులు చంద్రప్రియ దృష్టికి తీసుకెళ్లారు. సమస్యను తెలుసుకున్న వెంటనే స్పందించి అక్కడ టాయిలెట్ల నిర్మాణం చేపట్టారు. ప్రజలు చెప్పిన సమస్యను గుర్తించి పరిష్కరించే ప్రయత్నం చేయడం స్థానికంగా చర్చకు దారితీసింది.

**చిరు వ్యాపారులకు స్టీల్ వాటర్ బాటిళ్లు**

వికారాబాద్ మున్సిపల్ పరిధిలో చిరు వ్యాపారులకు స్టీల్ వాటర్ బాటిళ్లను పంపిణీ చేశారు. రోజువారీ జీవనోపాధి కోసం ఎండలో పనిచేసే చిన్నవ్యాపారుల అవసరాలను గుర్తించి వారికి ఉపయోగపడేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.

**కొటాలగూడెం బీరప్ప ఆలయానికి రూ.2 లక్షలతో పెయింటింగ్**

వికారాబాద్ మండలం కొటాలగూడెం గ్రామంలోని బీరప్ప దేవాలయానికి గ్రామస్థుల కోరిక మేరకు సుమారు రూ.2 లక్షల వ్యయంతో పెయింటింగ్ పనులు చేపట్టారు. గ్రామ ప్రజల విశ్వాసాలకు అనుగుణంగా ఆలయ అభివృద్ధికి సహకరించారు.

**ప్రమాద బాధితుడికి పరామర్శ.. ఆర్థిక అండ**

నాగారం గ్రామానికి చెందిన ఓ వ్యక్తి ప్రమాదానికి గురైన విషయం తెలుసుకుని ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను కలుసుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకోవడంతో పాటు ఆర్థిక సహాయం అందించారు.

**ప్రతి శుభకార్యంలో ప్రజలతో ఆత్మీయత**

వివాహాలు, గృహప్రవేశాలు వంటి శుభకార్యాలకు హాజరవుతూ కుటుంబ సభ్యులను అభినందించడం, బట్టలు పెట్టి శుభాకాంక్షలు తెలియజేయడం ద్వారా ప్రజలతో వ్యక్తిగత సంబంధాలను కొనసాగిస్తున్నారు. పండుగలు, శుభకార్యాల ద్వారా ప్రజలతో మరింత సన్నిహితంగా మమేకమవుతున్నారు.

**వినాయక ఉత్సవాల్లోనూ ప్రజల మధ్యే..**

వినాయక చవితి సందర్భంగా పలు ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వినాయక విగ్రహాలను సందర్శించి ఉత్సవ కమిటీలను అభినందించారు. వివిధ వినాయక మండపాలకు విరాళాలు, చందాలు అందించారు. దీంతో పండుగ కార్యక్రమాల్లోనూ ప్రజలతో కలిసి ఉండే ప్రయత్నం చేస్తున్నారు.

**సేవా కార్యక్రమాల వెనుక రాజకీయ వ్యూహమా?**

సాధారణంగా రాజకీయ కుటుంబాలకు చెందిన వారసులు ప్రజల్లోకి రావడానికి సేవా కార్యక్రమాలను ఒక వేదికగా ఎంచుకోవడం కొత్త విషయం కాదు. అయితే చంద్రప్రియ విషయంలో వరుసగా జరుగుతున్న కార్యక్రమాలు, వివిధ వర్గాల ప్రజలను కలుసుకోవడం, గ్రామాల సమస్యలను స్వయంగా తెలుసుకోవడం, శుభకార్యాలు-పండుగల్లో పాల్గొనడం వంటి పరిణామాలు రాజకీయ పరిశీలకుల దృష్టిని ఆకర్షిస్తున్నాయి.

ప్రస్తుతం ఆమె సేవా కార్యక్రమాలకే ప్రాధాన్యం ఇస్తున్నప్పటికీ, ప్రజలతో ప్రత్యక్ష సంబంధాలు పెంచుకోవడం భవిష్యత్ రాజకీయ రంగ ప్రవేశానికి బలమైన పునాది వేస్తున్నట్లుగా రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది.

**తండ్రి బాటలో కుమార్తె.. రాజకీయ వారసత్వం కొనసాగింపునకు సంకేతం**

డాక్టర్ ఏ. చంద్రశేఖర్‌కు ఉన్న సుదీర్ఘ రాజకీయ అనుభవం, ప్రజా సంబంధాలు, రాజకీయ నేపథ్యం చంద్రప్రియకు సహజంగానే వారసత్వంగా వచ్చాయి. ఇప్పుడు ఆ వారసత్వాన్ని సేవా కార్యక్రమాల ద్వారా ప్రజల మధ్యకు తీసుకెళ్తున్నారనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. తండ్రి సంపాదించిన రాజకీయ వారసత్వం.. కుమార్తె కొనసాగిస్తున్న ప్రజా పరిచయాలు.. మన చంద్ర ఫౌండేషన్ ద్వారా విస్తరిస్తున్న సేవా కార్యక్రమాలు.. ఇవన్నీ కలిపి చూస్తే చంద్రప్రియ రాజకీయ రంగ ప్రవేశానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారనే చర్చకు మరింత బలం చేకూరుతోంది.

**రాజకీయ ప్రకటన ఎప్పుడు?**

చంద్రప్రియ ఇప్పటివరకు తన రాజకీయ భవిష్యత్తుపై అధికారికంగా ఎలాంటి ప్రకటన చేయకపోయినా, ఆమె చేస్తున్న కార్యక్రమాలు మాత్రం రాజకీయంగా ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. సేవా కార్యక్రమాల పేరుతో ప్రజల మధ్య విస్తృతంగా తిరుగుతూ వారి సమస్యలను తెలుసుకోవడం, వివిధ సామాజిక వర్గాలతో సంబంధాలను పెంచుకోవడం, గ్రామీణ ప్రాంతాల్లో తన పరిచయాలను విస్తరించుకోవడం భవిష్యత్ రాజకీయ ప్రయాణానికి ముందడుగుగా భావిస్తున్నారు.

చంద్రశేఖర్ రాజకీయ వారసత్వం.. చంద్రప్రియ సేవా ప్రస్థానం.. ఇక తదుపరి అడుగు రాజకీయ రంగ ప్రవేశమేనా? అనే ప్రశ్న ఇప్పుడు వికారాబాద్ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది.

**ప్రత్యేక దృష్టి: సేవ నుంచి రాజకీయాల వైపు?**

మన చంద్ర ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కేవలం సామాజిక సేవగా కొనసాగుతాయా? లేక రాబోయే రోజుల్లో చంద్రప్రియను ప్రత్యక్ష రాజకీయాల్లోకి తీసుకువచ్చే వేదికగా మారుతాయా? అనేది వేచి చూడాలి. అయితే ప్రస్తుతం కనిపిస్తున్న పరిణామాలు మాత్రం ఆమె ప్రజాజీవితంలో తన స్థానాన్ని ఏర్పరుచుకునే దిశగా ముందుకు సాగుతున్నారనే సంకేతాన్ని ఇస్తున్నాయి.

# ప్రజల సంక్షేమమే మనకు పండగ!

- కేసీఆర్ పాలనలో అభివృద్ధి ఫలాలు.. కాంగ్రెస్ పాలనలో ప్రజలకు కష్టాలు
- కొత్త జిల్లాల దశాబ్ది ఉత్సవాల కృతజ్ఞతా సభలో మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- పాలన ప్రజల చెంతకు తెచ్చేందుకే జిల్లాల ఏర్పాటు..
- సాగునీటి ప్రాజెక్టులను ప్రారంభించి రైతులను ఆదుకోవాలి



**వనపర్తి, అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

ప్రజల సంక్షేమమే పండగగా భావించి, అభివృద్ధి ఫలాలను ప్రతి ఇంటికీ అందించడమే లక్ష్యంగా కేసీఆర్ పాలన సాగిందని మాజీ మంత్రి, బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి అన్నారు. తెలంగాణలో జిల్లాల ఏర్పాటుతో పాలనను ప్రజలకు చేరువ చేసిన ఘనత కేసీఆర్‌కే దక్కుతుందని అన్నారు.

ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో అభివృద్ధి కుంటుపడటంతో ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విమర్శించారు. తెలంగాణలో కొత్త జిల్లాల ఏర్పాటు జరిగి పదేళ్లు పూర్తయిన సందర్భంగా ఆదివారం రాత్రి వనపర్తిలోని దాచా లక్ష్మయ్య ఫంక్షన్ హాలులో నిర్వహించిన దశాబ్ది ఉత్సవాలు, కేసీఆర్‌కు కృతజ్ఞత తెలిపే సభలో ఆయన మాట్లాడారు. ఉత్సవాలను ఘనంగా నిర్వహించిన బీఆర్ఎస్ శ్రేణులకు ధన్యవాదాలు తెలిపారు. ప్రజల చిరకాల వాంఛను గుర్తించి జిల్లాలను ఏర్పాటు చేసిన కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డిని నాయకులు ఘనంగా సన్మానించారు.

**ప్రజల అవసరాలకు అనుగుణంగా జిల్లాల ఏర్పాటు**

గతంలో పాలకులు ప్రజల అవసరాలను పట్టించుకోలేదని నిరంజన్‌రెడ్డి విమర్శించారు. సకల జనులను ఏకం చేసి, నీళ్లు, నిధులు, నియామకాలే లక్ష్యంగా కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని నడిపి ప్రత్యేక రాష్ట్రాన్ని సాధించారని గుర్తుచేశారు.

ఉమ్మడి రాష్ట్రంలో తెలంగాణ వనరులకు తగిన ప్రాధాన్యం దక్కకపోవడంతో హక్కుల సాధన కోసం పోరాటం చేయాల్సి వచ్చిందన్నారు.

ప్రత్యేక రాష్ట్రం ఏర్పడిన తర్వాత పరిపాలనా సౌలభ్యం, సమగ్ర అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని కొత్త జిల్లాలను ఏర్పాటు చేశారని చెప్పారు. కేవలం భౌగోళిక సరిహద్దులను విభజించడమే కాకుండా, అభివృద్ధి అవసరాలకు అనుగుణంగా జిల్లాలను రూపొందించారని అన్నారు .

వికేంద్రీకరణలో భాగంగా పాలనాపరమైన సంస్కరణలు తీసుకొచ్చి ప్రభుత్వ సేవలను ప్రజలకు చేరువ చేశారని వివరించారు.

**వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులు**

కేసీఆర్ పాలనలో తెలంగాణ వ్యవసాయ రంగంలో గణనీయమైన మార్పులు చోటుచేసుకున్నాయని నిరంజన్‌రెడ్డి తెలిపారు. సాగునీటి అవసరాలను తీర్చేందుకు కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి వంటి ప్రాజెక్టులకు శ్రీకారం చుట్టారని పేర్కొన్నారు. విద్యుత్తు ఉత్పత్తిని పెంచి రైతులకు 24 గంటల విద్యుత్తు అందించే విధానాన్ని అమలు చేశారని చెప్పారు. గతంలో సుమారు 7 వేల మెగావాట్లుగా ఉన్న విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యాన్ని 24 వేల మెగావాట్ల స్థాయికి పెంచినట్లు వివరించారు. రైతులకు అవసరమైన విద్యుత్తు సబ్‌స్టేషన్లు, ట్రాన్స్‌ఫార్మర్లను అందుబాటులోకి తెచ్చి వ్యవసాయానికి తోడ్పడ్డామని అన్నారు. వనపర్తి జిల్లాలో సుమారు రెండు లక్షల ఎకరాల్లో పంటల సాగు, దిగుబడులు సాధించి వరుసగా రెండుసార్లు రాష్ట్రంలో ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నామని పేర్కొన్నారు.

**పాలనను ప్రజల చెంతకు చేర్చిన ఘనత కేసీఆర్‌దే**

జిల్లాల ఏర్పాటు అనంతరం వివిధ శాఖల సేవలను ప్రజలకు చేరువ చేసేందుకు ప్రత్యేక కార్యాలయాలు ఏర్పాటు చేశారని నిరంజన్‌రెడ్డి తెలిపారు.

ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో సాగునీటి నిర్వహణకు సంబంధించిన వ్యవస్థలు పరిమితంగా ఉండేవని, కేసీఆర్ ప్రభుత్వం రెండు జిల్లాలకు ఒక చీఫ్ ఇంజినీర్ కార్యాలయాన్ని ఏర్పాటు చేసి ఉన్నతాధికారులను నియమించిందని చెప్పారు. దీంతో సాగునీటి వ్యవహారాల పర్యవేక్షణ, సమస్యల పరిష్కారానికి వెసులుబాటు కలిగిందన్నారు. జిల్లాల ఏర్పాటు వల్ల ప్రజలు ప్రతి చిన్న పనికీ దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం తగ్గిందని, పరిపాలనా వ్యవస్థలో వికేంద్రీకరణకు ప్రాధాన్యం లభించిందని వివరించారు.

ప్రజల అవసరాలను గుర్తించి నిర్ణయాలు తీసుకోవడమే సమర్థ పాలనకు నిదర్శనమన్నారు.

**సాగునీటి ప్రాజెక్టులను ఎందుకు వినియోగించడం లేదు?**

కాంగ్రెస్ ప్రభుత్వంపై నిరంజన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. శ్రీశైలంలో నీటి లభ్యత ఉన్నప్పటికీ రైతులకు సాగునీరు అందించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని ఆరోపించారు. జూరాల ప్రాజెక్టులో సుమారు 9 టీఎంసీల నీరు అందుబాటులో ఉన్నా పంటలకు నీరు అందక రైతులు ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. కేసీఆర్ హయాంలో మూడేళ్ల కిందట ప్రారంభించిన నార్లాపూర్ పంపును ప్రస్తుతం ఎందుకు వినియోగించడం లేదో ప్రభుత్వం ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. శ్రీశైలంలో నీరు అందుబాటులో ఉన్న నేపథ్యంలో నార్లాపూర్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం (కేఎల్ఐ) పంపులను ప్రారంభించి రైతులను ఆదుకోవాలని కోరారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో 50 టీఎంసీల నీటిని నిల్వ చేసుకునేందుకు నాలుగు జలాశయాలు సిద్ధంగా ఉన్నాయని పేర్కొన్నారు. వాటిని పూర్తి స్థాయిలో వినియోగించి సాగునీటి అవసరాలు తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

**జలాల విషయంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి**

కృష్ణా, గోదావరి జలాల వినియోగంలో రాష్ట్ర ప్రయోజనాలను కాపాడటంలో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్లక్ష్యం వహిస్తోందని నిరంజన్‌రెడ్డి ఆరోపించారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటి తరలింపుల విషయంలో ప్రభుత్వం తగిన చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. సుమారు 700 కిలోమీటర్ల దూరంలోని కుప్పానికి కృష్ణా జలాలను తరలించుకెళ్తున్నారని ప్రస్తావిస్తూ, తెలంగాణ రైతుల ప్రయోజనాలకు ప్రాధాన్యం ఇవ్వాలని అన్నారు. దేశంలో నీటి వనరుల సమర్థ వినియోగం, సాగునీటి అవసరాలపై కేసీఆర్ గతంలో వివరించిన అంశాలను ఆయన ప్రస్తావించారు. అందుబాటులో ఉన్న జలాలను ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తే వ్యవసాయ రంగాన్ని మరింత అభివృద్ధి చేయవచ్చని పేర్కొన్నారు. తెలంగాణను సస్యశ్యామలం చేయాలంటే సాగునీటి ప్రాజెక్టులను నిరుపయోగంగా ఉంచకుండా రైతులకు నీరు అందించాలని స్పష్టం చేశారు.

**యూరియా కోసం రైతుల ఇబ్బందులా?**

కాంగ్రెస్ పాలనలో రైతులు యూరియా కోసం రోడ్లపైకి రావాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయని, విద్యుత్తు సమస్యలపై సబ్‌స్టేషన్లను ముట్టడించే పరిస్థితి నెలకొందని నిరంజన్‌రెడ్డి విమర్శించారు.

రైతులకు నిరంతర విద్యుత్తు, ఎరువులు, సాగునీరు అందించడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. రైతుల సమస్యలను తక్షణమే పరిష్కరించి పంటలను కాపాడాలని కోరారు.

**ప్రజా పాలన అంటే ఇదేనా?**

కేసీఆర్ పాలనలో ప్రజలకు సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అందించడమే ప్రధాన లక్ష్యంగా ఉండేదని నిరంజన్‌రెడ్డి అన్నారు. ప్రజల వద్దకు పాలనను తీసుకెళ్లిన కేసీఆర్ ప్రభుత్వాన్ని విమర్శించే కాంగ్రెస్ నాయకులు, ప్రస్తుత పరిస్థితులను కూడా పరిశీలించాలని సూచించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్లకుండా సాగుతున్న పాలనను ప్రజా పాలనగా ఎలా పరిగణిస్తారని ప్రశ్నించారు.

ప్రజల సంక్షేమమే తమకు పండగని, రాష్ట్ర అభివృద్ధి, రైతుల సంక్షేమం కోసం బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని స్పష్టం చేశారు. కేసీఆర్ నాయకత్వంలోనే తెలంగాణ మరింత అభివృద్ధి చెందుతుందని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. దశాబ్ది ఉత్సవాలను నిర్వహించి, కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపిన సందర్భంగా మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డిని ఘనంగా సన్మానించారు.

# రైతు పట్ల అనుచిత వ్యాఖ్యలు.. గజ్వేల్ తహసీల్దార్ పై సస్పెన్షన్ వేటు

- "పురుగుల మందు తాగలేదా?" అంటూ అధికారి చేసిన వ్యాఖ్యల వీడియో వైరల్
- ప్రజాగ్రహం వెల్లువెత్తడంతో విచారణకు ఆదేశించిన కలెక్టర్
- ప్రాథమిక విచారణ నివేదిక ఆధారంగా సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ



**సిద్ధిపేట అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

సిద్దిపేట జిల్లాలో ఓ రైతు పట్ల అమానవీయంగా, అనుచితంగా వ్యాఖ్యలు చేసినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అధికారిపై తెలంగాణ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకుంది. భూ వివాదం విషయమై తనను కలిసేందుకు వచ్చిన రైతును కించపరిచేలా మాట్లాడాడంటూ గజ్వేల్ తహసీల్దార్ చిట్టంపల్లి స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. వివరాల్లోకి వెళితే.. గజ్వేల్ మండలం మక్త మాసన్‌పల్లి గ్రామానికి చెందిన రైతు యేసు, రీజనల్ రింగ్ రోడ్ (ఆర్ఆర్ఆర్) భూ సేకరణ పరిహారం విషయంలో తన బంధువులతో ఉన్న వివాదంపై మాట్లాడేందుకు తహసీల్దార్ కార్యాలయానికి వెళ్లారు. గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్‌తో కలిసి ఆయన తహసీల్దార్ స్వామిని కలిశారు. రైతు తన సమస్యను వివరిస్తుండగా, అధికారి స్పందించిన తీరు తీవ్ర వివాదాస్పదమైంది. “ఇంకా బతికే ఉన్నావా? పురుగుల మందు తాగలేదా?” అంటూ తహసీల్దార్ రైతును ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే అలా అన్నారా అని ప్రశ్నించగా.. "అవును, ఉద్దేశపూర్వకంగానే అన్నాను" అని అధికారి బదులివ్వడం వీడియోలో స్పష్టంగా రికార్డయింది. ఈ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో తహసీల్దార్ తీరుపై తీవ్ర ప్రజా వ్యతిరేకత వ్యక్తమైంది. రైతుల నుంచి పెద్ద ఎత్తున విమర్శలు రావడంతో సిద్దిపేట జిల్లా కలెక్టర్ కె. హైమావతి ఈ ఘటనపై విచారణకు ఆదేశించారు. రెవెన్యూ డివిజనల్ అధికారి (ఆర్‌డీఓ) ప్రాథమిక విచారణ జరిపి, తహసీల్దార్ ప్రవర్తన సరికాదని నివేదిక సమర్పించారు. ఈ నివేదిక ఆధారంగా కలెక్టర్.. తహసీల్దార్ స్వామిని సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా హెడ్ క్వార్టర్స్ విడిచి వెళ్లరాదని ఆ ఉత్తర్వుల్లో స్పష్టం చేశారు. ఇదిలా ఉంటే.. ఈ ఘటన సుమారు 56 నెలల క్రితం జరిగిందని, ఆ తర్వాత తన భూ వివాదం పరిష్కారమై పరిహారం డబ్బులు కూడా బ్యాంకు ఖాతాలో జమ అయ్యాయని రైతు యేసు స్వయంగా వెల్లడించిన మరో వీడియో తాజాగా వెలుగులోకి వచ్చింది. ఘటన పాతదే అయినప్పటికీ, అధికారి ప్రవర్తన సరైంది కాదన్న విమర్శల నేపథ్యంలో ప్రభుత్వం చర్యలు తీసుకుంది.

# సెంట్రలైజ్డ్ కిచెన్ల విధానం విరమించాలి

- ఈనెల 28వ, తేదీన జరిగే, MLA క్యాంపు కార్యాలయాల ముట్టడి కార్యక్రమం జయప్రదం చేయండి,
- 2023-2024 సంవత్సరానికి సంబందించిన 9 నెలల అల్పాహారం పెండింగ్ బిల్లులు వెంటనే కార్మికుల ఖాతాలలో జమ చేయాలి,

**ములుగు, ప్రజాక్షేత్రం :**

తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ వాజేడు,, వెంకటాపురం,మండలాల సంయుక్త సమావేశం, మండలాల అధ్యక్షులు అల్లి అమృత,, కుడుముల సమ్మక్క,అధ్యక్షతన జగన్నాధపురం జంక్షన్ వద్ద ఏర్పాటు చేయగా ముఖ్య అధిధి గా హజరైన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జంపాల రవీందర్ గారు మాట్లాడుతూ, గత 24 సంవత్సరాలుగా వంట పథకం లో స్వంత డబ్బులు పెట్టుకొని నాన్యమైన వంటలు చేస్తూ విద్యార్థులను స్వంత పిల్లలుగా చూస్తూ భోజనాలు అందిస్తూ వంట బిల్లులు నెలల తరబడి పెండింగ్లో ఉన్నా వంటలు చేస్తున్న వంట కార్మికులకు ఇంత వరకు పరిపాలించిన ఒక్క ప్రభుత్వం కూడా వేతనాలు పెంచకపోయినా అన్యాయం చేయలేదు అన్నారు, కానీ ఎన్నికల ముందు వంట కార్మికులకు అనేక వాగ్ధానాలు చేసిన కాంగ్రెస్ ప్రభుత్వం అన్న మాటలు అమలు చేయకుండా వంటల మీదనే ఆధార పడి జీవిస్తున్న రాష్ట్రంలో ఉన్న 54200 మంది వంట కార్మికలను రోడ్డున పడేసే విధంగా, అలాగే విద్యార్థులకు కూడా నాణ్యమైన భోజనం అందచేయలేని బ్రాహ్మణ సంస్థలైన హరేరామ హరేకృష్ణ వారికి కట్టబెట్టడానికి అల్పాహారం పేరుతోని(సెంట్రలైజ్డ్ కిచెన్), విధానానికి ముఖ్యమంత్రి గారు ఆత్రుతంగా పనిచేయడం విరమించుకోవాలని డిమాండ్ చేసారు, అందుకు మంత్రి సీతక్క గారు కూడా సహకారం అందించాలని కోరారు, గత ప్రభుత్వం లో వంట కార్మికుల ధ్వారానే నిర్వహించిన అల్పాహారం పథకానికి సంబందించిన 9 నెలల అల్పాహారం బిల్లులు నేటికీ విడుదల చేయకపోవడం వల్ల కార్మికులు అప్పుల ఊబిలోకి కూరుకు పోయారు. అన్నారు, కనుక పాత పెండింగ్ బిల్లులు అన్నీ వెంటనే విడుదల చేయాలని, బిల్లులు వేతనాలు ఏనెలవి ఆనెలలోనే విడుదల చేయాలని డిమాండ్ చేసారు, ఈ సంయుక్త సమావేశంలో పాల్గొన్న ఏఐటీయూసీ నాయకులు పోరెడ్డి ప్రమీల, టేకుల సంతోష్, తెలంగాణ మధ్యాహ్న భోజన పథకం వర్కర్స్ యూనియన్ నాయకులు ,వంట కార్మికులు ,పోడెం సమ్మక్క,నాగమణి,బొల్లె నర్సమ్మ, లక్ష్మికాంత, దేవమ్మ, లక్ష్మినర్సమ్మ, వెంకటలక్ష్మి, సత్యవతి, వెంకటమ్మ, పార్వతి, పెంటమ్మ,శంకరమ్మ,తదితరులు పాల్గొన్నారు.



# ఖాకీ చొక్కా వెనుక కన్నీటి బతుకు!

- ప్రజల రక్షణే ధ్యేయం.. పోలీసుల జీవితాల్లో ఎన్నో సమస్యలు!
- నాడు కర్ర.. నేడు కంప్యూటర్! మారిన నేరాలు.. మారిన దర్యాప్తు.. మారని విధి ఒత్తిడి?
- తెలంగాణ పోలీసు వ్యవస్థలో సిబ్బంది కొరతపై చర్చ.. వికారాబాద్ జిల్లాలో 23 పోలీస్ స్టేషన్లు
- ప్రత్యేక కథనం: ఎం. రవీందర్, సీనియర్ జర్నలిస్ట్



ఒకరు రోడ్డుపై ప్రమాదానికి గురైతే ముందుగా గుర్తుకొచ్చేది పోలీసు. అర్ధరాత్రి ఇంట్లో దొంగతనం జరిగినా, కుటుంబంలో గొడవ జరిగినా, మహిళకు వేధింపులు ఎదురైనా, రహదారిపై ప్రమాదం జరిగినా ప్రజలు ఆశ్రయించేది పోలీసులనే. పండుగైనా, పబ్బమైనా, వర్షమైనా, ఎండైనా, ఎన్నికలైనా, ఆందోళనలైనా ప్రజల భద్రత కోసం ముందుండాల్సిన బాధ్యత పోలీసులది. కానీ ఆ పోలీసు కుటుంబంలో ఏదైనా సమస్య వస్తే పరిస్థితి ఏమిటి? తల్లిదండ్రుల అనారోగ్యం, పిల్లల చదువులు, భార్యా భర్తల మధ్య దూరం, కుటుంబ వేడుకలకు హాజరుకాలేని పరిస్థితి, నిద్రలేని రాత్రులు.. ఇవన్నీ పోలీసు జీవితంలో ఎంతవరకు భాగమయ్యాయి? ప్రజలకు భద్రత కల్పించే ఖాకీ దుస్తుల వెనుక ఒక మనిషి ఉంటాడనే విషయాన్ని సమాజం ఎంతవరకు గుర్తిస్తోంది? పోలీసు వ్యవస్థలో ఆధునిక సాంకేతికత పెరిగింది. నేరాల దర్యాప్తులో మార్పులు వచ్చాయి. సీసీ కెమెరాలు, సైబర్ నేరాల విశ్లేషణ, డిజిటల్ ఆధారాలు, ఆన్‌లైన్ ఫిర్యాదులు అందుబాటులోకి వచ్చాయి. అయితే సాంకేతికత పెరిగినంతగా పోలీసుల పని ఒత్తిడి తగ్గిందా? వారి కుటుంబ జీవితాలు మెరుగుపడ్డాయా? విధి నిర్వహణకు అవసరమైన విశ్రాంతి, ఆరోగ్య సంరక్షణ, మానసిక ప్రశాంతత అందుతున్నాయా? ఇవే ఇప్పుడు చర్చించాల్సిన కీలక ప్రశ్నలు.

### పోలీసు వ్యవస్థకు వందల ఏళ్ల చరిత్ర

భారతదేశంలో ఆధునిక పోలీసు వ్యవస్థకు బ్రిటిష్ పాలన కాలంలో రూపకల్పన జరిగింది. 1861 పోలీసు చట్టం ద్వారా పోలీసు వ్యవస్థ నిర్వహణ, నియామకాలు, క్రమశిక్షణకు సంబంధించిన విధానాలకు పునాది పడింది. అయితే తెలంగాణ ప్రాంతంలో అంతకుముందే నిజాం పాలనలో గ్రామస్థాయి రక్షణ వ్యవస్థలు, స్థానిక సిబ్బంది, కోత్వాలి వంటి పరిపాలనా వ్యవస్థలు ఉండేవి. కాలక్రమేణా పోలీసు శాఖ ఒక క్రమబద్ధమైన సంస్థగా అభివృద్ధి చెందింది. స్వాతంత్ర్యం తర్వాత ప్రజాస్వామ్య వ్యవస్థలో పోలీసుల పాత్ర మరింత విస్తరించింది. రాష్ట్రాల పునర్వ్యవస్థీకరణతో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ పోలీసు వ్యవస్థ ఏర్పడగా, 2014 జూన్ 2న తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత తెలంగాణకు ప్రత్యేక పోలీసు పరిపాలన కొనసాగుతోంది.

### నాటి పోలీసులకు.. నేటి పోలీసులకు మధ్య తేడా ఏమిటి?

ఒకప్పుడు పోలీసు విధుల్లో ప్రత్యక్ష గస్తీ, గ్రామాల్లో సమాచారం సేకరణ, స్థానిక వ్యక్తుల సహకారంతో నేరాల దర్యాప్తు, రికార్డుల నిర్వహణ ప్రధానంగా ఉండేవి. నేరం జరిగిన ప్రాంతాన్ని పరిశీలించడం, సాక్షులను విచారించడం, నిందితులను గుర్తించడం వంటి పనులకు ఎక్కువగా క్షేత్రస్థాయి అనుభవం, మానవ సమాచారమే ఆధారంగా ఉండేది. నేడు పరిస్థితులు పూర్తిగా మారాయి. సీసీ కెమెరాల ఫుటేజీ, మొబైల్ ఫోన్ల డేటా, డిజిటల్ చెల్లింపుల వివరాలు, సైబర్ ఫోరెన్సిక్ ఆధారాలు, సోషల్ మీడియా కార్యకలాపాలు వంటి అంశాలు దర్యాప్తులో కీలకమయ్యాయి. మహిళల భద్రత, సైబర్ మోసాలు, ఆర్థిక నేరాలు, మాదకద్రవ్యాల అక్రమ రవాణా, రోడ్డు ప్రమాదాల నియంత్రణ వంటి విభాగాల్లో ప్రత్యేక నైపుణ్యాలు అవసరమవుతున్నాయి. నేరాల స్వరూపం మారడంతో పోలీసుల శిక్షణ, పరికరాలు, దర్యాప్తు పద్ధతులు కూడా మారుతున్నాయి. అయితే ఆధునిక సాంకేతికత అందుబాటులోకి రావడం ఒక్కటే పోలీసు వ్యవస్థ మెరుగుపడిందనడానికి సరిపోదు. ఫిర్యాదుదారుడితో పోలీసులు ఎలా వ్యవహరిస్తున్నారు? బాధితుడికి సకాలంలో న్యాయం అందుతోందా? కేసుల దర్యాప్తు నాణ్యత పెరిగిందా? సిబ్బందికి సరిపడా విశ్రాంతి లభిస్తోందా? ప్రజలకు పోలీసులపై నమ్మకం పెరుగుతోందా? అనే అంశాల ఆధారంగానే వ్యవస్థ పనితీరును అంచనా వేయాలి.

### ఖాకీ దుస్తులు ధరించినంత మాత్రాన కష్టాలు కనిపించవు!

పోలీసు ఉద్యోగం అంటే కేవలం యూనిఫాం, అధికారం, జీతం మాత్రమే కాదు. అది నిరంతర అప్రమత్తతతో కూడిన బాధ్యత. సాధారణ ఉద్యోగాల్లో నిర్ణీత పని వేళలు ఉండే అవకాశం ఎక్కువగా ఉంటుంది. కానీ పోలీసులకు అత్యవసర పరిస్థితుల్లో విధి వేళలు మారిపోవచ్చు. రాత్రి గస్తీ, బందోబస్తు, పండుగల విధులు, ఎన్నికల నిర్వహణ, నేరస్థల పరిశీలన, కోర్టు హాజరులు, విచారణలు, ఉన్నతాధికారుల సమీక్షలు వంటి పనులు ఒకదాని వెంట మరొకటి రావచ్చు. ఒక కానిస్టేబుల్ విధులకు వెళ్లినప్పుడు ఎప్పుడు తిరిగి వస్తాడో కుటుంబ సభ్యులకు స్పష్టత ఉండకపోవచ్చు. పిల్లల పాఠశాల కార్యక్రమాలకు హాజరుకాలేని పరిస్థితులు ఎదురుకావచ్చు. తల్లిదండ్రుల అనారోగ్య సమయంలోకూడా విధుల కారణంగా వెంటనే వెళ్లలేకపోవచ్చు. కుటుంబంలో ముఖ్యమైన కార్యక్రమం ఉన్నా బందోబస్తు విధులు ఉంటే హాజరు కావడం కష్టమవుతుంది. అయితే ప్రతి పోలీసు ఉద్యోగి పరిస్థితి ఒకేలా ఉండదు. విభాగం, హోదా, పోస్టింగ్, విధుల స్వభావం, సిబ్బంది అందుబాటు వంటి అంశాలను బట్టి పని ఒత్తిడి మారుతుంది. అయినప్పటికీ క్షేత్రస్థాయి పోలీసుల పని పరిస్థితులు, విశ్రాంతి, కుటుంబానికి కేటాయించే సమయం గురించి సమగ్రంగా చర్చించాల్సిన అవసరం ఉంది.

### పోలీసుల ఆరోగ్యంపై అధ్యయనాలు ఏం చెబుతున్నాయి?

తెలంగాణలోని సిద్ధిపేట జిల్లాలో 2022 మార్చి నుంచి మే వరకు 1,172 మంది పోలీసు సిబ్బందిపై నిర్వహించిన ఒక అధ్యయనం పోలీసుల ఆరోగ్యం, పని ఒత్తిడి, జీవనశైలిపై కీలక అంశాలను వెల్లడించింది. ఆ అధ్యయనంలో పాల్గొన్న వారిలో 43.3 శాతం మంది అధిక స్థాయి విధి సంబంధిత ఒత్తిడిని ఎదుర్కొంటున్నట్లు నమోదైంది. 22.3 శాతం మందిలో అధిక రక్తపోటు, 19.7 శాతం మందిలో మధుమేహం ఉన్నట్లు అధ్యయనం గుర్తించింది. 58 శాతం మంది అధిక బరువు లేదా ఊబకాయంతో ఉన్నట్లు నివేదించింది. ఇవి సిద్ధిపేటలో అధ్యయనం చేసిన నమూనాకు సంబంధించిన గణాంకాలు మాత్రమే; తెలంగాణ పోలీసులందరికీ వర్తించే రాష్ట్రవ్యాప్త శాతాలుగా వీటిని పరిగణించరాదు. అయినప్పటికీ పోలీసుల ఆరోగ్య సంరక్షణ, క్రమబద్ధమైన వైద్య పరీక్షలు, వ్యాయామం, ఒత్తిడి నిర్వహణకు ప్రాధాన్యం ఇవ్వాల్సిన అవసరాన్ని ఈ అధ్యయనం సూచిస్తోంది.

### తెలంగాణ పోలీసు సిబ్బంది సంఖ్య ఎంత?

తెలంగాణ పోలీసు సిబ్బంది సంఖ్య విషయంలో అధికారిక గణాంకాలను పరిశీలిస్తే రెండు రకాల సమాచారాన్ని వేర్వేరుగా చూడాలి. ఒకటి ప్రభుత్వ శాఖలో మంజూరైన పోస్టుల సంఖ్య. రెండోది వాస్తవంగా విధుల్లో ఉన్న సిబ్బంది సంఖ్య. బ్యూరో ఆఫ్ పోలీస్ రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్ (BPR&D) విడుదల చేసిన Data on Police Organizations 2024 ప్రకారం, 2024 జనవరి 1 నాటికి తెలంగాణ రాష్ట్ర పోలీసు బలగానికి మొత్తం 86,056 పోస్టులు మంజూరయ్యాయి. వాస్తవంగా పనిచేస్తున్న సిబ్బంది సంఖ్య 61,620గా నమోదైంది. ఈ లెక్కల ప్రకారం మంజూరైన పోస్టులకు, వాస్తవ సిబ్బందికి మధ్య వ్యత్యాసం 24,436 పోస్టులు. అంటే మంజూరైన మొత్తం పోస్టుల్లో సుమారు 28.4 శాతం మేర ఖాళీగా ఉన్నట్లు ఈ గణాంకాల ఆధారంగా లెక్కించవచ్చు. ఇది 2024 జనవరి

మరోవైపు, తెలంగాణ ప్రభుత్వ 2025-26 బడ్జెట్ పత్రంలోని డైరెక్టర్ జనరల్ అండ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ శాఖ విభాగంలో 2025-26 సంవత్సరానికి 94,833 పోస్టుల సంఖ్య చూపబడింది. ఇది ప్రభుత్వ శాఖ ఉద్యోగుల బడ్జెట్/పోస్టుల పట్టికకు సంబంధించిన సంఖ్య.

### సిబ్బంది కొరత ఉంటే ప్రభావం ఎవరిపై పడుతుంది?

పోలీసు శాఖలో సిబ్బంది కొరత ఉన్నప్పుడు దాని ప్రభావం కేవలం ఉద్యోగులపైనే కాకుండా ప్రజలకు అందే సేవలపైనా పడే అవకాశం ఉంది. అందుబాటులో ఉన్న సిబ్బందితోనే గస్తీ, ఫిర్యాదుల స్వీకరణ, కేసుల దర్యాప్తు, కోర్టు విధులు, బందోబస్తు, రాత్రి పహారా వంటి బాధ్యతలను నిర్వహించాల్సి రావచ్చు. ఒక పోలీస్ స్టేషన్‌లో ఒకేసారి అనేక కేసులు విచారణలో ఉంటే, ప్రతి కేసుకు తగిన సమయం కేటాయించడం సవాలుగా మారవచ్చు. నేరస్థల పరిశీలన, సాక్షుల విచారణ, పత్రాల తయారీ, కోర్టు పనులు, బాధితులతో సంప్రదింపులు అన్నింటికీ సమయం అవసరం. అందుకే పోలీసు శాఖలో ఖాళీలను భర్తీ చేయడం, సిబ్బందికి సరైన శిక్షణ ఇవ్వడం, ఆధునిక పరికరాలు అందించడం, పని విభజనను మెరుగుపరచడం కీలకం.

### పోలీసులు ఎక్కడ ఉంటారు? వారి కుటుంబ జీవితం ఎలా ఉంటుంది?

పోలీసులందరూ ఒకే రకమైన వసతుల్లో నివసించరు. కొందరు ప్రభుత్వ క్వార్టర్లలో ఉంటారు. మరికొందరు అద్దె ఇళ్లలో లేదా సొంత ఇళ్లలో కుటుంబాలతో జీవిస్తారు. పోస్టింగ్ ఉన్న ప్రాంతంలో కుటుంబాన్ని ఉంచగలిగే పరిస్థితులు, పిల్లల చదువులు, జీవిత భాగస్వామి ఉద్యోగం, బదిలీలు, ప్రయాణ సౌకర్యాలు వంటి అంశాలు వారి జీవన విధానాన్ని ప్రభావితం చేస్తాయి. విధులు ముగించుకొని ఇంటికి వచ్చినా, అత్యవసర పిలుపు వస్తే తిరిగి విధులకు వెళ్లాల్సిన పరిస్థితి ఉండవచ్చు. సెలవు మంజూరైనా అత్యవసర బందోబస్తు లేదా ఇతర విధుల కారణంగా ప్రణాళికలు మారవచ్చు. అయితే అన్ని విభాగాల్లోనూ పరిస్థితులు ఒకేలా ఉండవు. పోలీసుల నివాస వసతులు, కుటుంబ సంక్షేమం, పిల్లల విద్య, వైద్య సదుపాయాలు, మానసిక ఆరోగ్య సహాయం వంటి అంశాలను శాఖాపరంగా సమీక్షించడం అవసరం.

### పోలీసు వ్యవస్థ మెరుగుపడిందా?

ఈ ప్రశ్నకు సమాధానం పూర్తిగా అవును లేదా కాదు అని చెప్పడం సరైంది కాదు. సాంకేతిక పరిజ్ఞానం, కమ్యూనికేషన్ వ్యవస్థలు, డిజిటల్ ఆధారాల వినియోగం, ప్రత్యేక దర్యాప్తు విభాగాలు పోలీసు పనితీరులో మార్పులు తీసుకొచ్చాయి. కానీ ప్రజలకు సత్వర సేవలు అందుతున్నాయా, కేసుల దర్యాప్తు నాణ్యత పెరిగిందా, బాధితులకు న్యాయం అందుతోందా, సిబ్బంది ఆరోగ్యం మరియు కుటుంబ జీవితం మెరుగుపడ్డాయా అనే అంశాలను కూడా పరిశీలించాలి. పోలీసు వ్యవస్థ అభివృద్ధి అంటే కొత్త వాహనాలు, ఆధునిక కార్యాలయాలు, సీసీ కెమెరాలు మాత్రమే కాదు. ఫిర్యాదు చేయడానికి వచ్చే సాధారణ పౌరుడితో గౌరవంగా వ్యవహరించడం, బాధితుడికి భరోసా ఇవ్వడం, చట్టాన్ని నిష్పక్షపాతంగా అమలు చేయడం, నేరస్థుడిపై చట్టప్రకారం చర్యలు తీసుకోవడం, నిర్దోషులకు అన్యాయం జరగకుండా చూడడం కూడా అంతే ముఖ్యం. అదేవిధంగా పోలీసులకు సమయానికి విశ్రాంతి, తగిన సిబ్బంది, శాస్త్రీయ శిక్షణ, ఆరోగ్య సంరక్షణ, కుటుంబంతో గడిపే సమయం అందించడం కూడా సమర్థవంతమైన పోలీసు వ్యవస్థలో భాగమే.

### ప్రజల రక్షణ కోసం.. పోలీసుల సంక్షేమం కోసం

పోలీసు వ్యవస్థపై విమర్శలు వచ్చినప్పుడు తప్పులను పరిశీలించి బాధ్యత నిర్ణయించాలి. అదే సమయంలో విధి నిర్వహణలో నిజాయితీగా పనిచేసే సిబ్బంది ఎదుర్కొంటున్న సమస్యలను కూడా గుర్తించాలి. తప్పు చేసినవారిపై చర్యలు తీసుకోవడం, మంచి పనిని గుర్తించి ప్రోత్సహించడం రెండూ అవసరమే. పోలీసుల పని పరిస్థితులపై పారదర్శకమైన సమీక్షలు నిర్వహించడం, మానసిక ఆరోగ్య సహాయం అందించడం, క్రమబద్ధమైన వైద్య పరీక్షలు చేయించడం, సిబ్బంది కొరతను తగ్గించడం, సెలవులు మరియు విశ్రాంతికి ప్రాధాన్యం ఇవ్వడం, కుటుంబ సంక్షేమాన్ని మెరుగుపరచడం వంటి చర్యలు పోలీసుల పనితీరును మెరుగుపరచగలవు. ప్రజలు కూడా పోలీసులను కేవలం అధికారులుగా కాకుండా సమాజ భద్రత కోసం పనిచేసే మనుషులుగా చూడాలి. అదే సమయంలో పోలీసులు ప్రజల హక్కులను గౌరవిస్తూ, చట్టబద్ధంగా, జవాబుదారీతనంతో వ్యవహరించాలి.

### చివరగా.. ఖాకీ వెనుక ఉన్న మనిషిని గుర్తించాలి

పోలీసు విధుల్లో ఉన్నప్పుడు అతను ప్రజలకు రక్షకుడు. ఇంటికి వెళ్లినప్పుడు ఎవరికో తండ్రి, ఎవరికో తల్లి, ఎవరికో భర్త, భార్య, కొడుకు లేదా కూతురు. అతనికీ కుటుంబం ఉంది. ఆరోగ్యం ఉంది. భావోద్వేగాలు ఉన్నాయి. వ్యక్తిగత జీవితంపై ఆశలు ఉన్నాయి. ప్రజల భద్రత కోసం పనిచేసే పోలీసులకు అవసరమైన వనరులు, తగిన విశ్రాంతి, గౌరవప్రదమైన పని వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత. చట్టాన్ని గౌరవించడం, పోలీసుల మంచి పనిని గుర్తించడం, తప్పులను ప్రశ్నించడం ప్రజల బాధ్యత. పోలీసుల సంక్షేమం మెరుగుపడితేనే ప్రజలకు అందే సేవలు మరింత మెరుగుపడతాయి. ఖాకీ దుస్తుల గౌరవం పెరగాలంటే పోలీసుల విధి నిర్వహణలో జవాబుదారీతనం ఎంత అవసరమో, వారి జీవితాల్లో మానవీయతను గుర్తించడం కూడా అంతే అవసరం.

**ఎం రవీందర్**
**సీనియర్ జర్నలిస్ట్**
**7901503777**

# చుక్క నీటి కోసం మూగజీవాల ఆర్తనాదం!

- వర్షా భావంతో విలవిల..ఎండల వేడికి అల్లాడుతున్న పశువులు
- వాగులు, వంకలు, కుంటల్లో అడుగంటిన నీరు
- మేత కోసం అడవుల్లోకి వెళ్లి దాహంతో అవస్థలు
- నీటి తొట్టెలే మూగజీవాలకు జీవనాధారం

**పెద్దేముల్, అక్టోబర్ 11(ప్రజాక్షేత్రం):**

మాట్లాడలేవు.. తమ బాధను చెప్పుకోలేవు.. దాహంతో గొంతు ఎండిపోతున్నా ఎవరిని అడగాలో తెలియని నిస్సహాయత వాటిది.పచ్చిక కోసం అడవుల్లోకి వెళ్తున్న పశువులు, మూగజీవాలకు ప్రస్తుతం గుక్కెడు నీరే గగనమవుతోంది. ఒకవైపు వర్షాభావ పరిస్థితులు...మరోవైపు మండుతున్న ఎండలు...ఇంకోవైపు ఎండిపోయిన వాగులు, వంకలు, కుంటలు..వెరసి పెద్దేముల్ మండల పరిధిలోని పలు గ్రామాల్లో మూగజీవాలు తాగునీటి కోసం అల్లాడుతున్నాయి. పంటలు సాగు చేసిన రైతులు వర్షాల కోసం ఎదురుచూస్తుండగా, పశువుల పెంపకందారులు తమ జీవాల దాహార్తిని ఎలా తీర్చాలా అని ఆందోళన చెందుతున్నారు.

### వర్షా భావంతో మూగజీవాలకు కష్టకాలం

సాధారణంగా వర్షాలు కురిసిన సమయంలో వాగులు, వంకలు, చెరువులు, కుంటల్లో నీరు చేరుతుంది. దీంతో మేతకు వెళ్లే పశువులు అక్కడక్కడ నీరు తాగి దాహాన్ని తీర్చుకుంటాయి. అయితే ఈసారి ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో అనేక చోట్ల నీటి నిల్వలు తగ్గిపోయాయి. గతంలో నీటితో కళకళలాడిన జలవనరులు ప్రస్తుతం వెలవెలబోతున్నాయి. ఫలితంగా మేత కోసం అడవులు, పొలాల వైపు వెళ్లే పశువులకు తాగునీరు దొరకడం కష్టంగా మారింది. ఎండలో గంటల తరబడి తిరిగినా నీరు లభించకపోవడం మూగజీవాల పరిస్థితిని మరింత దయనీయంగా మారుస్తోంది.

### ఎండల వేడికి అల్లాడుతున్న పశువులు

పగటిపూట పెరుగుతున్న ఉష్ణోగ్రతలు పశువులకు మరిన్ని ఇబ్బందులు తెచ్చిపెడుతున్నాయి. ఎండలో మేత మేయడానికి వెళ్లిన పశువులకు శరీరంలో నీటి అవసరం పెరుగుతుంది. ఇలాంటి సమయంలో తగినంత తాగునీరు అందకపోతే వాటి ఆరోగ్యంపై ప్రతికూల ప్రభావం పడే ప్రమాదం ఉంది. ముఖ్యంగా దూడలు, వృద్ధ పశువులు, పాలిచ్చే పశువుల విషయంలో మరింత జాగ్రత్త అవసరం. పశువులు దాహంతో నీటి కోసం వెతుకుతూ తిరుగుతున్న దృశ్యాలు రైతులు, పశుపోషకులను కలచివేస్తున్నాయి. మూగజీవాల బాధను చూసి తట్టుకోలేని పరిస్థితి నెలకొంటోంది.

### నీటి తొట్టెలే మూగజీవాలకు ఆధారం

పెద్దేముల్ మండల పరిధిలోని కొన్ని గ్రామాల్లో ఏర్పాటు చేసిన నీటి తొట్టెలు పశువుల దాహార్తిని తీర్చడంలో ఉపయోగపడుతున్నాయి. జలవనరుల్లో నీరు అందుబాటులో లేకపోవడంతో ఈ తొట్టెల వద్దకు చేరుతున్న పశువులు నీరు తాగి ఉపశమనం పొందుతున్నాయి. అయితే వర్షాభావ పరిస్థితులు కొనసాగితే మరిన్ని ప్రాంతాల్లో నీటి కొరత తీవ్రమయ్యే అవకాశం ఉంది.అందువల్ల ఇప్పటికే ఏర్పాటు చేసిన తొట్టెల్లో నిరంతరం నీరు అందుబాటులో ఉండేలా చూడటంతో పాటు,నీటి సౌకర్యం లేని గ్రామాలు, అటవీ ప్రాంతాల సమీపంలో అవసరాన్ని బట్టి అదనపు తొట్టెలు ఏర్పాటు చేయాలని పశుపోషకులు కోరుతున్నారు.

### రైతుకు పంట బెంగ.. పశువులకు దాహం బెంగ!

వర్షాలు లేకపోవడంతో ఒకవైపు పొలాల్లో పంటలు ఎండిపోయే పరిస్థితులు కనిపిస్తుండగా, మరోవైపు పశువులకు మేత, తాగునీటి సమస్యలు ఎదురవుతున్నాయి.వ్యవసాయంతో పాటు పశుపోషణపై ఆధారపడి జీవనం సాగించే రైతులకు ఇది మరింత భారంగా మారుతోంది. పశువులు కేవలం మూగజీవాలే కాదు..రైతు కుటుంబాలకు జీవనాధారం కూడా.పాలు అందించి కుటుంబానికి ఆదాయాన్ని సమకూర్చే పశువులను కంటికి రెప్పలా కాపాడుకోవాల్సిన పరిస్థితుల్లో నీటి కొరత రైతులను ఆందోళనకు గురిచేస్తోంది.పంటను కాపాడుకోవాలనే తపనతో పాటు పశువుల దాహార్తిని తీర్చాల్సిన బాధ్యత కూడా వారిపై పడుతోంది.



### మూగజీవాల కోసం ముందస్తు చర్యలు అవసరం

ప్రస్తుత పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీలు, సంబంధిత అధికారులు సమన్వయంతో పశువులకు తాగునీరు అందించే చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. గ్రామాల్లో ఉన్న నీటి తొట్టెలను గుర్తించి వాటిని క్రమం తప్పకుండా నింపడం, నీటి వనరులు ఎండిపోయిన ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయడం, పశువులకు నీరు అందుబాటులో ఉండేలా పర్యవేక్షించడం అత్యవసరం. పశుపోషకులు కూడా సాధ్యమైనంతవరకు పశువులను తీవ్రమైన ఎండ సమయంలో మేతకు తీసుకెళ్లకుండా జాగ్రత్తలు పాటించాలి. పశువులకు నీడ కల్పించడం, తగినంత శుభ్రమైన తాగునీరు అందించడం ద్వారా ఎండల ప్రభావాన్ని తగ్గించవచ్చు. చుక్క నీటి కోసం మూగజీవాలు పడుతున్న అవస్థలు మానవత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి. ప్రకృతి కరుణించక వర్షాలు కురవని వేళ.. మనుషుల్లా తమ బాధను చెప్పుకోలేని పశువుల దాహాన్ని తీర్చడం సమాజ బాధ్యత. పెద్దేముల్ మండలంలోని ప్రతి గ్రామంలో మూగజీవాలకు తాగునీరు అందేలా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు, గ్రామస్థులు చొరవ చూపితే ఎన్నో జీవాలకు ఉపశమనం కలుగుతుంది.వాన చినుకు కోసం ఎదురుచూస్తున్న ఈ తరుణంలో.. కనీసం గుక్కెడు నీటితోనైనా మూగజీవాల ప్రాణాలకు భరోసా కల్పిద్దాం.

## హలో... ఇది ఆరంభమే

భాషతో సంబంధం లేకుండా విభిన్నమైన కథలతో ప్రేక్షకుల్ని అలరిస్తుంటారు అందాల తార మమితా బైజు. ఇటీవలే 'విశ్వనాథ్ అండ్ సన్స్', 'బెత్లెహోమ్ కుటుంబ యూనిట్' లాంటి చిత్రాలతో బాక్సాఫీసు వద్ద మంచి విజయాన్ని అందుకున్నారు. ప్రస్తుతం వరుస సినిమాలతో మంచి జోరుమీదున్న ఈ భామ 'హలో డియర్'లో నటిస్తున్న సంగతి తెలిసిందే. మమిత, సంగీత్ ప్రతాప్ ప్రధాన పాత్రల్లో రూపొందుతున్న చిత్రమిది. ఈ సినిమా జనవరి 29న థియేటర్లలోకి రాబోతుందని అధికారికంగా ప్రకటిస్తూ... సామాజిక మాధ్యమాల వేదికగా ఒక కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు మమిత.
ఈ నేపథ్యంలో "హలో' అనేది కేవలం ఆరంభం మాత్రమే. ఆ తర్వాత జరిగే ప్రతిదానిలోనే అసలైన మ్యాజిక్ ఉంది" అనే క్యాప్షన్‌ను జోడించారు. డినోయ్ పాలోస్ దర్శకత్వంలో ఆషిక్ ఉస్మాన్ నిర్మిస్తున్నారు. ఈ పోస్టర్‌లో మమితా, సంగీత్ సరదాగా నవ్వుతూ కబుర్లు చెప్పకుంటూ నడుస్తూ కనిపించిన తీరు సినీప్రియుల్ని ఆకట్టుకుంది. అనుకోకుండా వచ్చిన ఒక ఫోన్ కాల్ తర్వాత.. ఓ జంట గందరగోళ సంఘటనల్లో చిక్కుకోవడమే ఈ చిత్ర కథాంశమని సినీవర్గాలు తెలిపాయి. ప్రస్తుతం మమిత 'ఇరందు వానమ్'లో నటిస్తున్నారు.



## రొమాంటిక్ రైడ్‌కు రంగం సిద్ధం..

బాలీవుడ్‌లో విలక్షణమైన పాత్రలు ఎంచుకుంటూ, తన నటనతో ప్రత్యేకమైన గుర్తింపు తెచ్చుకున్న నటి భూమి పెడ్నేకర్. డిఫరెంట్ కాన్సెప్ట్ సినిమాలు చేస్తూ ప్రశంసలు అందుకున్న ఈ టాలెంటెడ్ బ్యూటీ.. ఇప్పుడు మరో ఆసక్తికరమైన ప్రాజెక్ట్‌తో ప్రేక్షకుల ముందుకు రావడానికి సిద్ధమయ్యారు. ఇమ్రాన్ ఖాన్ గ్రాండ్ రీఎంట్రీ ఇస్తున్న క్రేజీ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ 'అధురే హమ్ అధురే తుమ్' చిత్రంలో భూమి పెడ్నేకర్ హీరోయిన్‌గా నటిస్తున్నట్లు సమాచారం. 'కభీ కభీ అదితి జిందగీ మే..' పాటతో మిల్లీనియల్స్ మనసు దోచుకున్న ఇమ్రాన్ ఖాన్ చాలా కాలం తర్వాత మెయిన్ లీడ్ రోల్‌లో కనిపిస్తుండగా.. భూమి పెడ్నేకర్ పెర్ఫార్మెన్స్, ఆమె క్యారెక్టర్ ఈ సినిమాకు మెయిన్ హైలైట్‌గా నిలవనుందని తెలుస్తోంది. వైవిధ్యమైన స్క్రిప్టులు ఎంచుకోవడంలో పేరుగాంచిన భూమి, ఇమ్రాన్ కాంబినేషన్ తెరపై కొత్త మ్యాజిక్ క్రియేట్ చేయబోతోందని టాక్ నడుస్తోంది. ఈ చిత్రంలో గూర్ఫతేహ్ పీర్జాద కీలక పాత్రలో కనిపిస్తుండగా, ఫేమ్ దానిష్ అస్లామ్ దర్శకత్వం వహిస్తున్నారు. ఆమిర్ ఖాన్ ప్రొడక్షన్స్‌లో వచ్చిన 'హ్యాపీ పటేల్: ఖతర్నాక్ జసూస్' సినిమాలో చిన్న క్యామియో చేసిన ఇమ్రాన్.. ఇప్పుడు భూమి పెడ్నేకర్‌తో కలిసి చేయబోతున్న ఈ చిత్రం డిసెంబర్ 18న నేరుగా ఓటీటీ వేదికగా విడుదల కాబోతున్నట్లు సమాచారం.



## గ్యాంగ్‌స్టర్ మోడ్ యాక్టివేటెడ్!



ఇటీవలే 'ది ప్యారడైజ్' సినిమాతో ప్రేక్షకుల్ని పలకరించారు కథానాయకుడు నాని. అందులో ఆయన రెండు జడలతో ఊర మాస్ లుక్‌లో అందర్నీ అలరించిన సంగతి తెలిసిందే. అయితే ఇప్పుడాయన 'బ్లడీ రోమియో' కోసం పూర్తిగా స్టైలిష్ లుక్‌లోకి మారిపోయారు. 'ఓజీ' విజయం తర్వాత సుజీత్ దర్శకత్వం వహిస్తున్న చిత్రమిది. వెంకట్ బోయనపల్లి నిర్మిస్తున్నారు. ప్రస్తుతం పూర్వ నిర్మాణ పనుల్లో ఉన్న ఈ సినిమా వచ్చే వారం నుంచి చిత్రీకరణ ప్రారంభించుకోనున్నట్లు తెలిసింది. ఈ నేపథ్యంలోనే తాజాగా నానిపై ఫొటో షూట్‌ని పూర్తి చేశారు. దీనికి సంబంధించి ఓ ప్రత్యేక వీడియోను నెట్టింట పంచుకున్నారు. ''గ్యాంగ్‌స్టర్ మోడ్ యాక్టివేటెడ్.. ఇంక రచ్చ రచ్చే'' అంటూ దానికి ఓ ఆసక్తికర వ్యాఖ్యని జోడించారు. ఈ వీడియోలో నాని లుక్.. తన హెయిర్ స్టైల్ చూస్తుంటే మునుపెన్నడూ చూడని ఓ సరికొత్త స్టైలిష్ అవతారంలో సుజీత్ తనని చూపించనున్నట్లు అర్థమవుతోంది. ఇదొక వినూత్నమైన గ్యాంగ్‌స్టర్ యాక్షన్ డ్రామాగా ముస్తాబు కానుంది. నాని ఇందులో చెఫ్‌గా.. గ్యాంగ్‌స్టర్‌గా రెండు కోణాల్లో సాగే పాత్రలో అలరించనున్నారు. ఈ సినిమా సింహభాగం చిత్రీకరణ విదేశాల్లో జరగనుంది. ఇందులో ప్రీతి ముకుందన్ కథానాయికగా కనిపించనున్నట్లు ప్రచారం జరుగుతోంది.

## ఆ సినిమా ఫ్లాప్ నాకు పెద్ద గుణపాఠం నేర్పింది..



భిన్నమైన కథలను, విభిన్న పాత్రలను ఎంచుకుంటూ టాలీవుడ్‌లో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న యంగ్ హీరో కిరణ్ అబ్బవరం. వరుస ప్రాజెక్టులతో ఫుల్ బిజీగా ఉన్న ఆయన, ఇప్పుడు నటుడిగానే కాకుండా నిర్మాతగా, దర్శకుడిగా కూడా మారబోతూ తన మల్టీ టాలెంట్‌ను చూపిస్తున్నారు. 'గువ్వలచెరువు ఘూట్' సిరీస్‌తో ఓటీటీలోకి గ్రాండ్ ఎంట్రీ ఇవ్వడమే కాకుండా, 'రియాలిటీ' అనే సినిమాతో మెగాఫోన్ పట్టి దర్శకుడిగా మారనున్నారు. ఈ క్రమంలో తాజాగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో కిరణ్ అబ్బవరం తన కెరీర్, రాబోయే చిత్రాల గురించి ఆసక్తికర విషయాలను పంచుకున్నారు. నేటి సమాజంలో మధ్యతరగతి యువత ఎదుర్కొంటున్న పెళ్లి ఒత్తిళ్ల నేపథ్యంలోనే 'రియాలిటీ' సినిమా కథ సాగుతుందని కిరణ్ తెలిపారు. పెళ్లి చేసుకోవాలనుకునే ఓ కుర్రాడి జీవితంలో ఎదురయ్యే సరదా సంఘటనలను ఈ చిత్రంలో వినోదాత్మకంగా చూపించబోతున్నామని చెప్పారు. ఈ సినిమా కోసం నటనతో పాటు దర్శకత్వ, రచన బాధ్యతలను కూడా తానే స్వయంగా తీసుకున్నట్లు స్పష్టం చేశారు.
గత అనుభవాల గురించి మాట్లాడుతూ.. 2023లో విడుదలైన 'మీటర్' చిత్రాన్ని ప్రేక్షకులు తిరస్కరించడం తనకు పెద్ద గుణపాఠం నేర్పిందని కిరణ్ అబ్బవరం ఓపెన్‌గా అంగీకరించారు. సినిమాల్లో కొత్తదనం లేకపోతే జనాలు ఆదరించరని తనకు అర్థమైందని, ప్రేక్షకులు ట్రోల్ చేసేలోపే మనల్ని మనం సరిదిద్దుకోవాలని అన్నారు. అందుకే ఇప్పుడు తన తదుపరి చిత్రాల విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇక తన లైనప్ గురించి చెబుతూ.. శ్రీకాంత్ పుష్పాల దర్శకత్వంలో 'ఇంద్రపుత్ర' సినిమా చేస్తున్నానని, ఇది పీరియాడిక్ చిత్రం కాకపోయినా మైథాలజీ టచ్‌తో సాగే నేటితరం కథ అని చెప్పారు. ఇందులో కత్తులు తిప్పుతూ భారీ కాస్ట్యూమ్స్‌లో కనిపించనున్నట్లు తెలిపారు. అలాగే తాను నిర్మాతగా తెరకెక్కిస్తున్న 'హత' చిత్రం ప్రేక్షకులను కచ్చితంగా ఆకట్టుకుంటుందని, సినిమా ప్రారంభమైన 15 నిమిషాల తర్వాత ఆడియెన్స్‌ను సీటు అంచున కూర్చోబెట్టేలా ఈ థ్రిల్లర్ ఉంటుందని వివరించారు. ఇక తాను

## కోలీవుడ్‌లో మరో బంపర్ ఆఫర్ దక్కించుకున్న శ్రీదేవి..

'కోర్ట్' సినిమాతో ఒక్కసారిగా ఓవర్ నైట్ స్టార్‌గా మారిన ముద్దుగుమ్మ శ్రీదేవి.. ఆ తర్వాత వచ్చిన చిత్రం అంతగా వర్కౌట్ కాకపోవడంతో టాలీవుడ్‌లో కాస్త గ్యాప్ ఇచ్చారు. అయితే ఏమాత్రం నిరుత్సాహపడకుండా చెన్నై బాట పట్టిన ఆమె.. కోలీవుడ్‌లో వరుస ఆఫర్లతో దూసుకుపోతున్నారు. ప్రస్తుతం ఆమె ఏగన్ సరసన నటించిన 'హైకూ' సినిమా అక్టోబర్ 23న థియేటర్లలో సందడి చేయడానికి రెడీ అవుతోంది. ఈ నేపథ్యంలో.. తాజాగా శ్రీదేవి తన తదుపరి కొత్త సినిమాను అఫీషియల్‌గా అనౌన్స్ చేసి సర్ప్రైజ్ ఇచ్చారు. ఇన్‌స్టాగ్రామ్ వేదికగా తన కొత్త ప్రాజెక్ట్ టైటిల్‌ను రివీల్ చేస్తూ ఒక ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'కొంచెం మధురమైన జ్ఞాపకాలు, ఎంతో ప్రేమ, ఎప్పటికీ నిలిచిపోయే అనుభూతులు. కొన్ని కథలు ఎప్పటికీ ముగియవు.. అవి కేవలం మన జ్ఞాపకాల్లో నిలిచిపోయే క్షణం కోసం వేచి చూస్తుంటాయి. హృదయానికి దగ్గరైన, గుర్తుంచుకోవడానికి వేచి ఉన్న కథను మీకు పరిచయం చేస్తున్నాం" అంటూ చాలా క్యూట్ క్యాప్షన్ జోడించారు. ఈ చిత్రానికి 'యువర్స్ లవింగ్లీ' అనే ఆసక్తికరమైన టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఇందులో ఆకాశ్ ప్రేమ్‌కుమార్ హీరోగా నటిస్తుండగా.. శ్రీదేవి ఆయన సరసన అల్లరి చూపులతో కనువిందు చేయనున్నారు.ఈ యూత్ ఫుల్ మ్యూజికల్ లవ్ స్టోరీని ముత్తురామ్ మురుగన్ డైరెక్ట్ చేస్తుండగా.. ఎంఆర్ మోషన్ పిక్చర్స్ బ్యానర్‌పై మహేష్ సెల్వరాజ్ నిర్మిస్తున్నారు. ప్రస్తుతం ఈ సినిమా షూటింగ్ ఆఖరి దశకు చేరుకుందని, త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుందని మేకర్స్ తెలిపారు. మొత్తానికి తమిళంలో బ్యాక్ టు బ్యాక్ ప్రాజెక్ట్స్ తో శ్రీదేవి తన సత్తా ఏంటో నిరూపించుకుంటున్నారు.



## జెండర్‌తో సంబంధం లేదు..



'అలా మొదలైంది' సినిమాతో టాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇచ్చి మంచి పాపులారిటీ సంపాదించుకున్న నటి, సింగర్ స్నిగ్ధ నయని తాజాగా చేసిన వ్యాఖ్యలు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. కొంతకాలంగా సినిమాలకు దూరంగా ఉంటున్న ఆమె.. సింగింగ్ షోలతో పాటు సోషల్ మీడియాలోనూ ఫుల్ యాక్టివ్‌గా ఉంటున్నారు. అయితే ఇటీవల ఆమె ఓ అమ్మాయితో కలిసి పెళ్లి చేసుకున్నట్లుగా సోషల్ మీడియాలో ఓ వీడియోను షేర్ చేయడం పెద్ద సంచలనంగా మారింది. అంతేకాకుండా హనీమూన్‌కి కూడా వెళ్లడంతో ఆ వీడియోలు కాస్త వైరల్ కావడంతో నెటిజన్లు ఆమె నిజంగానే వివాహం చేసుకున్నారంటూ రకరకాలుగా చర్చించుకున్నారు. ఈ నేపథ్యంలో, తాజాగా ఒక యూట్యూబ్ చానెల్‌కి ఇచ్చిన ఇంటర్వ్యూలో స్నిగ్ధ ఈ పెళ్లి రూమర్లపై స్పందిస్తూ అసలు నిజం బయటపెట్టారు.
కేవలం సరదాగా రీల్స్ కోసం మాత్రమే ఆ వీడియో చేశానని, కానీ అందరూ దానిని నిజమైన పెళ్లి అనుకుని పొరబడ్డారని ఆమె స్పష్టం చేశారు. ఈ వీడియో చూసి తన బంధువులు కూడా నిజమేనని నమ్మి తనకు వరుసగా ఫోన్లు చేశారని గుర్తు చేసుకున్నారు. తమకు చెప్పకుండా రహస్యంగా పెళ్లి ఎందుకు చేసుకున్నావని బంధువులు నిలదీసినట్లు ఆమె తెలిపారు. ప్రస్తుతానికి తాను లెస్బియన్ కాదని, అమ్మాయినేనని క్లారిటీ ఇచ్చారు. ఇక తన మ్యారేజ్ ప్లాన్స్ గురించి మాట్లాడుతూ.. భవిష్యత్తులో తనకు మనసుకు నచ్చిన సరైన వ్యక్తి దొరికితే కచ్చితంగా పెళ్లి చేసుకుంటానని చెప్పారు. అంతేకాకుండా, జెండర్‌తో సంబంధం లేకుండా తనకు నచ్చిన వ్యక్తి అమ్మాయైనా సరే పెళ్లి చేసుకునేందుకు సిద్ధమేనని కుండబద్దలు కొట్టారు. ఒకవేళ తనకు తగిన తోడు దొరకకపోతే జీవితాంతం సింగిల్‌గానే ఉండిపోతానని స్నిగ్ధ స్పష్టం చేశారు. ప్రస్తుతం ఇందుకు సంబంధించిన వీడియోలు సోషల్ మీడియాలో వైరల్‌గా మారాయి.

## మ్యాజిక్ చూసేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నా..

ఇటీవల 'పూజా మేరీ జాన్', 'డెకాయిట్' వంటి విభిన్న చిత్రాలతో ప్రేక్షకులను మెప్పించిన టాలెంటెడ్ నటి మృణాల్ ఠాకూర్.. ఇప్పుడు మరో భారీ ప్రాజెక్ట్‌తో సందడి చేయడానికి సిద్ధమయ్యారు. బాలీవుడ్ ప్రముఖ కొరియోగ్రాఫర్, ఫిల్మ్‌మేకర్ గణేష్ ఆచార్య తన రియల్ లైఫ్ జర్నీ ఆధారంగా తెరకెక్కించిన బయోపిక్ డ్రామా 'గణేష్ డస్ట్ టు స్టార్‌డస్ట్' లో మృణాల్ భాగమయ్యారు. మాస్టర్‌జీ బయోపిక్‌లో భాగమవ్వడంపై మృణాల్ ఠాకూర్ స్పందిస్తూ సోషల్ మీడియాలో ఎమోషనల్ పోస్ట్ పెట్టారు. 'ఈ ట్రైలర్ కేవలం అందమైన విజువల్స్ మాత్రమే కాదు మాస్టర్‌జీ.. మీ కష్టానికి, ప్యాషన్‌కు అద్దం పట్టే రిఫ్లెక్షన్ ఇది. మీ ప్రయాణంలో రెండు పాటల ద్వారా నేను కూడా భాగస్వామి కావడం చాలా సంతోషంగా ఉంది.
వెండితెరపై మీరు క్రియేట్ చేయబోయే మ్యాజిక్ చూసేందుకు ఆత్రుతగా ఎదురుచూస్తున్నాను" అని మృణాల్ రాసుకొచ్చింది. ఇక విడుదలైన ట్రైలర్ అంచనాలను పెంచుతోంది. అతి సాధారణ స్థాయి నుంచి వచ్చి, అనేక కష్టాలు, కన్నీళ్లు దాటుకుని బాలీవుడ్ టాప్ కొరియోగ్రాఫర్‌గా ఎదిగిన గణేష్ ఆచార్య జీవిత కథ ఆధారంగా రాబోతుండటం సినీ ప్రియుల్లో భారీ అంచనాలు నెలకొన్నాయి. ఇక ఇందులో శివాంశు సోని, అలోక్ షా, సుకన్య కలన్ ప్రధాన పాత్రలు పోషించగా, గణేష్ ఆచార్య స్వయంగా కథ, దర్శకత్వం అందించారు. వి2ఎస్ ప్రొడక్షన్& ఎంటర్‌టైన్‌మెంట్ సమర్పణలో ఆయన కుమార్తె సౌందర్య ఆచార్య ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జునైద్ కుమార్ సంగీతం అందించిన ఈ సినిమా డిసెంబర్ 11న థియేట



Printed, Published and Owner by K PRAVEEN KUMAR, Printed at MR Publications, A-20, Vambay Colony, Upparpally, Ranga Reddy (Dist), Hyderabad, Telangana 500048. Published at H.NO. 2-50 Shankarpally, Ranga Reddy. Hyderabad, Telangana 501203. Editor: KPRAVEEN KUMAR. Phone number 9177920459, email id: prajakshetram1@gmail.com, https://prajakshetram.com PRGI NO. TGTEL/25/A2394